
# మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్

నారాయణ చౌధురి



TL
923.654
T 326 C

TL
923.654
T. 326 C



INDIAN INSTITUTE
OF
ADVANCED STUDY
LIBRARY, SHIMLA



# మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్

అట్టలోపలి వైపున అచ్చు వేసిన శిల్ప చిత్రంలో కనబడేది శుద్ధోదన మహారాజుకు, గౌతమబుద్ధుని తల్లియైన మహారాణి మాయాదేవికన్న స్వప్నం గురించి జ్యోతిష్కులు వ్యాఖ్య చేస్తూ ఉండిన దృశ్యం. వారికి దిగువ వారి వ్యాఖ్యను వ్రాసుకొంటున్న లేఖకుడు కనిపిస్తాడు. భారతదేశంలో లేఖన కళ చిత్రశిల్పంలో నిబద్ధమై లభించే దృష్టాంతాలలో ఇదే ప్రాచీనతమమైనది.

— నాగార్జునకొండ క్రీ. శ. 2వ శతాబ్దం.

— జాతీయ పురావస్తుశాల, న్యూఢిల్లీవారి సౌజన్యం

భారతీయ సాహిత్య నిర్మాతలు

# మహర్షి
# దేవేంద్రనాథ్ టాగూర్

మూలం :

**నారాయణ చౌధురి**

తెలుగుసేత :

**రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి**

సాహిత్య అకాడెమి

*Maharshi Devendranatha Tagore* — Telugu translation by R. Chandrasekara Reddy of Narayan Choudhuri's monograph in English, Sahitya Akademi (1988)
SAHITYA AKADEMI
REVISED PRICE Rs. 15-00

Library IIAS, Shimla
TL 923.654 T 326 C
00117682

© Sahitya Akademi
First Published : 1988.

TL
923.654
T 326 C

సాహిత్య అకాడెమి

ప్రధాన కార్యాలయం :
రవీంద్ర భవన్, న్యూఢిల్లీ - 110001

ప్రాంతీయ కార్యాలయాలు :
29, ఎల్డామ్స్ రోడ్, తేనాంపేట, మద్రాసు - 600 018
బ్లాక్ V - బి, రవీంద్ర స్టేడియమ్, కలకత్తా - 700 029
172, ముంబయ్ మరాఠి గ్రంథ సంగ్రహాలయ మార్గ్, దాదర్,
బొంబాయి - 400 014

117682
20/12/04

SAHITYA AKADEMI
REVISED PRICE Rs. 15-00

Printed at Stree Seva Mandir Press, Madras - 600 093

# విషయసూచిక


| అధ్యాయం | | పుటలు |
|---|---|---|
| 1. పుట్టుక - పూర్వాశ్రమం | — | 9 |
| 2. ధర్మమార్గంలో | — | 17 |
| 3. సంక్షోభం | — | 26 |
| 4. క్రొత్తకాంతి | — | 33 |
| 5. సంధికాలం | — | 40 |
| 6. కలతల బాటలో బ్రాహ్మోద్యమం | — | 48 |
| 7. ఆఖరి రోజులు | — | 52 |
| 8. సాహితీ సమాలోచనం | — | 57 |
| మహర్షి జీవితంలో ముఖ్యమైన తేదీలు - సంఘటనలు | — | 64 |
| సునంచిత గ్రంథసూచి | — | 69 |

# పరిచయం

మహర్షి దేవేంద్రనాథటాగూర్ ప్రధానంగా మతనాయకుడు. ఆయన సాహితీ రచనలన్నీ ఒక రకంగా యాదృచ్ఛికాలే. తన మత విశ్వాసాలను మంచి భాషలో, తీర్చి దిద్దిన పద్ధతిలో చెప్పడానికి ఆయన చేసిన ప్రయత్న ఫలితాలే ఆ రచనలు. నిజానికి ఆయన సాహిత్య జీవితం (ఆవిధంగా పిలవా లనుకుంటే) ఆయన మత జీవితం అంతర్భాగమే. ఆయన జీవించిందీ సంచరించిందీ, సంలీనం చెందిందీ మతంలోనే. పందొమ్మిదో శతాబ్దపు బెంగాల్ మత చరిత్రలో ఒకరిద్దరిని మినహాయిస్తే, దేవేంద్రనాథ్‌ను మించిన దైవలోలుని చూడలేం.

భారతదేశంలో ఆంగ్లేయ పాలనవల్ల బెంగాల్లో ప్రారంభమైన సర్వతో ముఖ పునరుజ్జీవనంలో ఒక భాగం మత పునరుజ్జీవనం. అది ప్రసాదించిన ఉత్తములలో దేవేంద్రనాథ్ ఒకరు. అప్పట్లో పాశ్చాత్యప్రభావాన్ని - అది మంచిదైనా చెడ్డదైనా - భరించగల ప్రాంతాల్లో బెంగాల్ మొట్టమొదటిది. ఈ పరస్పర సంబంధం వల్ల సంక్రమించిన మేళ్ళలో మరువలేని అంశం, పైన పేర్కొన్న మతపునరుజ్జీవనం. ఇందులో రామ్మోహనరాయ్ మత్, సాంఘిక విద్యారంగాల్లో మార్గదర్శకమైన ప్రయత్నాలు చేసి అగ్రగామి అయ్యారు. ఆయనకు ప్రత్యక్షవారసుడు దేవేంద్రనాథ్. ఆయన అసంపూర్ణంగా వదిలిపోయిన పనిని, ప్రత్యేకించి మతసంస్కరణను పరిపూర్తి చేయవలసిన భారం దేవేంద్రనాథ్ మీద పడింది. కాలక్రమంలో రామ్మోహనరాయ్ తరానికి, తర్వాతి కాలంలో వచ్చిన మతనాయకులకు వారధి అయ్యారు దేవేంద్రనాథ్. మహర్షి కృషి విభిన్న క్షేత్రాలకు విస్తరించినదైనా మతం ప్రధానం. అదే కేంద్రం కూడా. అందుకే ఆయన దృష్టి, శక్తులు అన్నీ కూడా తప్పనిసరిగా మతమార్గంలో, మతం మీదికే మళ్ళాయి.

కాబట్టి మనం దేవేంద్రనాథ్ సాహితీ సంపదను మదింపు వెయ్యా లంటే, ఆయన మతవ్యక్తిత్వం అనే జ్యోతి వెలుగులో కృషి చేయాల్సి ఉంటుంది. నిజానికి ఈ రెంటిని విడివిడిగా చూడలేం. ఆయన సాహిత్యాన్ని అనుశీలింపదలచిన వారిని అప్రయత్నంగానే ఆయన ఆధ్యాత్మికతలోకి లాక్కు పోయేంతగా అవి కలిసి పోయాయి. దేవేంద్రనాథ్ ఎప్పుడైన మాట్లాడినా, కలం చేతబట్టినా ఆయన మతానుభవాల్ని - జీవుని వేదనల్ని, ఆధ్యాత్మిక సంఘర్షణల్ని – భగవంతునిలో లీనం కావడానికి పడే బాధల్ని వివరించటమే జరిగేది. ఆయన రచనల్లో 'ఆత్మజీవని' ఆత్మకథ అన్నది ఉత్తమోత్తమమైంది. అది కూడా ఆయన అంతర ప్రేరణల్ని స్పష్టంగా నివేదించుకున్న రచనమే; తనను తాను యౌవనంలోకి (దైవత్వంలో

పిండిన వ్యక్తిగ రూపించుకోవాలన్న అభిలాషను ప్రకటించడమే. అంతే తప్ప ఇంకొకటి కాదు. ఆయన రచనల్లో తర్వాత పేర్కొన్న దగింది "బ్రహ్మోధర్మర్‌భ్యాఖ్యాన్" బ్రహ్మధర్మప్రతిపాదన అన్నది. ఆ పేరే దాని తత్త్వాన్ని సూచిస్తుంది. దేవేంద్రనాథ్ బ్రహ్మసమాజ పీఠాధిపతిగా 1861-62 మధ్య కాలంలో చేసిన ప్రసంగాల సంకలనమే ఆగ్రంథం. అందులో ముప్పై ఏడు వ్యాసాలున్నాయి. అవి ఆయన సంకలనం చేసిన "బ్రహ్మోధర్మః" అన్న సుప్రసిద్ధ గ్రంథం లోని నిగుఢార్థాలుగల శ్లోకాల ప్రాముఖ్యాన్ని వివరిస్తాయి. ఆ గ్రంథం భారతీయ పవిత్ర గ్రంథాల్లోని స్వచ్ఛమైన, సున్నిత మైన ప్రసిద్ధ భావాలకు కోశాగారం. ఆయన ఇతర గ్రంథాలుకూడా దాదాపు అటువంటి ప్రత్యేక దర్శనం, దృక్పథం కలిగినవే. అనువైన స్థలాల్లో వాటిని స్పృశిస్తాను.

కాబట్టి దేవేంద్రనాథ్‌లోని సాహితీవేత్త జీవితంలోని ఘట్టాలను, లక్షణా లనుపరిశీలించడం అంటే దివ్యజ్ఞాన సత్యాన్వేషి జీవిత మార్గంలోని విశేష ఘట్టాలను పరిశీలించడం కూడా అవుతుంది. ఆయన జీవిత ప్రాచీన ఋషులు ఉపనిషత్తుల్లోను, సంస్కృత కావ్యాల్లోను చెప్పిన జీవిత సాధన కోసం చేసిన అన్వేషణమే. ఆయన సాహిత్యమంతా ఆ అన్వేషణను తిరిగి చెప్ప డమే. ఆయన రచనల్లో ప్రాచీన భారతీయ జ్ఞాన సారాంశమే ఆధునిక రూపంలో, ఆధునిక శైలిలో ప్రతిపాదింపబడింది. మతాగ్ని ఆయన వ్యక్తి త్వాన్ని తప్తంచేసి నరనరాల్లో వ్యాపించి, ఆయన్ని మతమే సర్వస్వమైన వ్యక్తిగా రూపొందించి, మరలా ఆయన సాహితీ ప్రతిభమీద దృష్టి సాధించ వలసిన ఆవశ్యకత ఉందా? ఆయన ఏదో ఒకవిధంగా ప్రసిద్ధులైన భార తీయ సాహిత్య నిర్మాతల్లో ఒకడు అని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం ఎందుకు కలుగుతున్నది? రచయితగా ఆయన ప్రత్యేకత ఏమిటి?

ఈ ప్రశ్నలకు సమాధానం ఉంది. దేవేంద్రనాథ్ మతాన్వేషి అయినా సౌందర్యదృష్టి లేని, జీవన స్రవంతిలోని మంచిపట్ల ఆసక్తిలేని శుష్కవ్యక్తి కాడు. ఆయన కలకత్తాలో అనేక వ్యాపకాలకు నిలయమై, బెంగాల్ సాంస్కృ తిక జీవనంలో అభ్యుదయ ఉద్యమాలకు ముందు నిలచే సంపన్నమైన, విలాసయుతమైన వంశవృక్షంలో పుట్టిన మొలక. ఆయన జన్మించిన జొరశాంకోఠాగుర్‌బడి వంశానికి కళాప్రీతి ప్రముఖమైన లక్షణం. ఆయన పుట్టిపెరిగిన పరిసరాలు వైభవాలకు, ఆడంబరాలకు ఆలవాలమైనవి. ఎంతో శోభాయమానమైనవి. అయినప్పటికీ ఆయన నిండు యౌవనంలోనే భగవంతుని పట్ల ఆకర్షితుడై, ప్రాపంచిక సుఖాలను త్యజించాల్సిన అవ సరాన్ని భావించడం నిజంగా అద్భుతం. ఆయన తండ్రి, రాజా ద్వారకనాథ్

టాగూర్ ఆనాటి కలకత్త ధనవంతుల్లో ఒకరు. దయాశీలి. ఆనాటి అభ్యుదయోద్యమాలన్నిటి పట్ల సానుభూతి కలవారు. రామ్మోహన రాయ్‌కి స్నేహితుడు, సహచరుడు. డబ్బును బాగా ఖర్చు చెయ్యడంలో పేరు పొందిన వారు. ఆయన కొడుకు దేవేంద్రనాథ్ భౌతిక జీవితంలోని వైభవాన్ని, వైవిధ్యాన్ని చవిచూచారు. నిజానికి ఆయన వాటి మధ్య జీవించారు. అయినా తనకు తానే ఆ విలాస జీవితం నుండి క్రమంగా దూరమై, ధ్యానం మీద, ప్రార్థన మీద దృష్టిని కేంద్రీకరించారు. భౌతికమైన సంకెలలు అంటరానిదిగానే నిలిచి పోగా, ఆయన ఒక అంతర్ముఖగ మారి పోయారు. ఆంతర వ్యక్తిగా అంటే స్వార్థపరుడుగా అని కాదు. భగవంతునిలో నివసిస్తూ ఆయన సాన్నిహిత్యం కోసం కృషి చేసేవాడుగా అని అర్థం.

అయితే ఆయన ఆంతరంగికాన్వేషణ ఎటువంటిదైనా కావచ్చుగాని, వంశ పారంపర్యంగా ఉన్న రూప సౌందర్యతృష్ణ మాత్రం అమితంగా సంక్రమించింది. ఆయన రచనలన్నీ వచనాలే, కొన్ని శ్లోకాలు, పాటలు తప్ప. ఆ వచనాలను దుర్వ్యాఖ్యానం చేసినవాళ్ళు కూడా ఆయన శైలిలోని సమతా సంయమనాలను, అభివ్యక్తిలోని సాంద్రతా గాంభీర్యాలను, అన్నిటినీ మించిన ప్రకృతి సౌందర్య దర్శనంలోని గాఢతనుచూచి ఆశ్చర్యపడక తప్పలేదు.

ఆయన ఆత్మకథ ప్రత్యేకించి ఉత్తరార్థం చదవదగింది. అందులో ఆయన తన జీవిత మధ్యాహ్నంలో ఒంటరితనాన్ని, శాంతిని వెతుకుతూ హిమాలయాలను సందర్శించినప్పటి అనుభవాలను రాశారు. ఆ వ్యాక్యాలు ఆయన ప్రకృతి ప్రీతికి, అద్భుత కవితాత్మక భాషకు నికషోపలాలు. "పత్రాబళి" అనే ఆయన లేఖలు కూడా అటువంటివే. ఆయన కొడుకుల్లో విశిష్టుడు, ప్రసిద్ధి పొందిన కవి, సృజనకళాగుణాల కూడలి అయిన రవీంద్రనాథటాగూర్, జీవితమంతా ప్రకృతి పట్ల తన జాగృతిని ప్రదర్శిస్తూనే రావడం గుర్తుంచుకోదగింది. రవీంద్రనాథ్ కవిత్వంలోని మార్మికతా లక్షణానికి మూలం ఆయన పూర్వికుల నుండే వచ్చినట్లు గుర్తించవచ్చు.

రామ్మోహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, అక్షయకుమార్‌దత్త, భూదేవ్ ముఖర్జీలతో బాటు దేవేం నాథ్ కూడా బెంగాలీ వచనం రూపు దిద్దుకొంటున్న కాలంలో ప్రధాన నిర్మాతల్లో ఒకరుగా చెప్పుకోవచ్చు. దానికి ఆయన చేసిన దోహదాన్ని విశదంగా చర్చించాల్సిన అవసరం ఉంది. రాబోయే అధ్యాయాల్లో పందొమ్మిదో శతాబ్దంలోని విశిష్టమైన వ్యక్తి జీవితం, ఆయన తన పదునైన బహుముఖ వక్తృత్వంతో బెంగాలీ సమాజాన్ని సుసంపన్నం చేయడం - ఈ రెండూ పక్కపక్కనే చర్చింప బడతాయి.

## ఒకటో అధ్యాయం

# పుట్టుక - పూర్వాశ్రమం.

మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్ కలకత్తా నగరంలో 1817 మే నెల పధ్ధెనిమిదో తేదీ జన్మించారు. పందొమ్మిదో శతాబ్దంలో చాలా సంపన్న మైన విలాసయుతమైన బెంగాలీ కుటుంబాల్లో జొరశాంకో టాగూర్ కుటుంబం ఒకటి. ఈ వంశవృక్షంలోని మొలకే రాజా ద్వారకనాథ టాగూర్. ఆయన పెద్ద కొడుకే దేవేంద్రనాథ టాగూర్. దాతృత్వంలో, ఆనాటి మత, సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో సాగిన అభ్యుదయ సంస్కరణోద్యమాల్లో పాల్గొనడంలో ప్రసిద్ధికెక్కిన ఆ కుటుంబం, మత, కళా రంగాల్లో పేరు మోసిన మహర్షితో సహా రవీంద్రనాథ టాగూర్, అవనీంద్రనాథ టాగూర్ వంటి అనేకమంది బెంగాల్ పుత్రుల్ని ప్రసాదించింది. దేవేంద్రనాథ్‌కు గిరీంద్రనాథ్, నాగేంద్రనాథ్ అని ఇద్దరు తమ్ముళ్ళుండేవారు. ఇంకిద్దరు సోదరులు చిన్న వయసులోనే చనిపోయారు.

ద్వారకనాథ్ అన్నివిధాల ఒక అపూర్వమైన వ్యక్తి. టాగూర్లు ప్రాథమికంగా గొప్ప భూస్వాములు. వారికి బెంగాల్లో చాలాచోట్ల రాష్ట్రం వెలుపలి ప్రాంతాల్లోను ఎస్టేట్లుండేవి. కాని, శక్తియుక్తులు, ఉన్నతాశయాలు గల ద్వారకనాథ్ మాత్రం ఇతర భూస్వాముల్లాగా జమీందార్లకు నమ్మకంగా వచ్చే ఆదాయంతో సంతృప్తిపడిపోయి అనేక రకాల నగర వినోదాల్తో కాలం గడిపేసేవారుకారు. తూర్పిండియా కంపెనీలో ఉద్యోగిగా చేరారు. పట్టుదలతో చేసిన కృషివల్ల, చాకచక్యం వల్ల కంపెనీ దివాన్ వంటి బాధ్యతాయుతమైన స్థాయికిచేరి, కలెక్టరేట్ అధీనంలోని ఇరవై నాలుగు పరగణాలకు 'ఉప్పు ఏజెంటు' వరకు ఎదిగారు. ఇంకా పై స్థాయికి వెళ్ళేవారే. కాని, పనిచేయడం మీద ఆయనకున్న శ్రద్ధా సక్తుల వల్ల కాలి గుదినరం తెగ్గొట్టుకొని ఎల్లకాలం ఒకరిమీద ఆధారపడి బ్రతకడానికి ఇష్టపడలేదు. ఆరేళ్ళ ఉద్యోగం చేసి మానుకొని కొందరు భాగస్వాములతో కలిసి "కార్, టాగూర్ అండ్ కంపెనీ" అనే పేరుతో స్వతంత్రంగా వ్యాపారం ప్రారంభించారు. చాలాచోట్ల పట్టుపరిశ్రమలు స్థాపించారు. చక్కెర ఫ్యాక్టరీలు ప్రారంభించారు. రాణిగంజ్ ప్రాంతంలో

బొగ్గుగనులు సంపాదించారు. ఉప్పు, సూరేకారం, బొగ్గు మొదలైన వ్యాపారాల్లో తారాస్థాయి నందుకొన్నారు. ఈవిధంగా ఆయన గొప్ప స్థితికి చేరుకొన్నారు. ఇంకా బెంగాల్లోను, ఒరిస్సావంటి సుదూర స్థలాల్లోను కొత్త కొత్త జమీందారీ ఎస్టేట్లు సంపాదించారు. ద్వారకనాథ్ క్రమంగా బ్యాంకు వ్యాపారంలో కూడ ప్రవేశించారు. ఆయన స్థాపించిన 'యూనియన్ బ్యాంకు' కలకత్తాలో బెంగాల్ మేనేజిమెంట్లోని మొట్టమొదటిది.

ఇవన్నీ ఆయన జీవితంలో సాధించిన వాటిల్లో ఒక భాగం మాత్రమే. ద్వారకనాథ్ కలకత్తా నగరంలో తన సంపద ద్వారా, ఉన్నత స్థితి ద్వారా పొందిన అశేషమైన సాంఘిక పలుకుబడిని సద్వినియోగం చేశారు. ఆయన నిరంతర పరోపకారి. గొప్ప ధర్మకర్త. దాక్షిణ్య శీలి. రామమోహన రాయ్‌కి గొప్ప అభిమాని, స్నేహితుడు. శ్రీరాయ్ బెంగాలీ సమాజ శ్రేయస్సు కోసం తలపెట్టిన మత సాంఘిక సంస్కరణలకు ధనసహాయం చెయ్యడానికి ముందుకురికేవారు. 'సతీసహగమనం' అనే భయంకరాచారం (భర్త చనిపోతే భార్యను కూడా ఆ చితిపైనే కాల్చి చంపడం) రూపుమాపడంలో, బెంగాల్లో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టడంలో, ప్రాంతీయ భాషా పత్రికల హక్కుల్ని అభివృద్ధి చేయడంలో, వేదాంత ప్రాతిపదిక మీద తాను స్థాపించిన బ్రహ్మ సమాజాన్ని నిర్వహించడంలో ఇంకా అనేకమైన అభ్యుదయ సంస్కరణల్లో రామమోహనరాయ్ ద్వారకనాథ్ నుండి హార్దికంగా, ఆర్థికంగా అమితమైన సహాయాన్ని పొందారు. ఒక్కమాటలో చెప్పాలంటే ద్వారకనాథ్ ఆనాటి సమాజంలో ఒక గొప్ప శక్తిగా గుర్తించదగిన వ్యక్తి. చైతన్యవంతమైన లిబరల్ బూర్జువాల అడుగుజాడల్లోనే ఆయన తన శక్తినంతా సాంఘిక స్తబ్ధతను ఛేదించి, జాతిని అభ్యుదయ ఆలోచనాపథంలో నడిపించడానికి ఉపయోగించారు.

ద్వారకనాథ్ ఆర్భాటంపట్ల ఆడంబరం పట్ల వ్యామోహమున్నవారు. ఆయన యూరోపియన్లతో సులభంగా కలిసిపోయేవారు. నగరానికి ఉత్తర సరిహద్దులో ఉండిన 'బెల్గాచియా విల్లా' అనే శృంగార ఉద్యానవనంలో వాళ్ళకు పెద్ద పెద్ద విందులిచ్చేవారు. ఇంట్లో వంశానుగతంగా వస్తున్న వైష్ణవంపట్ల నమ్మకం కలిగినవాడైనా, ద్వారకనాథ్, వ్యాపారం మీద శ్రద్ధవల్ల ఇటువంటి ఖరీదైన విలాసాలలో దిగవలసి వచ్చేది. అయినా ఆచారం కోసమే ఆచారం అన్నదానికి ఆయన అతీతులు. ఆ రోజుల్లో ఉన్న మూఢ విశ్వాసాలను ఎదిరించి ద్వారకనాథ్ రెండుసార్లు సముద్రాలను దాటి ఇంగ్లండుకు వెళ్ళారు. అక్కడ ఒక రాకుమారుడుగా జీవించారు. నిజానికి ఆయన పేరుకు ముందున్న 'రాజా' అనే పదం ఇంగ్లండులో అతని

వైభవోపేతమైన జీవితం వల్ల వచ్చిందే. ఆయన ఇంగ్లండులో 1846 ఆగస్టు ఒకటో తేది మరణించారు.

దేవేంద్రనాథ్ ఎటువంటి వాతావరణంలో పెరిగి పెద్దవాడయ్యారో అవగాహన కలగడం కోసం నేపథ్యంగా ద్వారకనాథ్ జీవితం సమీక్షింపబడింది. దేవేంద్రనాథ్ వైభవాల ఒడిలోపుట్టి, నగరానికి నడిబొడ్డువంటి కుటుంబంలో బాల్యయౌవనాలను గడిపారు. ఆయనకు కోరికలు తక్కువ. కష్టాలు పూజ్యం. ఆయన చిన్ననాటి రోజులు సకల భోగాలతో గడిచాయి. తన ఆత్మకథలో ఆయనే రాసుకొన్నట్లు బాల్యంలో కొన్ని చిలిపిచేష్టలు, కొంటెపనులు కూడా చేశారు.

దేవేంద్రనాథ్‌కు తన అవ్వదగ్గర ఎక్కువ చనువు ఉండేది. ఆమెకు మతం మీద గట్టి నమ్మకం. ఏడాది పొడుగునా హిందూ కుటుంబానికి సహజమైన నోములు, వ్రతాలు నిర్వర్తించడంలో మునిగి ఉండేది. దేవేంద్రనాథ్ మత కార్యక్రమాలన్నిటిలో ఆమెను నీడలాగా అనుసరిస్తూ వచ్చారు. ప్రార్థన, ఆరాధనలు విగ్రహారాధనకు సంబంధించిన విశ్వాసాలకు ఆచారాలకు పరిమితమైనవే అయినా - వాటివల్ల బాల్యం నుండి గట్టి శ్రద్ధను అభివృది చేసుకొన్నారు.

అయితే రెండు సంఘటనలు అతని జీవిత గమనాన్నే మార్చేశాయి. ఒకటి తన పద్నాలుగో ఏట ఒకరోజు రాత్రి నక్షత్ర శోభితమైన ఆకాశాన్ని చూడగా సృష్టిలోని విశిష్టత హఠాత్తుగా అతని మనస్సులో తారట్లాడింది. 'అనంతమైన ఈ ఆకాశం, అనంతమైన ఈ విశ్వం ఆద్యంత సహితమైన శక్తిచేతిపని అయి ఉండదు - అన్న భావం అతని మనస్సులో గాఢంగా నాటుకొన్నది. ఆ భావం అతనిలో గట్టిపడింది. అప్పటినుండి సాలగ్రామ శిల మొదలైన ప్రతిమల రూపాల్లో ఉన్న దేవుళ్ళను, దేవతలను ఆరాధించకుండా మానేయడం ప్రారంభమైంది'. (భారతీయ బ్రహ్మసమాజం వారి స్వాగతోపన్యాసానికి బదులు).

రెండు : తర్వాత ఏడు సంవత్సరాలకు దేవేంద్రనాథ్ అవ్వ చనిపోయినప్పుడు జరిగింది. ఆరోజుల్లో చనిపోనున్న ముసలివారిని గంగాతీరాలకు తీసుకుపోయి ఊపిరిపోయేవరకు అక్కడ పడుకోబెట్టడం ఆచారంగా ఉండేది. దీన్ని 'అంతర్జలి' అంటారు. ఇది చనిపోయేవారికి అర్హతను సంపాదించే ప్రక్షాళన కార్యక్రమం వంటిది. అందుకే దేవేంద్రనాథ్ అవ్వను కూడా అక్కడికి తీసుకుపోయారు. అప్పటికింకా ఆమె మరణించలేదు. ఆమె మరణించబోయే ముందటిరోజు దేవేంద్రనాథ్ నదిగట్టు మీద దహన

వాటికలో అవ్వ ప్రక్కన ఒక తుంగ చాపమీద ఒదిగి కూర్చొని ఉన్నారు. అప్పుడు ఒక అనిర్వచనీయమైన ఆనందపారవశ్య భావన అతని మనసులో మెరిసి, అతని ప్రాపంచిక దృక్పథాన్నే మార్చేసింది. ఆయన తన ఆత్మ కథలో "ఇంతలో ఒక విచిత్రమైన అనాసక్తత నా మనసును చుట్టుముట్టింది. ఇక నేను పూర్వపు మనిషిని ఎంతమాత్రం కాను. వైభవాలపట్ల నాలో అసహ్యత పెరిగింది. నేను కూర్చున్న తుంగ చాపే నాకు ఉచితమైందిగా తోచింది. తివాసీలు, పరుపులు మొదలైనవి విసర్జనీయాలుగా కనబడ్డాయి. నా హృదయం ఇంతకు ముందెప్పుడూ పొందని ఆనందంతో నిండిపోయింది' అని ఆయనే చెప్పుకొన్నారు. ఆ సంవత్సరం 1838 దేవేంద్రనాథ్‌కు అప్పటికి ఇరవయ్యొక్క సంవత్సరాల వయస్సు.

అయితే ఆ పారవశ్యం ఎంతోకాలం నిలవలేదు. అది ఆ రాత్రే ఆవిరైపోయింది. అప్పటినుండి ఆ అనుభూతిని తిరిగిపొందాలని తీవ్ర ప్రయత్నం చేశారు. కాని ఫలితం దక్కలేదు. అతని ప్రయత్నం తీవ్ర తరమౌతున్న కొలది, అది అతనిలో నిరాశా నిస్పృహల్ని మిగిలిస్తూ అతిదూరమైపోయింది. అతని పరిస్థితి దుర్భరమైంది. ప్రాపంచిక సౌఖ్యాలన్నీ అర్థరహితాలయ్యాయి. రోజుల తరబడి సాయంకాలంపూట ఏకాంతంగా ఈడెన్ గార్డెన్స్‌లో స్మారక స్థూపం దగ్గర కూర్చొని దీర్ఘాలోచనామగ్ను డయ్యేవారు. కాని పాపం ఒక సామ్రాజ్యాన్నంతా ధారబోసినా ఆ బ్రహ్మా నందం కలిగేటట్లు లేదు. "భాగవతంలో భగవంతుడు భక్తునికి ఎప్పుడో ఒక్క క్షణం ప్రత్యక్షమై అదృశ్యమై పోతాడు. ఎందుకంటే, భక్తుడు తన అట్ల ఇతోధికంగా సాన్నిహిత్యాన్ని పెంపొందించుకోవడం కోసం, ఈ మధ్యలో పత్మక్షాళనకు అపరిమితమైన అవకాశాలు కలిగించడం కోసమే" అన్న నారదునిస్థితితో దేవేంద్రనాథ్ తన మనఃస్థితిని పోల్చుకొన్నారు.

పైరెండు సంఘటనలు దేవేంద్రనాథుని ఆత్మ మేల్కొన్నదని, భవిష్యత్తులో తనకు నివాసం కానున్న ఆధ్యాత్మిక కేంద్రంవైపు ఆయన క్రమంగానడుస్తున్నారని తెలియజేస్తాయి. బీజావాపన దశ దాటి సంపూర్ణా ధ్యాత్మిక జీవితం చివుళ్ళు తొడిగింది.

ఈలోగా దేవేంద్రనాథ్ బాల్య యౌవన దశలో చేసిన విద్యాభ్యాసం ఎటువంటిదో చూద్దాం. ఆరోజుల్లో కలకత్తా నగరంలోని సంపన్నుల పిల్లల్ని హిందూ కళాశాలకు పంపడం ఆనవాయితి. ఆ కళాశాల అప్పటికి కొన్నేండ్ల క్రితమే ఆంగ్ల విద్యావ్యాప్తికోసం స్థాపించబడింది. అప్పుడు దేవేంద్రనాథ్ తొమ్మిదీ పదేళ్ళ కుర్రవాడు. అది హిందూ కళాశాలలోని యువ బెంగాలీల పరువపు కాలం. వాళ్ళ ఉపాధ్యాయుడు 'హెన్రీ వివియన్ లూయీ డిరో

జియో" అనే ఒక ఆంగ్లో ఇండియన్. ఆయన శిక్షణలో వాళ్ళు పాశ్చాత్య బోధనా పద్ధతులపట్ల వ్యామోహాన్ని, ప్రాచ్యసాంప్రదాయిక అధ్యయనం పట్ల (వేదాంత పురాణాలపట్ల కూడా) విముఖతను పెంపొందించుకున్నారు. ఆ డిరోజియన్ శిష్యులందరూ ప్రతిభావంతులు. అందులో కొందరు విశిష్టమైన మేధ కలవారు. అయినా ఆ కాలానికి అనుగుణంగా నిరీశ్వర విద్యలో మునిగి పోయి, ప్రాచ్య పద్ధతిలో సాగే ఏ బోధననైనా ఆక్షేపించడం వారికి వాడుకగా ఉండేది. గోమాంసం తింటూ, మద్యపానం చేస్తూ వాళ్ళు తమ పూర్వీకుల్ని అపహాస్యం చేసేవారు. ఒక సమకాలిన విమర్శకుని మాటల్లో వాళ్ళు "కట్టుబాట్లు తెంచుకొని పంది మాంసాన్ని, గోమాంసాన్ని తినడం ద్వారా, గ్లాసులో బీరు తాగి స్వేచ్ఛగా విహరించడం ద్వారా" సనాతన హిందువుల్ని అవమానించారు.

బహుశా హిందూ కళాశాలలోని ఈ విద్యాధోరణి ద్వారాకనాథ్‌కు బాధ కలిగించి ఉండవచ్చు. అందుకే తన కుమారుని హిందూ కాలేజీకి కాక ఆంగ్లో హిందూ పాఠశాలకు పంపాలన్న ఆలోచన అతనికి కలిగి ఉండవచ్చు. ఆ స్కూలు కలకత్తా 'హెడువా' కు ఆగ్నేయంగా ఉండేది. ఈ పని రామ మోహనరాయ్ ప్రోత్సాహంతో చేశారు. ఆ స్కూలును రామమోహనరాయ్ స్థాపించి, ద్వారాకనాథ్ మొదలైన మిత్రుల ఆర్థిక సహాయంతో నడిపారు. దేవేంద్రనాథ్ ఆ బడిలో నాలుగేళ్ళకు పైగా చదివారు. బడికి సక్రమంగా పోయినందుకు, చదువులో నైపుణ్యం చూపినందుకు దేవేంద్రనాథ్ బహుమతులు సంపాదించారు. బహుశా 1831 సం॥ మధ్యలో ఆయన ఆంగ్లో పాఠశాల వదలి హిందూ కళాశాలలో చేరారు. 'డిరోజియో'ను ఉద్యోగం నుండి తొలిగించడం, కళాశాల పాలన భారం కొత్త గవర్నర్ల బోర్డుకు అప్పగించడం జరిగింది. దీనికీ దేవేంద్రనాథ్‌ను హిందూ కళాశాలలో చేర్పించాలని ద్వారకనాథ్ నిర్ణయించుకోవటానికీ కొంత సంబంధం ఉండవచ్చు. దేవేంద్రనాథ్ హిందూ కళాశాలలో మూడు సంవత్సరాలకు పైగా చదివారు. ఆ కళాశాల పెంపుడు తల్లిని పోలినదని అతని నిశ్చితాభిప్రాయం. ఆ కళాశాలలో వాడుకలోఉన్న నియమాలకు భిన్నంగ ఆయన గొప్ప స్వమతాభిమానిగా, గొప్పదేశభక్తుడుగా బెంగాల్‌భాషానురక్తుడుగ కళాశాలను వీడివచ్చారు. దేవేంద్రనాథ్ హిందూ కళాశాలలో చదువుల సారాన్ని పూర్తిగా పిండుకొన్నా, ఆ వాతావరణం ఆయన మానసిక జీవితం మీద చూపిన ప్రభావం అంతంత మాత్రమే.

దేవేంద్రనాథ్ మాతృభాషలో తనకు గల ప్రగాఢమైన సంబంధాన్ని నిర్దిష్టమైన పద్ధతిలో నిరూపించడానికి పూనుకొన్నారు. డిరోజియన్ శిష్యులు 'అకడమిక్ అసోసియేషన్' అని ఒక సంస్థను నిర్వహిస్తూ, అందులో రాజకీయ, మత, తత్వ, సమాజ శాస్త్రాలకు సంబంధించిన అనేకాంశాలను ఆంగ్లంలో చర్చించేవారు. డిరోజియన్ శిష్యుల ఈ సాహసానికి ప్రతిస్పర్ధిగా దేవేంద్రనాథ్, 'సర్వతత్త్వ దీపికా సభ' అనే పేరుతో ఒక సంస్థను స్థాపించారు. అందులో కార్యక్రమాలన్నీ కేవలం బెంగాలీ భాషలోనే నిర్వహింపబడేవి. ఈ పనివాళ్ళ మీద అంధ వైరంతో చేసిందికాదు. అన్నిరకాల పండిత గోష్ఠులలోను తగిన అభివ్యక్తి సాధనంగా బెంగాలీ భాషకు గల అర్హతను స్థాపించటానికే చేశారు.

ఈకాలంలో ఆయన శ్రద్ధాసక్తులతో సంస్కృతాన్ని చదువుకున్నారు. సంప్రదాయ సంగీతాన్ని కూడ అభ్యసించడానికి ప్రయత్నించారు. కొంత కాలం తర్వాత సంగీతాభ్యాసాన్ని మానేసి సంస్కృతాధ్యయనాన్ని మాత్రం కొనసాగించారు. ఈ కాలంలోనే దేవేంద్రనాథ్ బెంగాలీ భాషలో సంస్కృత వ్యాకరణం రచించినట్లు తెలుస్తున్నది. సాహిత్య రచన చేయడానికి కూడా శక్తివంచన లేకుండా ప్రయత్నించి, అచిరకాలంలోనే ఆ నైపుణ్యాన్ని సంపాదించారు.

ఇది ఆయన హిందూకళాశాల వదిలిన తర్వాత, అతనిలో పూర్తిగా మతజ్యోతి వికసించటానికి ముందు – జరిగిన సంఘటన. అప్పటిదాకా ఆయనలో మత సంస్కర్త రూపు దిద్దుకోలేదు. భవిష్యత్తులో అదే తన నిత్య చైతన్య కేంద్రం కాబోతుంది. కాని ఆ దిశను సూచించే చిహ్నాలు లేకపోలేదు. దేవేంద్రనాథ్ కుటుంబంలో పెద్దకొడుకుగా, వాళ్ళ ఎస్టేట్ల మీద వాళ్ళ నాయన చేస్తున్న సాహసోపేతమైన అనేక వ్యాపారాల మీద శ్రద్ధ చూపాల్సి ఉండేది. కాని అలా జరుగలేదు. దానికి బదులు ఆయన తన కాలాన్ని శ్రద్ధను చదువుకు, మౌనధ్యానానికి వినియోగించ బూను కొన్నారు. లౌకిక విషయాల పట్ల విరక్తిని కాకపోయినా, పరాఙ్ముఖతను చూపుతూ సాధ్యమైనంతవరకు వాటికి దూరంగా ఉండడానికి ప్రయత్నించారు. కొన్ని సందర్భాల్లో వాళ్ళ నాయన ఆజ్ఞమీద 'బెల్గాచియా విల్లా' లోను, వాళింట్లోను యూరోపియన్ల, భారతీయుల గౌరవార్థం ఇచ్చే విందుల్లో పాల్గొనవలసి వచ్చేది. కాని, అటువంటి సమావేశాల మీద ఆయనకు మనసు లేదు. పైగా అవి అనవసరమైన ఆడంబరాలుగా తోచేవి. దేవేంద్రనాథ్ చిన్నతనంలోనే పెండ్లి చేసుకొని, అప్పటికే ఒకరిద్దరు కొడుకుల్ని కన్నా, వైవాహిక జీవిత బంధాలు ఆయన్ని ప్రాపంచిక జీవితానికి ముడివేయలేక

పోయాయి. ఆయన కుటుంబంలోనే నివసిస్తున్నా, మానసికంగా చాలా దూరంగా ఉండేవారు.

ద్వారకనాథ్ మాత్రం భౌతిక జీవితం పట్ల తన కుమారుని ఉదాసీన వైఖరిని ఉపేక్షించలేదు. ఈ ఉదాసీనతను మాన్పించాలన్న ఉద్దేశంతో, తన కొడుకును 'యూనియన్ బ్యాంకులో ఉపకోశాధికారి' గా చేరమని ఆజ్ఞాపించారు. అందులో దేవేంద్రనాథ్ చిన్నాయన రామనాథ టాగూర్ - కోశాధికారిగా పనిచేస్తుండేవారు. దేవేంద్రనాథ్ తండ్రి ఆజ్ఞను శిరసావహించారు. కొంతకాలం జరిగింది. ఆయనకు తాను ఈ ఒకానొక పనికే నిర్బంధించబడినట్లు అనిపించింది. ఇంక దేనిమీద ఆసక్తిలేక పోయింది. ఉదయం సరిగా పదిగంటలకు ఆఫీసుకుపోయి, సాయంకాలం - పైసల్తోసహా లెక్క అప్పజెప్పి వచ్చేవారు. ఈవిధంగా యూనియన్ బ్యాంకులో లెక్కలు గట్టడం - ఈ నిర్దిష్టమైన కృషిలో ఆయనను గొప్ప ప్రవీణుణ్ణి చేసింది. భావి జీవితంలో ఒకవిధంగా ఏకాగ్రతను కలిగించి మేలే చేసింది.

ఈ కాలంలో ఆయన జీవిత గమనంలోనే ఒక మైలురాయిగా గుర్తించదగిన సంఘటన జరిగింది. స్థూలంగా చూడ్డానికి చిన్నదే అయినా అది ఆయన జీవితం మీద గొప్ప ప్రభావాన్ని చూపింది. నిజానికి అది అప్పటి నుండి ఆయన జీవిత గమనాన్నే మార్చేసింది.

ఒకరోజు దేవేంద్రనాథ్ తన గదిలో ధ్యాన ముద్రలో మునిగి కూర్చొని ఉండగా, ఒక పుస్తకంలోంచి ఒక కాగితం వినిగి ఎగిరివచ్చి పడింది. ఆయన ఉత్కంఠతో దాన్ని తీసుకొని, అందులో ఏముందో చూశారు. అందులో ఆయనకు అర్థంకాని ఒక సంస్కృత శ్లోకం రాయబడి ఉంది. ఆ శ్లోకం ఇది.

> "ఈశావాస్య మిదం సర్వం, యత్కించ జగత్యాం జగత్
> తేన త్యక్తేవ భుంజీథా మాగృథః కస్య స్విద్ధనమ్"

దేవేంద్రనాథ్ తన కులబ్రాహ్మణుని పిలిపించుకొని అడిగారు. ఆయన కూడా దాని అర్థాన్ని వివరించలేకపోయారు. కాని, అది బ్రహ్మ తత్వానికి సంబంధించిన శ్లోకం అని మాత్రం చెప్పగలిగారు. ఆ శ్లోకప్రాధాన్యాన్ని బహుశా బ్రహ్మసమాజ (1828 లో ఏకేశ్వరోపాసనార్థం రామమోహన రాయ్ స్థాపించిన సంస్థ) ఆచార్యుడైన రామచంద్ర విద్యాబాగీష్ పండితుడు వివరించ గలడని సూచించారు. విద్యాబాగీష్, అది ఈశోపనిషత్తులో మొదటి మంత్రమని "సర్వమూ భగవంతునిచే ఆవరింపబడి ఉంది. ఉన్నది, చలిస్తున్నదీ - త్యాగం ద్వారానే సంకల్పసిద్ధి పొందుతున్నాయి. ఇతరుల

ధనాన్ని ఆశించకు" అని దానికి తాత్పర్యం చెప్పాడు. విద్యాబాగీష్ ఇంకా, ఆ జీర్ణ పత్రం రామ్మోహన్‌రాయ్ సంకలించిన ఈశోపనిషత్తు లోనిదని చెప్పారు.

ఉదాత్తమూ, కవితాత్మకమూ అయిన ఆ శ్లోకంలోని భావ సౌందర్యానికి దేవేంద్రనాథ్ సంచలించిపోయారు. తన భావిజీవితరూపకల్పనకు అందులో కీలకం కనుగొన్నారు. తన భావి జీవిత కార్యాచరణను భగవంతుని అదృశ్య హస్తం సూచిస్తున్నట్లు హఠాత్తుగా ఆయనకొక స్ఫురణ కలిగింది. అంతవరకు తాను ఉపనిషత్తులు చదవనందుకు సిగ్గుపడ్డారు. అనంత జ్ఞాన భాండాగారాలైన ఉపనిషత్తులు తనకింతకాలమూ అభేద్యంగా ఉండిపోయాయనీ ఆయన అలా సిగ్గుపడ్డారు. ఉపనిషత్తులను లోతుగా అభ్యసించాలని నిశ్చయించుకొని విద్యాబాగీష్ నుండి క్రమంగా పాఠాలు చెప్పించుకొన్నారు.

ఈ మంత్రం దేవేంద్రనాథ్ మనసులో ఎంతటి గట్టి ముద్ర వేసిందో తెలుసుకోడానికి ఆయన ఆత్మకథలోని మాటల్ని మనం ప్రమాణంగా తీసుకోవచ్చు. "ఇంతవరకు నాకు భౌతిక జీవితం పట్ల ఆకర్షణలేదు. అలౌకిక సుఖాల్ని కూడా అనుభవించలేక పోయాను. ఈ దివ్యవాణి లౌకిక సుఖాలను వదులుకొని భగవంతుని మాత్రమే అనుభవించమని చెప్పినప్పుడు నేను కోరుకొన్నది లభించింది; నా మనస్సు బ్రహ్మానందంలో మునిగిపోయింది. ఇది నా అల్పజ్ఞానంతో ఆలోచించిన విషయం కాదు. దైవాజ్ఞ మాత్రమే. ఈ సత్యం మొదట దర్శించిన ఋషి ఎంత ధన్యుడోకదా! నాకు భగవంతుని మీాద గట్టి నమ్మకం కల్గింది. సాంసారిక సుఖాల స్థానంలో నేను బ్రహ్మ సమాగమం అనే అమృతాన్ని సేవించాను. ఓహో! ఇది నాకు ఎంత శుభకరమైన దినమో! ఇది నా కెంత స్వచ్ఛమైన ఆనందాన్నిచ్చిందో!" (అయిదో అధ్యాయం)

ఈ మాటలు ఆయన స్వయంగా పేర్కొన్నవి. అనంతర కాలంలో రవీంద్రనాథ టాగూర్ కూడ, తన తండ్రిమీాద చేసిన ప్రసంగాల్లో, తన తండ్రి ప్రాపంచిక ప్రయత్నాలనుండి త్యాగమయ జీవితంవైపు మళ్ళడానికి ఈ శ్లోకమే మార్గదర్శకమని చాలాసార్లు అన్నారు. "ఆంగ్లరాజధానిలో నిత్యమూ విలాసాల్లో మునిగి తేలే ఒక సంపన్న గృహస్థుని కుమారునికి తన మంత్రం సుదూరభవిష్యత్తులో జీర్ణపత్రరూపంలో ఒక దివ్యోపదేశాన్ని చేరవేస్తుందని - వేల సంవత్సరాల క్రితం జీవించిన ఋషికి - పాపం- అడవుల్లో నివసిస్తూ, నారచీరల్తో శరీరాన్ని కప్పుకొన్న ఋషికి - తెలియదు. ఆ ఋషి వాక్కులు మనోహరమైన యౌవన, ఐశ్వర్యాల పద్మవ్యూహాన్ని ఛేద్చుకొని పోయి ఎంతటి అద్భుతశక్తిని అందించాయి!" (మహర్షి దేవేంద్రనాథ్ - రవీంద్రనాథ టాగూర్-విశ్వభారతి) అన్నారు రవీంద్రనాథ్.

## రెండో అధ్యాయం

# ధర్మ మార్గంలో

1833 సెప్టెంబర్ 27న బ్రిస్టల్లో (ఇంగ్లండు) రాజారామ్మోహనరాయ్ చనిపోయేటప్పటికి, దేవేంద్రనాథ్ పదహారేళ్ళ కుర్రవాడు. రాజారామ్మోహనరాయ్ బ్రహ్మ సమాజం ద్వారా ఉన్నత భావాల్ని ఆదర్శాల్ని ప్రతిష్ఠించారు. కాని చిన్నవయస్సులోనే చనిపోవడం వల్ల వాటిని విస్తృత పరచలేక పోయారు. దేవేంద్రనాథ్ ఆ భావాల్ని, ఆదర్శాల్ని అంతకంటే ప్రతిభావంతంగా విస్తృత పద్ధతిలో ముందుకు తీసుకుపోయే బాధ్యత అనే ఉత్తరీయం తన భుజస్కంధాలపై పడక తప్పదని ఆనాడే నిర్ణయించుకొన్నారు. ఆ బాధ్యతా నిర్వహణ ఎటువంటి పరిస్థితుల్లో ఏవిధంగా ఆయనకు సంక్రమించిందో ఈ అధ్యాయంలో చర్చింపబడుతుంది.

దేవేంద్రనాథ్‌కు చిన్నతనం నుండి రామ్మోహనరాయ్‌తో పరిచయం ఉంది. అతిసన్నిహితంగా కూడా ఉండేవారు. రామ్మోహనరాయ్ దేవేంద్రనాథ్ ఇంటికి తరచుగా వస్తుండేవారు. దేవేంద్రనాథ్ మీద అమితవాత్సల్యం ఉండడం వల్ల, వచ్చినప్పుడంతా ఆయన్ని గూర్చి విచారిస్తుండేవారు. దేవేంద్రనాథ్‌కు కూడా రాయ్ పట్ల అమితమైన ఆకర్షణ ఉండేది. మహర్షి తన స్మృతుల్లో ఒకచోట నాగేంద్రనాథ్ చటర్జీ రచించిన 'మహాత్మా రాజారామ్మోహనరాయ్ జీవిత చరిత్ర' (నాల్గవ ప్రచురణ) అనే పుస్తకంలో గ్రంధస్థమైంది. బాల్యంలో దేవేంద్రనాథ్ రామ్మోహనరాయ్‌తో కలిసి గుర్రబ్బండిలో విహరించేవారని పేర్కొన్నారు. ఈ విహారాల్లో వాళ్ళిద్దరు చాల తక్కువగా, మితంగా మాట్లాడుకొనేవారు. దేవేంద్రనాథ్ రామ్మోహనరాయ్ ముఖారవిందాన్ని, గంభీరమైన ఆయన ప్రవర్తనను ఊరకే చూస్తుండేవారు. ఆయన ముఖం ఆ బాలుని మీద మంత్రప్రయోగం చేస్తున్నట్లుండేది. "ఆ ముఖాన్ని నేను తదేకంగా చూచేవాణ్ణి. నా హృదయం అగాధమైన, అనిర్వాచ్యమైన భావనతో నిండిపోయేది. నేను శ్రీరాయ్‌తో అపరిమితమైన సంబంధాన్ని పెంచుకున్నాను. నేను ఆయనచేత అతి వేలంగా ఆకర్షింపబడేవాడను."

ఆంగ్లో హిందూ పాఠశాలలో దేవేంద్రనాథ్ రామ్మోహనరాయ్ చిన్న కొడుకు రామప్రసాద్‌రాయ్ సహాధ్యాయులు. అప్పుడప్పుడు ఇద్దరూ పాఠ

శాల వదలిన తర్వాత మాణిక్తొళ్ళగృహంలో రాయ్‌ని గౌరవపూర్వకంగా కలుసుకొనేవారు. ఆ పితామహుడు ఆ బాలుని మీద ఎనలేని అప్యాయత అనేక రూపాల్లో చూపేవారు. ఆ చిన్నారి చుట్టానికి మర్యాద చెయ్యడం కోసం తోటలో నుండి పండ్లను కోసుకురమ్మనేవారు. ద్వారకనాథ్ లండన్‌కు వెళ్తున్న సందర్భంలో రామ్మోహన్ వీడ్కోలు చెప్పడానికి పోయి, దేవేంద్రనాథ్‌ను చూడకుండా జొరశాంకో భవనాన్ని వదలి రాలేదట. రాజా చేయి చాచి హృదయపూర్వకంగా ఆశీర్వదించినప్పుడు, ఆ బాలుడు అతని సమ్ముఖంలో ప్రత్యక్షమైనాడు. రామ్మోహన్ ఇంగ్లండు నుండి తిరిగివచ్చే దాకా బతకలేదు. కాని వాళ్ళిద్దరూ విడిపోయినప్పుడే వాళ్ళ ఆత్మల మధ్య భవిష్యత్తులో విడిపోని సన్నిహిత బంధం ఏర్పడినట్లుంది. రామ్మోహన్ దేవేంద్రనాథ్‌కు, పరోక్షంగానే అయినా నిజమైన గురువు. ఆయన బోధనల మీదనే దేవేంద్రనాథ్ ధార్మిక జీవితమంతా అధారపడి నడిచింది. బ్రహ్మసమాజాన్ని ఆ గురువు విభిన్న విశ్వాసాలు గలవారు నైరూప్య కాలాతీత తత్త్వాన్ని ఆరాధించడం కోసం (ఏకేశ్వరోపాసనార్థం) సమావేశ మయ్యేందుకు స్థాపించారు. ఆ పనిని పూర్తిచెయ్యడం ప్రస్తుతం శిష్యుని మీద పడింది.

రామ్మోహన్‌రాయ్ చనిపోయిన తర్వాత బ్రహ్మ సమాజానికి గడ్డు రోజులు దాపురించాయి. సాయంకాలం పూట ప్రార్థన కోసం వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. రామచంద్రవిద్యాబగీష్ రాయ్‌కి నిజమైన అనుచరుడు. ఆయన ఆ సమాజం రోజువారి కార్యక్రమాల్ని తన ఒక్కడి చేతి మీదుగా నడిపించి ఉండకపోతే, నిజానికి దాని ఉనికికూడా ఎవరికీ గుర్తు ఉండేది కాదు. అనేకమైన కష్టాల మధ్య, ఆటంకాల మధ్య ఆయనకు ఆ నూతన విశ్వాసంపట్ల, బాధ్యాతపట్ల ఉన్న సన్నిహిత సంబంధం ఆ దీపం వెలిగేటట్లు చేసింది. ద్వారకనాథ్ మంజూరు చేసే ఎనభై రూపాయ లతో ఆ సభ నెలసరి కార్యక్రమాలకయ్యే ఖర్చులు భరింపబడేవి.

మహర్షికి 1835, 36 ప్రాంతాల్లో ఉపనిషత్తులతో మొదటిసారి పరిచయం కలిగింది. కాలక్రమాన్నిబట్టి అది వాళ్ళ అవ్వ చనిపోవడానికి ముందు 1838లో జరిగింది. ఆరాధనా విధానంలో దేవేంద్రనాథ్ సంప్ర దాయ పద్ధతిని విడిచిపెట్టినప్పటి పరిస్థితుల్ని చర్చించేటప్పుడు మనం ఆ రెండు వాస్తవాలను కలిపి చూడాలి. ఎందుకంటే ఆ రెండు ఒకదానితో ఇంకొకటి పెనవేసుకొని ఉన్నాయి. అప్పటినుండే ఆయన ధార్మిక విశ్వా సానికి సంబంధించి రూపాంతరం చెందారు.

దేవేంద్రనాథ్ ఉపనిషత్తుల పట్ల చొరవ తీసుకోవడం వల్ల, వాటి బోధలతో ఆయన మనస్సు మరింత జ్ఞానవిలసితం అయినందువల్ల ఆయన ఉపనిషత్ తత్వాన్ని ప్రచారం చేయవలసిన అవశ్యకతను భావించారు. ఉపనిషత్ జ్యోతిని నలుదిశలకు ప్రసరింపజేయడానికి ఒక సంస్థను నెలకొల్పాలని ఆయన తన సోదరులను, కొంతమంది బంధుమిత్రులను సమీకరించారు. కొలను దగ్గర ఉన్నవాళ్ళ ఇంట్లో కింది భాగంలో ఒక గది కేటాయించబడింది. దసరాపండుగ వస్తున్నది. దేవిని పూజించడం కోసం ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో, దేవేంద్రనాథ్ తన సహవ్రతులతో వేదాంతంలో చెప్పిన రీతిలో ఏకేశ్వరోపాసన చేశారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ ఆయన సమావేశం ఆవశ్యకతను వివరించారు. ఆయన ధార్మిక గోష్ఠికి అదే ప్రారంభం. తత్త్వబోధినీ సభాప్రారంభం ఆవిధంగా జరిగింది. ప్రతి నెల మొదట ఆదివారం సాయంకాలం సభను నిర్వహించాలని నిర్ణయం జరిగింది. మొదటిదాని పేరు "తత్త్వరంజని సభ". రెండో సమావేశానికి రామచంద్ర విద్యాబగీష్ ప్రార్థనా నిర్వహణకు ఆహ్వానింపబడ్డారు. ఆయన సలహా మేరకు "తత్త్వబోధినీ సభ"గా పేరు మార్చబడింది. 1839 అక్టోబర్ 6న అవతరించిన ఆ సంస్థకు దేవేంద్రనాథ్ విద్యాబగీష్‌ను ఆచార్యునిగా నియమించారు.

ఆ తర్వాత సంభవించిన సంఘటనలు, గత శతాబ్దపు నాల్గవ, ఐదవ దశాబ్దాలలో బెంగాల్ సాంస్కృతిక చరిత్రలో తత్త్వబోధినీ సభ ప్రముఖపాత్ర వహించవలసి వచ్చినట్లు నిరూపిస్తున్నాయి. ఏకేశ్వరోపాసన ధ్యేయం అయినా, వేదాంత ప్రచారమే దాని పరమావధి అయినా తర్వాతి కాలంలో దాని కార్యకలాపాలు బహుముఖంగా విస్తరించాయి. ఈశ్వరచంద్రవిద్యాసాగర్, అక్షయకుమార్‌దత్త, రాజేంద్రలాల్‌మిత్ర, భూదేవ్ ముఖర్జీ రాంగోపాల్ ఘోష్, డా॥ దుర్గాచరణ్ బెనర్జీ, శంభునాథ పండిట్, రాజనారాయన్‌బోస్ మొదలైనవారు ఆ రోజుల్లో బెంగాలీ ప్రముఖులు. వీళ్ళందర్నీ ఆ సభ ఏదో ఒక సాంఘిక సంక్షేమ పథకంలోకి సభ్యులుగానో, సహాయకులుగానో ఆకర్షించింది. ఆ పథకాల్లో పత్రికాస్థాపన, బాలురకు ఆంగ్లభాషలో శాస్త్రాధ్యయనంతోబాటు మత విద్యను కూడ బోధించే పాఠశాల స్థాపన, వేదాధ్యయన పునరుద్ధరణ, ఉపనిషత్తులు మొదలైన పవిత్ర గ్రంథాల అనువాదం వంటివి ఉన్నాయి. ఆ సంస్థకు దేవేంద్రనాథ్ ఆత్మ అని ప్రత్యేకించి చెప్పవలసిన పనిలేదు. ఆయన ఆ కార్యక్రమాలకు కేవలం ప్రోత్సాహశక్తి మాత్రమేకాదు, ధనదాత కూడ.

తత్త్వబోధినీ సభ ఆనాటి బెంగాల్‌లోని ఆంగ్ల విద్యాధిక వర్గం మీద చెప్పుకోదగినంత ప్రభావాన్ని చూపింది. 1839లో ఆసభ స్థాపించబడింది. మొదటి నాలుగేళ్ళలో దాని సభ్యత్వ సంఖ్య క్రమంగా 105, 115, 83, 138. ఆరో సంవత్సరం నుండి ఆ సంఖ్య క్రమంగా పెరిగి ఒకప్పుడు 800 దాకా పోయింది. జ్ఞాన విజ్ఞాన విస్తరణలో సభ మునిగి తేలింది. పందొమ్మిదో శతాబ్దపు బెంగాల్ పునరుజ్జీవనోద్యమంలో ఈ సభ పాత్ర ప్రత్యేకంగా విశదంగా చర్చించవలసి ఉంది.

ఇంతకు ముందే పేర్కొన్నట్లు రామ్మోహన్‌రాయ్ చనిపోయిన తర్వాత, బ్రహ్మ సమాజం నడి సముద్రంలో నావలాగా ఉంది. దేవేంద్రనాథ్‌కు సభా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంలో, అవసాన దశలో ఉన్న బ్రహ్మసమాజానికి మరల ఊపిరిపోసి, దానిని తత్త్వబోధినీ సభ పర్యవేక్షణలో ఉంచాలన్న ఆలోచన వచ్చింది. ఈ దృష్టితో మొదట నైరూప్య, ఆద్యంతరహిత, నిర్వికార దైవాన్ని నిజంగా నమ్ముతున్న బ్రహ్మ సామాజికుల్ని, తత్త్వబోధినీ సభాసభ్యుల్ని ఒకే గొడుగు కిందికి తీసుకు రావాలనుకున్నారు. ఇట్లా చెయ్యడం తన ఆలోచనా విధానానికి అనుగుణంగా ప్రార్థనలో పాల్గొనేవాళ్ళ విశ్వాస శక్తిని పరీక్షించడం కోసమే గాని, ఇంకొక ప్రత్యేక మతాన్ని స్థాపించడం కోసం కాదు. దానికి ఆయనే మార్గం చూపారు. దేవేంద్రనాథ్ తన ఇరవైమంది స్నేహితులతో బ్రహ్మ సమాజ ఆచార్యులైన రామ్‌చంద్ర విద్యా బగీష్ సమక్షంలో బ్రహ్మ ధర్మాన్ని స్వీకరించారు. ఆ ఇరవైమందిలో దేవేంద్రనాథ్ తమ్ముడు గిరీంద్రనాథ్ తన కుల బ్రాహ్మణుడు శ్యామచరణ్ భట్టాచార్య, రామప్రసాద్‌రాయ్, అక్షయకుమారదత్త, హరదేవ్ చటర్జీ, లాలాహజారీ లాల్ ఉన్నారు. ఆ విధంగా బ్రహ్మసమాజం రూపుదిద్దుకొనింది. 1843 డిసెంబరు 21 నాటి (బెంగాల్ క్యాలండర్ ప్రకారం చారిత్రకమైన ఏడవ పౌష్యమినాడు) పై సంఘటన స్మృతిగా శాంతినికేతనంలో ఈనాటికీ గొప్ప పండుగ జరుగుతుంటుంది. ఇది తర్వాతి కాలంలో ముఖ్యంగా పందొమ్మిదో శతాబ్దపు ద్వితీయార్ధంలో ఒక శక్తిమంతమైన ఉద్యమంగా పెరిగి బెంగాలీ పునర్నిర్మాణోద్యమంలో మత సాంస్కృతిక సాంఘిక రంగాల్లో అంతా తానే ఆవరించింది.

అంతకు ముందే దేవేంద్రనాథ్ పత్రికా స్థాపన ప్రయత్నంలో ఉన్నారు. అందులో వారి మత సిద్ధాంత వివరణ, సభా కర్యక్రమ వివరణ, వేదాంత చర్చ మొదలైన అంశాలు ప్రచురించాలని ఆయన సంకల్పం. అయితే ప్రజాప్రయోజనాలకు సంబంధించిన విషయాలను విస్మరింపదలచ

లేదు. విజ్ఞాన విషయాలు, వేదోపనిషత్తుల అనువాదాలు – ఇంకా ఇలాంటి వెన్నో కూడా ఆయన పత్రికలోని భాగాలు. తత్త్వబోధినీ సభావభ్యుల రచనలు చాలావాటిని పరిశీలించారు. అక్షయకుమారదత్త పత్రికా సంపాద కుడుగా ఉండడానికి అర్హుడని కనుగొన్నారు. 1843 ఆగస్టు మూడో వారంలో "తత్త్వబోధినీ పత్రిక" విడుదలైంది.

అక్షయకుమార్ తన ఎన్నికను సార్థకం చేశారు. ఈయనకు, దేవేంద్ర నాథ్‌కు దృక్పథాల్లో తీవ్రమైన భేదాలున్నాయి. ఈయన సేశ్వరోపాసకులు. కాని అంతరాంతరాల్లో హేతువాది. ఏరకమైన శక్తి మీద నమ్మకం లేదు. అక్షయకుమార్ గొప్ప రచయిత. బెంగాలీభాషలో వచనం అభివృద్ధి చెందుతున్న కాలంలో ఈయన ప్రభావం తీవ్రంగానే ఉండింది. దేన్నైనా శాస్త్రీయంగా అధ్యయనం చెయ్యడంలో ఈయనకు శ్రద్ధ ఎక్కువ. వైద్యంలో అభిలాష కొలది ఒక కోర్సు కూడా చేశారు. జార్జి కోంబ్స్ రచించిన 'మానవ శరీర నిర్మాణం' అన్న గ్రంథాన్ని అనుసరించి ఆయన బెంగాలిలో బాహ్యా వస్తుర్ సహిత్ మానబ్ ప్రకృతిర్ సహంద విచార్ అనే పుస్తకం రాశారు. హెచ్. హెచ్. విల్సన్ రచించిన "భారతీయ మత శాఖలు" అనే గ్రంథంలాగా రెండు సంపుటాలు రచించారు. అక్షయకుమార్ తత్త్వబోధినీ పత్రికకు సంపాదకుడుగా 1843 నుండి 1855 వరకు పన్నెండేళ్ళు పనిచేశారు.

ఆ పత్రికకు సంపాదక సమితి ఉండింది. దానికి దేవేంద్రనాథ్ అధ్య క్షులు. అక్షయకుమార్ కార్యదర్శి. రచనలన్నీ ప్రచురణకు పూర్వం ఈ సమితికి సమర్పింపబడేవి. తొలి నాళ్ళలో విద్యాసాగర్, రాజేంద్రలాల్ మిత్ర ఈ సంపాదక సమితిలో సభ్యులుగా ఉండేవారు. గొప్ప ధార్మిక వ్యక్తిగా దేవేంద్రనాథ్ మత విషయాలకే ఎక్కువ ప్రాముఖ్యమిచ్చేవారు. తక్కిన సభ్యులు విజ్ఞానశాస్త్రం, తత్త్వశాస్త్రం, సాహిత్యం, చరిత్ర, పురాతత్త్వశాస్త్రం, సామాజిక శాస్త్రం, రాజకీయాలు చూచేవారు. మత విషయాలతో బాటు ఇవన్నీ ప్రక్కప్రక్కనే అచ్చయ్యేవి. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన స్వయం పఠనం, స్త్రీ విద్య, ఇంద్రియ నిగ్రహం, క్రైస్తవ మత మిషనరీల నుండి హిందూమత రక్షణ, నీలిమందు ఉత్పత్తిదారుల అణిచివేతను ఎదిరించడం, వ్యాయామ ఆవశ్యకత, పాలకపాలితుల మధ్య సంబంధాలు, సంఘ సంస్కరణం మొదలైన విషయాలెన్నో చర్చింపబడేవి.

దేవేంద్రనాథ్‌కు అక్షయకుమార్‌కు మత విషయంలోకూడా అభిప్రాయ భేదాలున్నాయి. తత్త్వబోధినీ సభలోని అక్షయకుమార్, అతని అభిప్రాయా లతో ఏకీభవించేవాళ్ళు దేవేంద్రనాథ్ గుండెనిండా అభిమానించే వేదాల నిర్దుష్టత్వాన్ని ప్రశ్నించారు. ఈ అభిప్రాయభేదం తర్వాతికాలంలో బ్రహ్మ

117682

సామాజికుల్లో ప్రధాన వివాదంగా మారింది. అది చీలికకు దారితీసి, మరలా పూర్వపు బ్రహ్మసమాజం ఏర్పడడానికి దారితీసింది. ఇదంతా ఎలా జరిగిందో తర్వాత చర్చిస్తాం. దేవేంద్రనాథ్ తన ప్రత్యర్థుల వాదాల్లోని శక్తిని స్ఫూర్తిని చూచారు. గట్టి ఆత్మ శోధన చేసుకున్నారు. వేదోపనిషత్తుల సిద్ధాంతాలను పునఃపరిశీలించుకున్నారు. ప్రత్యర్థుల అభిప్రాయాలతో ఏకీభవించారు. ఎంతోకాలం తనను నడిపించిన విశ్వాసాలను, వదులుకొని ఇతరుల అభిప్రాయాలను మన్నించడం అన్నది సత్యం పట్ల ఆయనకు గల గాఢమైన శోధనాసక్తిని సూచిస్తుంది. మహర్షి స్వభావరీత్యా కొన్ని సందర్భాల్లో చాలా పిడివాది అంటారు. ఇది ఆయన సాంఘిక విశ్వాసాలకు సంబంధించి నిజం కావచ్చు. కాని మత సంప్రదాయాల్లో మాత్రం కాదు. లేకపోతే ఏళ్ళ తరబడి తాను అంటిపెట్టుకొన్న వేదోపనిషత్సిద్ధాంతాలను వదులుకోవడం సాధ్యమయ్యేది కాదు.

దేవేంద్రనాథ్ తన ఇరవై మంది సహాయకులతో బ్రహ్మధర్మంలోకి ప్రవేశించి, (బ్రహ్మో ఆలయాన్ని) ప్రారంభించి, విభిన్న కార్యక్రమాల్లో తలమునకలు అయ్యారూ. ఆయన అప్పటికే (1840) తత్త్వబోధిని పాఠశాలల్ని స్థాపించారు. మొదటది కలకత్తాలోను తర్వాత హుగ్లీ జిల్లాలోని బన్స్బెరియా గ్రామానికి మార్చబడింది. తక్కినవి, 24 పరగణాల్లోని వివిధ జిల్లాల్లోను, నాడియాలోను, స్థాపించబడ్డాయి. అవన్నీ తత్వబోధినీసభ ఆధ్వర్యంలో మహర్షి ఆర్థిక సహాయంతో నడపబడేవి. బాలురకు సాధారణ విద్యతోబాటు మతబోధ చెయ్యడంకూడా వారి ధ్యేయం. తత్త్వబోధిని పత్రిక 1843 మూడో పాదంలో ప్రారంభింపబడింది. ఇప్పుడు ఆయన వేదాల్లో లోతైన జ్ఞానాన్ని పొందడంలో నిమగ్నమైనారు. ఆ ధ్యేయంతోనే సొంత ఖర్చులతో నలుగురు యువకులను ఒక్కొక్క వేదంలో ఒక్కొక్కరిని పండితుల నుండి ప్రత్యేకంగా శిక్షణ పొందడానికి కాశికి పంపించారు. వారిలో ఆనందచంద్రవేదాంత బగీష్ ఋగ్వేదం అధ్యయనం చెయ్యడం కోసం పంపబడ్డారు. ఈయనే తర్వాత బ్రహ్మ సమాజ అధిపతి అయ్యారు. గీత వేదాంతాల వ్యాఖ్యాతగా ఖ్యాతి గడించారు. శ్రౌత గృహ్య సూత్రాలను సేకరించి పరిష్కరించారు. వాటిని "ఏషియాటిక్ సొసైటి ఆఫ్ బెంగాల్" వాళ్ళు తమ "బిబ్లియోటికా ఆఫ్ ఇండియా" స్రవంతిలో ప్రచురించారు.

ఆ నలుగురు యువకులు కాశిలో అధ్యయనం చేస్తున్న సమయాంలో దేవేంద్రనాథ్ స్వయంగా వారి అధ్యయనంలోని అభివృద్ధిని తెలుసుకునేందుకు, కీర్తికెక్కిన వేదపండితులతో వేదాలకు సంబంధించిన విభిన్న దృక్పథాల మీద గోష్ఠి జరపడానికి కాశికి వెళ్ళారు. అక్కడినుండి చాలి

నంత పరిజ్ఞానంతో తిరిగొచ్చారు. కాని, ఆయన సందేహాలకు కాశిలోనే, వేద పండితులిచ్చిన సమాధానాలు పూర్తి సంతృప్తి నివ్వలేదు.

1830లో ఇంగ్లండులోని స్కాటిష్ మిషన్ ప్రఖ్యాతి చెందిన అలెగ్జాండర్ డఫ్ అనే బోధకుని క్రైస్తవ మత ప్రచారం కోసం కలకత్తాకు పంపింది. ఆయన భారతదేశంలో దాదాపు ముప్ఫై మూడేళ్ళు నివసించారు. ఆకాలంలో ఆయన తన కార్యక్రమాల్లో భాగంగా భారతీయ బాలుర కోసం ఉచిత ఆంగ్ల పాఠశాలల్ని నడిపి, అనేకమంది బెంగాల్ యువకుల్ని క్రైస్తవ మతంలోకి మార్పించారు. హిందూ కళాశాల్లో ఇద్దరు డిరోజియన్లు - మహేష్ చంద్రఘోష్, కృష్ణమోహన్ బెనర్జీ అనే ఉత్తమ పట్టభద్రులు - క్రైస్తవ మతాన్ని పుచ్చుకొన్న మొదటి జట్టులో ఉన్నారు. ఈ మత మార్పిడి ప్రవాహం హిందూ విద్యార్థికుల్లో కలవరం పుట్టించింది. సహజంగానే ఈ వర్గంలోని పెద్దలు క్రైస్తవ మిషనరీలు అనుచితంగా చేసే మత మార్పిడులను గట్టిగా ఎదుర్కొనడానికి ఆలోచించారు. దేవేంద్రనాథ్ నాయకత్వాన తత్త్వబోధినీ సభ ఈ నిరసనోద్యమంలో ప్రముఖ పాత్ర వహించింది.

డఫ్ బెంగాల్ నుండి తిరిగి స్వదేశం వెళ్ళిన తర్వాత "భారత దేశం - భారతీయ మతశాఖలు" అనే పుస్తకాన్ని ప్రచురించారు. అందులో ఆయన హిందూ ధర్మాన్ని, ప్రత్యేకించి వేదాంతాన్ని, ఒక మతంగా అది నైతికతను కోల్పోయింది అని దూషించారు. హిందూ సమాజం తరపున దేవేంద్రనాథ్ దీన్నొక సవాల్‌గా స్వీకరించి, తత్త్వబోధినీ పత్రికలో డఫ్ పేర్కొన్న అంశాల్ని తిప్పికొడుతూ, ఖండిస్తూ చాలా వ్యాసాలు రాశారు. అవి ఆంగ్లభాషలో రాయబడి 1845 ఆఖరుకల్లా "వేదాంత తత్త్వ నిరూపణ" అనే పేరుతో ప్రచురితమైనాయి. అందులోని మొదటి వ్యాసం ఉపోద్ఘాతంలో దేవేంద్రనాథ్ ఇలా రాశారు. "మన ప్రాచీన ధార్మిక సూత్రాలను ప్రచారం చేసే ప్రయత్నాలలో, వాటిపై మన ప్రగాఢమైన విశ్వాసాన్ని ప్రకటించడమే ప్రధాన ధ్యేయంగా భావిస్తున్నాం".

క్రైస్తవ మిషనరీల మత మార్పిడులు హిందూ కళాశాల విద్యార్థులతో ఆగలేదు. పరిధి ఇంకా విస్తరించింది. ఉమేష్ చంద్రశేఖర్ దంపతులను వారి బంధువుల ఆక్షేపణలను కూడా లెక్కచేయకుండా డఫ్ బలవంతంగా మతం మార్పించినప్పుడు కలకత్తా హిందూ సమాజం ముంగాళ్ళ మీద నిలబడింది. దేవేంద్రనాథ్ "హిందూ హితార్థి విద్యాలయ" అనే పేరుతో ఒక పాఠశాలను నడిపారు. హిందువుల్లోని అన్నివర్గాల బాలురకు అందులో ఉచితంగా ప్రవేశం లభించింది. ఈ చర్య మత మార్పిడులకు

నిలయమైన మిషనరీ పాఠశాలల ఎత్తులకు పై ఎత్తుగా భావింపబడింది. ఇది హిందువుల్లోని సనాతన అభ్యుదయ వాదులిద్దరినీ ఉమ్మడి అపాయ భయంచేత ఒకే వేదిక మీదికి తీసుకొచ్చింది. ఇంతకు ముందు ఎవరికి వారు విడివిడిగా సమావేశమయ్యేవారు. ఇప్పుడు ఈ ప్రత్యేక విషయం మీద్ద అందరూ ఏకమైనారు. సనాతనుల నాయకుడు రాజారాధాకాంతదేవ్ తన సర్వస్వాన్నీ ఈ ఉద్యమానికే సమర్పించారు. కలకత్తాలోని ఇతర భూస్వాములు చాలామంది విరివిగా చిరాశాలిచ్చారు. భూదేవ్ ముఖర్జీ అనే ఆయన అప్పుడప్పుడే కళాశాల చదువు ముగించి వచ్చారు. తర్వాతి కాలంలో ఆయన హిందూ సమాజానికే గర్వకారణం అయ్యారు. ఆయన ఆ పాఠశాలకు మొట్టమొదటి ప్రధానోపాధ్యాయులైనారు. ఆ స్కూలు మూడేళ్ళ వరకు సజీవంగా నిలిచింది.

క్రైస్తవుల మతమార్పిడి ప్రవాహాన్ని ఆపడం కోసం దేవేంద్రనాథ్, హిందువుల్లోని విభిన్న దృక్పథాల వారిని ఏకం చెయ్యడం ఆయన ఘనతను రెండింతలు పెంచింది. ఈ ఐక్యతవల్ల క్రైస్తవ మిషన్ గట్టి దెబ్బనే చవి చూచింది.

1846 జనవరి ప్రాంతంలో రాజనారాయణబోస్ బ్రహ్మసమాజంలో చేరి దేవేంద్రనాథ్‌కు అనుయాయుడై అనుంగు చెలికాడైనారు. ఆయన బ్రహ్మసమాజ ఉద్యమానికి మూలబలంగా నిరూపించుకొన్నారు. ఈ మధ్యలో రామచంద్ర విద్యాబగీష్ శిక్షణలో ఉపనిషత్తుల అధ్యయనం చురుకుగా సాగుతున్నది. ఆంగ్లం బాగా తెలిసిన రాజనారాయణ్ బాబును ప్రముఖమైన ఉపనిషత్తులను ఆంగ్లంలోకి తర్జుమా చెయ్యడానికి నియమించు కొన్నారు దేవేంద్రనాథ్. ఆ రచనలు తత్త్వబోధినీ పత్రికలో ప్రచురితా లయ్యేవి.

ఈ కార్యక్రమాలన్నీ దేవేంద్రనాథ్ కాలాన్ని శక్తిని అధికంగా హరించాయి. కుటుంబ వ్యవహారాలుగాని, ఎస్టేటు వ్యవహారాలుగాని చూడ డానికి సమయం లేదు. వాటిలో ప్రవీణుడైన తమ్ముడు గిరీంద్రనాథ్‌కు ఆ వ్యవహారాల్ని పూర్తిగా వదిలిపెట్టారు. తాను మాత్రం తత్త్వబోధినీ సభ, బ్రహ్మసమాజ వ్యవహారాలు చూచుకుంటూ ధ్యాన, ప్రార్థన, అధ్యయనాల్లో మునిగిపోయారు.

ద్వారకనాథ్ భౌతిక జీవితం పట్ల తన పెద్ద కుమారుని ఉదాసీన వైఖరి చూచి సహజంగానే కొంత బాధపడ్డారు. తన జీవితంలో కూడబెట్టిన అపారమైన సంపద భవిష్యత్తును గురించి తపించిపోయారు. తన కొడుకు

ప్రస్తుతం నడుస్తున్న మార్గంలోనే పట్టువదలకుండా పయనిస్తే తన ఎస్టేట్లు. ఇతర సంపద కృశించి నశించిపోవడానికి ఎంతోకాలం పట్టదని భావించారు. బహుశా ఈ ఆందోళన వల్లనే 1840లో ద్వారకనాథ్ తన ఆస్తిలో ఒక భాగాన్ని ముగ్గురు ధర్మకర్తలుగల ధర్మనిధికి ఇచ్చి, దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని తన సంతతి జీవనాధారానికి తప్ప అమ్మడానికి, మార్చడానికి హక్కు లేకుండా చేశారు. 1843లో ఆ మేరకు వీలునామా రాసిపెట్టారు.

తన కుమారుని పట్ల ద్వారకనాథ్‌కున్న అసంతృప్తి ఇతర మార్గాల్లో కూడా వ్యక్తమైంది. ఆయన మాటల సందర్భంగా, తన కుమారుని మనస్సును భౌతిక విషయాల నుండి దూరం చేసి ఒక మతపిచ్చోణ్ణి చేసింది రామచంద్రబగీష్ అయ్యుండవచ్చునన్న అభిప్రాయం వ్యక్తపరచినట్లు తెలిసింది. దేవేంద్రనాథ్ ఈ విషయం తెలిసి ఉపనిషదధ్యయనం ఇంటినుండి ముద్రశాలకు మార్చుకున్నారు. ద్వారకనాథ్ రెండవసారి ఇంగ్లండుకు వెళ్ళినప్పుడు [1845-46] ఒక ఉత్తరంలో ప్రాపంచిక విషయాల పట్ల తన కొడుకు ఉదాసీనతను గద్దించారు. [పత్రావళి 145] కాని తండ్రి ఉపదేశం కుమారుని మతధ్యాసను కొంచం కూడా తగ్గించలేకపోయింది. దేవేంద్రనాథ్ ఆత్మ అప్పటికే భగవంతుని మీద కేంద్రీకృతమైంది. ఆ ఊర్ధ్వ గమనం నుండి మధ్యలో తన అడుగులు వెనక్కి ఎలా వెయ్యగలరు ?

## మూడో అధ్యాయం

# సంక్షోభం

కష్టాలు ఒంటరిగా రావంటారు. ఈ సత్యం పాతబడినా దేవేంద్రనాథ్ విషయంలో తన శక్తి నంతా నిరూపించినట్లు కనబడుతుంది. 1845 ద్వితీయార్ధం నుండి 1848 చివరిదాకా గల దాదాపు ముప్పై నెలల కాలంలో కష్టాల పరంపర ఒకదాని తర్వాత ఇంకొకటి అయనను వెన్నాడి, కాళ్ళ కింది నేలను తొలగిస్తున్నాయా అనిపించింది. ఆకాలం ఆయనకు భయంకరమైన సంక్షోభకాలం. కాని ఆ సంక్షోభంలో ఆయన చూపిన ధైర్యం ఇతరులు చూచి నేర్చుకోదగింది. అప్పటి ఆయన దృఢత్వం, స్థితప్రజ్ఞత వర్ణనాతీతం. ఆ ఆపదలు చూపిన భయంకర ప్రభావం వల్ల ఇంకొకరైతే ఆ బాధల ఉక్కు పాదాల కింద పడి చితికిపోయేవారు. కాని దేవేంద్రనాథ్ గొప్ప ధైర్యంతో ఎదిరించి నిలబడ్డారు. ఆకాలంలో ఆయన వ్యక్తిత్వం ప్రకాశించినంతగా మరెప్పుడూ ప్రకాశింపలేదు. భగవంతునిలోగాఢమైన నమ్మకం, భగవదాత్మకు సంపూర్ణంగా లొంగిపోవడం అనేవి ఆయనను ఆకాలంలో నిలబెట్టాయి.

ఆయనకు మొదటిదెబ్బ 1846 అగస్టు ఒకటో తేది వాళ్ళ నాన్నగారు ఇంగ్లండులో చనిపోయారన్న వార్తరూపంలో తగిలింది. ఆ దుర్వార్త కలకత్తా చేరడానికి 47 రోజులు పట్టింది. ఆ సమయంలో దేవేంద్రనాథ్ తన కుటుంబసభ్యులతో గంగానదిలో పడవ మీద విహరిస్తున్నారు. వార్త తెలిసినవెంటనే తిరిగొచ్చారు.

కష్టపరంపరకు ఇది ప్రారంభం మాత్రమే. దేవేంద్రనాథ్ బ్రహ్మసమాజ పద్ధతిలో తండ్రికి శ్రాద్ధకర్మ నిర్వర్తించడానికి నిశ్చయించుకున్నారు. బ్రహ్మపద్ధతి అంటే కఠినమైన, స్వచ్ఛమైన ఉపనిషన్మార్గం. అంటే విగ్రహారాధనను విసర్జించినదన్నమాట. తన తండ్రి ఆత్మశాంతి కోసం చేసిన కర్మలో సాంప్రదాయికంగా ఉండే "సాలగ్రామ శిల"ను బహిష్కరించారు. సాలగ్రామశిలను హిందువులు విష్ణువుకు బదులుగా పూజిస్తారు. బ్రాహ్మణార్చకులు ఏ పూజకైనా ఈ శిలను ఉపయోగిస్తారు. ఆయన శ్రేయోభిలాషులు, బంధువులు అంతటి కఠిన దీక్షను వహించవద్దని సలహాఇచ్చారు. తనలాగే బ్రహ్మసామాజికుడైన గిరీంద్రనాథ్, శ్రాద్ధకర్మలో బ్రహ్మసమాజ

పద్ధతిని ఖచ్చితంగా అనుసరిస్తే బంధువులందరూ బహిష్కరిస్తారేమోనన్న భయంతో వాళ్ళలాగే అన్నకు సలహా ఇచ్చారు. గిరీంద్రనాథ్ దేవేంద్ర నాథ్‌కు అనుంగు తమ్ముడైనా, అతడు ప్రధానంగా భౌతిక ప్రపంచజ్ఞానం ఉన్న మనిషి కాబట్టి, బంధువుల నాడిని సరిగ్గా పట్టుకోగలిగారు. అవి యథాతథవాదానికి పట్టం కట్టిన రోజులు. ఆనుపూర్వికతను అనుసరించ డంలో ఏమాత్రం లోపం కనబడినా సాంఘిక బహిష్కారమే శిక్షగా భావించే రోజులు. కాని దేవేంద్రనాథ్ సాలగ్రామ శిలను త్యజించాలన్న నిర్ణయం మీద స్థిరంగా నిలబడ్డారు. బ్రహ్మోపదేశం విగ్రహారాధనకు అడ్డుకట్ట వేసింది. స్వచ్ఛమైన బ్రహ్మసామాజికుడుగా, మతనేరస్థునిగా నిర్ణయించే ఈ అంశంలో ఎట్లా రాజీపడగలరు ? బ్రాహ్మణులకు దక్షిణలివ్వడం వంటి సమాజంలో తన యోగ్యతకు తగిన కొన్ని ఆచారాల్ని అనుసరించడానికి ఆయన సిద్ధపడ్డారు. కాని, కర్మనిర్వహణ పద్ధతి పట్ల మాత్రం చాలా మొండి గానే వ్యవహరించారు. ఆయన తన సిద్ధాంతాన్ని, గౌరవాన్ని కాపాడుకోవడం కోసం తన సర్వస్వాన్ని పణంగా పెట్టడానికైనా సిద్ధపడ్డారు.

ఫలితంగా కొద్దిమంది తప్ప బంధువులందరూ ఆయన్ని సాంఘిక బహిష్కారం చేశారు. రాజీ లేని విధానంతో బంధువుల అసంతృప్తికి పాత్రుడైనా దేవేంద్రనాథ్, తన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని నిష్కల్మషంగా ఉంచుకోగలిగి నందుకు చాలా ఆనందించారు.

కాని నిజమైన ఆపద ఇంకా రావలసి ఉంది. ద్వారకనాథ్ చనిపోయి సంవత్సరం గడవగానే యూనియన్ బ్యాంకు దివాళా తీసింది. (27 డిసెంబరు 1847) ఇది జరిగిన పదహైదురోజులకే (12 జనవరి 1848) కార్, టాగూర్ అండ్ కంపెనీ కూడా మూసెయ్యాల్సి వచ్చింది. ఇట్లా ఈ రెండూ పదహైదు రోజుల తేడాతో కూలిపోవడానికి సంబంధం ఉంది. ఈ రెండు దుర్ఘటనల ఫలితంగా కలకత్తాలోని చాలా సంపన్నకుటుంబాలు దారిద్ర్యంలోకి దిగజారాయి.

ప్రస్తుత అధ్యయనంలో ఈ రెండు దుర్ఘటనలకు కారణాలను వెదక డంగాని, అలా జరగడానికి దారితీసిన పరిస్థితులను పేర్కొనడం గాని అనవసరం. ద్వారకనాథ్ తన అధ్వర్యంలోని ఈ రెండు కంపెనీల నిర్వహ ణకు తరుచుగా అప్పులు చెయ్యవలసివచ్చింది – అని చెప్పుకుంటే చాలు. దానికి తోడు ఆయన దానధర్మాలకు, పెద్దపెద్ద ఖర్చులకు అప్పుడప్పుడు మార్కెట్లో చేసిన అప్పులు మోయలేని బరువైనాయి. ద్వారకనాథ్ ఒక చీటి రాసి పంపితే కలకత్తాలోని ఏ సంపన్నుడైనా లక్షల రూపాయలు అడ్వాన్సు ఇవ్వడానికి సిద్ధపడేవాడు.

ద్వారకనాథ్ ఇంగ్లండులో చనిపోయేనాటికి దాదాపు కోటి రుపాయలు అప్పు తేలింది. ఆ రెండు కంపెనీల షేర్లన్నీ చెల్లించవలసిన పూచీ అతని ముగ్గురు కుమారుల మీద పడింది. రెండు కంపెనీలకు అప్పులిచ్చినవాళ్ళు చేరి, వాళ్ళ ఆస్తులన్నిటినీ డబ్బుగా మార్చి చూసినా, అప్పులన్నీ తీరడానికి ఇంకా ముప్పై లక్షలు కావాల్సి వచ్చింది. కార్, టాగూర్ అండ్ కో లోని యూరోపియన్లు మాత్రం ఎక్కువ జీతాలతో మేనేజర్లుగా గాని, కార్యనిర్వాహకులుగా గాని ఉన్నారు. కాబట్టి అప్పు తీర్చే బాధ్యత యూరోపియన్లకు తప్పిపోయి టాగూర్ల నెత్తిన పడింది. ద్వారకనాథ్‌కు యాభై శాతం వాటాలున్నాయి. ఆ వాటాను ఆయన వీలునామాలో తన పెద్ద కొడుకు పేర మార్చారు. కాని దేవేంద్రనాథ్ తాను ఏక భుక్తంగా అనుభవింపవలసిన వాటాలను తన తమ్ముళ్ళిద్దరికీ పంచి పెట్టారంటే, ఆయన సౌజన్యం ఎంతటిదో మనం ఊహించుకోవచ్చు. యూరోపియన్ వాటాల విషయంలోను ఇలాగే జరిగింది.

ఈ సంక్షోభాన్ని చూసి దేవేంద్రనాథ్ దిగులు పడలేదు. ఒకవిధంగా సర్వస్వాన్ని భగవదర్పితం చేసి, ముందుకన్నా ఎక్కువ అంతర్ముఖీనుడైనారు. అప్పుల్ని పూర్తిగా తీర్చటమంటే, కుటుంబం ఆస్తులన్నిటినీ- అంటే తన తండ్రి భీమా చేసి పెట్టిన వాటినీ, కష్టదశనుండి కాపాడడానికి కల్పించిన ధర్మనిధినీ వదులుకోవడమేనని ఆయనకు తెలుసు. అయినా అప్పులవాళ్ళకు మొత్తం చెల్లించి, వాళ్ళ గౌరవాన్ని, వాళ్ళు మార్గదర్శకులుగా ఉండిన తన కంపెనీ గౌరవాన్ని కాపాడడానికి తన సర్వస్వం వదులుకోవడానికి సిద్ధపడ్డారు.

కంపెనీ దివాళా తీసినప్పుడు సమావేశమైన అప్పులవాళ్ళలో గోర్డన్ అనే ఆయనటాగూర్ల కుటుంబానికి గల ఆస్తి-అప్పుల పట్టికలో ఒకపని చేశారు. ద్వారకనాథ్ కల్పించిన ధర్మనిధిని ఆ పట్టికలో నుండి మినహాయించారు. అది అమ్మకానికి మార్పిడికి అతీతమైంది అని గుర్తు చేశారు. కాని ఆచర్య ధర్మ నిధినుండి తమ తరఫున దయాభిక్షను కోరుతున్నట్లనిపించింది దేవేంద్రనాథ్‌కు. తక్షణం దేవేంద్రనాథ్ మునిగాళ్ళ మీద నిలబడి, ఆ నిధినికూడా ఇచ్ఛికంగా, నిస్సంకోచంగా వాళ్ళ స్వాధీనం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ఆ ప్రకటన విన్నవారికి కరెంటు షాక్ కొట్టినట్లయింది. ఆయన స్వీయ చరిత్ర నుండే కొన్ని మాటల్ని ఉదాహరిస్తాను. "మా ప్రతిపాదన సహృదయులైన ఋణదాతల కళ్ళలో నీళ్ళు తెప్పించడం చూశాను. భవిష్యత్తునే పూర్తిగా ముంచివేయగల ఆపద సమీపిస్తున్నందుకు వాళ్ళు బాధపడ్డారు. కంపెనీ అభివృద్ధి చెందడానికీ దివాళా తీయడానికీ అమాయకులమూ,

నిరపాయులమూ అయిన మేము బాధ్యులం కామని వాళ్ళు గ్రహించారు. ఇంత చిన్న వయస్సులో (దేవేంద్రనాథ్ అప్పటికి 30 ఏళ్ళ కుర్రవాడు) నిర్హేతుకంగా అంత ఘోరమైన విపత్తు వచ్చిపడిందని గ్రహించారు. సిరిసంపద లేవి కూడా ఈరోజు మనవి అనుకున్నవి రేపు మనవి అనుకోవడానికి వీల్లేదన్న భావాన్ని వాళ్ళు గ్రహించారు. వాళ్ళ నష్టాలకు మా మీద కోపించడానికి బదులు వాళ్ళ హృదయాలు కరుణతో నిండిపోయాయి. వాళ్ళ హృదయాల్లో ఇంత కరుణ ఎక్కడినుండి వచ్చింది? అతనొక్కడే - నా ఆ జీవ మిత్రుడు. భగవంతుడు ఆ దయను వాళ్ళ హృదయాలలోకి పంపించారు." (పందొమ్మిదో అధ్యాయం.)

ఆయన శ్రేయోభిలాషులు కొందరు అప్పులు తీర్చేబాధల నుండి తప్పించుకోవడానికి దివాళా చట్టాన్ని ఆశ్రయించమని సలహా ఇచ్చారు. కాని అది చాలా నీచంగా, అసత్యాన్ని రుచిచూడడంగా తోచింది దేవేంద్రనాథ్‌కు. తన దగ్గర ఒక చిన్న చింపిగుడ్డ ఉన్నా కోర్టులో తాను దివాళాదారుణ్ణని చెప్పుకోవడం అబద్ధం చెప్పడమే అని ఆయన భావన. కొన్ని ఆర్థిక సౌకర్యాలు పొందడం కోసం తన గౌరవాన్ని పణంగా పెట్టడానికి ఆయన సిద్ధపడలేదు. "దైవం, ధర్మం మమ్మల్ని రక్షించనీ. దానివల్ల దివాళా చట్టం కోసం మాతలలు అమ్ముకోవలసిన అవసరం లేదు."

నక్కజిత్తుల ప్రపంచం ఋణబాధల నుండి తప్పించుకోవడానికి బినామీ చట్టాన్ని ఆశ్రయించమని ఒక సులభమైన మార్గాన్ని సూచించింది. దేవేంద్రనాథ్ తన ఆస్తిని చట్టపరిధిలో లేని ఇతరుల మీద కూడా రాసి పెట్టాలన్నమాట. ఏ ఆస్తిపరుడైనా అటువంటి పరిస్థితుల నుండి బయటపడడానికి అనుసరించే మార్గం అది. నీతినిజాయితీలకు మారుపేరైన దేవేంద్రనాథ్ ఆ సలహాను ఆహ్వానించలేదు. ఆ సలహా ఇచ్చినవారికి ఆయన తత్వం తెలియదు.

దేవేంద్రనాథ్, ఆయన సోదరులు కార్, టాగూర్ అండ్ కో కట్టవలసిన అప్పుల భారాన్ని మొత్తంగా మోయడానికి సిద్ధపడడం వల్ల, వాళ్ళ వంశప్రతిష్ఠ ప్రజాబాహుళ్యంలో అమితంగా పెరిగింది. సత్యాన్ని గౌరవించడం కోసం వారు నిస్సంకోచమైన ఆనందంతో దారిద్ర్యాన్ని కౌగిలించుకొనడం ప్రజలలో మెప్పును పొందింది. ముఖ్యంగా ఋణదాతలు ముక్కుమీద వేలేసుకొన్నారు. డబ్బుతో నీచంగా ముట్టడింపబడిన కలకత్తా నగరంలో, చనిపోయినతండ్రిచేసిన అప్పుల్ని తీర్చడానికి ఆత్మత్యాగం చేయడంలో అంత ఉన్నతికి ఎదగగల వాళ్ళు ఇంకా ఉండగలరన్న ఆలోచన ఆ ఋణదాతలకు లేదు. తండ్రి చేసిన అప్పుల్ని ఒప్పుకోవడంలో, ఎస్టేట్లను

అమ్మైనా బాకీ కట్టడానికి సిద్ధపడడంలో దేవేంద్రనాథ్ చూపిన పెద్దమనిషి తరహాతో బాటు, ఋణదాతలు, ఒక విశిష్టమైన సంఘటనతో సంచలించి పోయారు. ఏమిటంటే, దేవేంద్రనాథ్, ఆయన సోదరుల ఆస్తిపాస్తులు స్వల్పాంశాలతో సహా ఒకదాని తర్వాత ఇంకొకటి పట్టికరాసి చదువు తున్నారు. కాని ఒక అంశం అందులో చేరకుండా మిగిలిపోయింది. వెంటనే దేవేంద్రనాథ్ లేచి, చేతిలోని వజ్రాల ఉంగరాన్ని అజాగ్రత్తవల్ల అందులో చేర్చలేదని, అదికూడా ఆస్తిలో భాగమైనందువల్ల చేర్చవలసిందేనని చెప్పి ఆ తప్పును సరిదిద్దారు. ఈ కథ పండిత శివనాథ శాస్త్రి చెప్పారు. అజిత్ కుమార్ చక్రవర్తి రాసిన మహర్షి దేవేంద్రనాథ్ జీవిత చరిత్రలో గ్రంథస్థం చేశారు.

దేవేంద్రనాథుని ఈ చర్యను చూచి, అతని మాటలను విన్న ఋణ దాతలు తమ కళ్లను చెవులను తామే నమ్మలేకపోయాడు. దేవేంద్రనాథ్ సత్య సంధతకు ముగ్ధులైపోయిన ఋణదాతలు వాళ్ళంతట వాళ్ళే సంతోషంతో ఆస్తిమీద హక్కు కొంత తగ్గించుకొన్నారు. ఆ ముగ్గురు సోదరులు అప్పు లన్నీ తీరేదాకా ఖర్చులకు సంవత్సరానికి ఇరవై అయిదు వేల రూపాయలు తీసుకొనేటట్లు ఏర్పాటు చేశారు.

ప్రస్తుతం ఆస్తులన్నీ ఇతరుల చేతిలో ఉన్నాయి. ఫలితంగా ఆర్థిక పరిస్థితి క్షీణించి, అస్తవ్యస్తమైపోయింది. ఇక్కడనుండి తమకు తామే వేసుకున్న కఠినశిక్ష ప్రారంభమైంది. టాగూర్ల జొరశాంకోవంశంలో అది కనీ వినీ ఎరుగనిది. దేవేంద్రనాథ్ స్వీయ చరిత్ర నుండి ఆయన మాటల్ని ఉదహరిస్తాను. "సేవకుల సంఖ్య బాగా తగ్గించేశాను. నా రథాలను గుర్రా లను వేలం వేసేశాను. ఆహారస్థాయిని తగ్గించుకున్నాను. అవసరానికి మించి పోవడంలేదు. నేను కుటుంబంలోనే ఒక సన్యాసినయ్యాను. రేపు ఏమి తినాలి, ఏమి కట్టుకోవాలి అన్నవి నన్ను ఎక్కువకాలం బాధించలేదు. రేపు ఈ ఇంట్లో ఉంటానా పోతానా అన్న బాధా లేదు. నేను శుద్ధమైన నిష్కాముణ్ణి అయ్యాను. ఉపనిషత్తుల్లో నిష్కాముని సుఖశాంతుల్ని గురించి చదివాను. నా జీవితంలో వాటిని అనుభవించాను. చంద్రుడు రాహుముఖవిముక్తుడైనట్లు నా ఆత్మ ప్రాపంచిక అనుబంధాలనే పట్టు నుండి విముక్తమైంది" (పందొమ్మిదో అధ్యాయం.)

దేవేంద్రనాథ్ పెద్దకూతురు స్వర్గీయ శ్రీమతి సౌదామినీ దేవి తన "పితృస్మృతి"లో ఆయన అనుభవించిన కష్టకాలాన్ని పేర్కొన్నారు. రాజనారాయణబాబు మామూలుగా దేవేంద్రనాథ్‌తో కలిసి భోంచేసేవారు. ఆయనొక సాయంకాలం వచ్చి పప్పు, చపాతి మాత్రం ఉండడం చూచారు.

ఇంత సాధారణమైన భోజనంతో ఎలా ఉండగలవని ఉత్కంఠతో అడిగారు. అందుకు దేవేంద్రనాథ్ నిగూఢంగా సమాధానమిచ్చారు. "భగవంతుడు అపారమైన జ్ఞానంతో చేసిన నియామాలకు మనిషి సర్దుకోగలిగితే అన్నీ సక్రమంగానే సాగిపోతాయి" అన్నారు.

కుటుంబంలో జీవనస్థాయి తగ్గిపోయినందువల్ల, బయటి ఖర్చులు కూడా తప్పనిసరిగా తగ్గించుకోవాల్సి వచ్చింది. నిధుల కొరతవల్ల తత్త్వ బోధినీ పాఠశాలలకు, హిందూ హితార్థ విద్యాలయ నిర్వహణకిచ్చే విరాళాలు ఆపవలసి వచ్చింది. ఫలితంగా ఆ సంస్థలన్నీ గ్రహణం వాతబడ్డాయి. ఈ ఆర్థిక సంక్షోభం వల్లనే, దేవేంద్రనాథ్ నుండి చిరకాలంగా సహాయం పొందుతున్న చాలా సాంఘిక సంక్షేమ సంస్థలు ఇబ్బందుల పాలైనాయి. కాశికి ఉపనిషదధ్యయనం కోసం వెళ్ళిన నలుగురు పండితులు ఇదే కారణం చేత వెనక్కి రావలసి వచ్చింది. ఇది అనేక రకాలుగా, అనేక స్థాయిల్లో ఆర్థిక సహాయ స్తంభనం వంటిది. సున్నితుడూ, దయాశీలుడూ అయిన దేవేంద్రనాథ్ వంటి మనిషికి ఈలేమి ఈ ఆపదలు ఎంత బాధ కలిగిస్తాయో చెప్పడంకన్నా ఊహించుకోవడం మంచిది.

అప్పులు పూర్తిగా చెల్లించడానికి తొమ్మిదేళ్ళు పట్టింది (1847-56) ద్వారకనాథ్ ఏనాడో అంధుల సహాయార్థం ఒక లక్షరూపాయల విరాళం ఇస్తానని చేసిన వాగ్దానాన్ని కూడా దేవేంద్రనాథ్ నిలబెట్టడం వంటి సంఘటనలు, ఆయన తండ్రి అప్పుల్లో అన్నింటిని కొంచెం కూడా ఎగ్గొట్టకుండా ఎలా సంపూర్ణంగా చెల్లించారో నిరూపిస్తాయి. దేవేంద్రనాథ్ ఈ వాగ్దానాన్ని నీళ్ళకు వదిలిపెట్టినా ఎవరూ అడిగుండేవారుకాదు. కాని దాన్ని కూడా పైసలతో సహా చెల్లించడం దేవేంద్రనాథ్‌కు తండ్రిపైన ఉన్న గురుత్వాన్ని, సత్యం పట్ల ఉన్న ప్రేమను వ్యక్తం చేస్తుంది. ఆయన విలువల ప్రమాణంలో మాట ఇవ్వడం మాట నిలబెట్టుకోవడంతో సమానం. ఆయన తండ్రి ఇచ్చిన హామీని గాలికి వదిలేసుంటే, అంధసహాయక సంస్థకే కాదు, తండ్రి ఆత్మకు కూడా అన్యాయం చేసిన వారయ్యేవారు. కాని ఆయన అలా చెయ్యలేదు.

ఈ తొమ్మిదేళ్ళు త్యాగాలతోడి కఠినమైన భయంకరకాలం అని చెప్పవలసిన పనిలేదు. దేవేంద్రనాథ్ జీవితంలో ఆర్థిక దృష్టితో ఈ కాలం చాలా నికృష్టమైనది. ఆధ్యాత్మిక దృష్టితో ఒక స్వర్ణాధ్యాయం. ఈ కష్టదశ గంభీరమూ ఉన్నతమూ అయిన ఆయన ప్రతిష్ఠను ప్రదర్శించింది. మహర్షి అనే బిరుదు నామాన్ని ఆయన పేరుకు జత చేసింది బ్రహ్మానంద కేశవ చంద్ర సేన్. 1876లో భారతీయ బ్రహ్మసమాజ్‌కు చెందిన సేన్, దేవేంద్ర

నాథ్ ఆధ్యాత్మిక శీలాన్ని, ఋషిత్వాన్ని అభినందిస్తూ 'మహర్షి' అనే బిరుదును అనుగ్రహించారు. భగవంతునికి అంకితమైపోయి, ఆయన దివ్యసన్నిధిలో నివసించే దేవేంద్రనాథ్‌కు ఈ బిరుదు నివ్వడంలో ఔచిత్యం ఉందనడంలో సందేహం లేదు.

ఎస్టేట్లు తరిగి పోవడం, దానివల్ల సంపద కుంచించుకుపోవడం దేవేంద్ర నాథ్‌ను ఏమాత్రం బాధపెట్టలేదు. పైగా తన సాంఘిక హోదాలో ఆ మార్పును ఆహ్వానించారు. ప్రతికదలికలోను అదృశ్యమైన దైవాజ్ఞ పని చేయడం చూశారు. సంకటాలను సంతోషంగా సహించారు. రామ్మోహనరాయ్ లాగే దేవేంద్రనాథ్ కూడా పర్షియా ఋషి - కవి హాఫిజ్ ఆరాధకులు. ఆయన బోధనలు ఎప్పుడూ నాలుక మీద లాస్యం చేసేవి. ఈ సంక్షోభ కాలంలో ఆయన ప్రముఖ సూఫీకవి రచించిన గజల్ చదివేవారు. "ఆ దివ్యజ్యోతి కోసం తప్ప మరి దేనికోసమూ ప్రార్థించకూడదు. ఆ దివ్యజ్యోతి ప్రార్థనలో సిరిసంపదలన్నీ బూడిదైపోయినా నేను ఆశ్చర్యపడను."

## నాలుగో అధ్యాయం

# కొత్తకాంతి

మూడో అధ్యాయంలో చర్చించిన సంక్షోభానికి ఆర్థిక దౌర్భాగ్యం ఒక్కటే కాదు, ఇంకా అనేక కారణాలున్నాయి. తత్త్వబోధినీ సభలో వేదాలను గురించి అక్షయకుమార దత్త, రాంతానులాహిరి, వీళ్ళ అనుయాయులకు, దేవేంద్రనాథ్, రాజనారాయణ బోసుల అభిప్రాయాలకు సంఘర్షణ ఏర్పడిన విషయం ఇదివరకే పేర్కొనబడింది. దేవేంద్రనాథ్ వేదాంశాలు విజ్ఞాన శాఖలని, కాబట్టి అవి నిర్దుష్టాలని ఎప్పుడో భావించారు. అక్షయకుమార్ వాటి నిర్దుష్టత్వాన్ని ప్రశ్నించారు. వేదాల్లో తర్కానికి నిలవని శ్లోకాలున్నాయని, అందువల్ల వేదాల నిర్దుష్టత్వం అంగీకారం కాదని అన్నారు. రాజనారాయణ బాబు ఆ రెండు వాదాలను సమన్వయించడానికి ప్రయత్నించారు. వేదోపనిషత్తులు ప్రత్యక్ష జ్ఞానాన్ని కలిగినవి అనికాక, అవి బోధించే అంశాలు అవి హేతుబద్ధమని, సత్యమని భావించిన దానితో సంవదిస్తున్నాయని అన్నారు. కాని ఈ వివరణ అక్షయకుమార్ వర్గాన్ని సంతృప్తి పరచలేదు. వారు ముందు మాదిరిగానే దేవేంద్రనాథ్ పట్ల వ్యతిరేకతతో ఉన్నారు. రోజులు జరిగే కొద్దీ వివాదం కొనసకుచేరి తీవ్ర రూపం ధరించి, విద్యా సంబంధం చెడిపోయింది. ఒకే వేదిక మీద ఉండలేకపోయారు.

మహర్షి తన మనస్సును ఆవరించిన భావాలపై తాను తీసుకున్న నిర్ణయాలలోని శక్తిని గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నారు. ఆయన ఆలోచనా విధానం చాలా ప్రశాంతంగాను, ఆవేశరహితంగాను, క్రమ శిక్షణతోను ఉంటుంది. అభిప్రాయాలు ఒకసారి రూపం దిద్దుకొన్న తర్వాత, వాటిని సంస్కరించుకోవలసిన అవసరం వస్తే తప్ప మార్చుకోరు. మరోవిధంగా ఆయన మనసుకున్న అలవాట్లు దాదాపు స్థిరమైనవి. ఇది ఆయన సనాతనత్వానికి గుర్తు అనిపించవచ్చుగాని, ఇటువంటి స్వభావంలోని మేలి గుణం ఏమంటే, ప్రాథమిక విశ్వాసాలు ఎంతో దీర్ఘంగా, పరిణితంగా, సజీవంగా ఆలోచించిన తర్వాతనే స్థిరపడడం. ఇతరుల విషయాల్లోలాగా అభిప్రాయాలను మాటిమాటికి అటు ఇటు మార్చవలసిన పనిలేదు. కొందరు గాలి ఎట్లా మళ్ళితే అట్లా తమ అభిప్రాయాల్ని మారుస్తూ సాగబీకుతూ ఉంటారు. దేవేంద్రనాథ్ మెదడు ఊగిసలాడే రకం కాదు. అది చాలా చురుకైనది.

దేవేంద్రనాథ్ వైదిక దృక్పథం తత్త్వబోధినీ సభలోను, పత్రికల్లోను, అందరినుండి దాడిని ఎదుర్కొంటున్నప్పుడు, తన విమర్శకులకు బదులు చెప్పాలని, తన వైదిక దృక్పథాన్ని పరీక్షించుకోవాలని అనుకున్నారు, అయితే ఆయనకది అంత సులువైనది కాదు. ఆయన మత తత్త్వమనే భవనం వేదాలనే సురక్షితమైన పునాదుల మీద నిర్మింపబడింది. దాన్ని సంస్కరించే అవకాశాన్ని గురించి ఆలోచించాలంటే, ఆ భవన నిర్మాణ తత్త్వాన్ని చాలా జాగ్రత్తగా, సంపూర్ణంగా విచారించాలి. తన మనస్సులో ఎప్పుడో నిండిపోయిన విశ్వాసాన్ని మరల మదింపు చెయ్యాలంటే అంత ప్రయత్నం అవసరం.

విమర్శకుల వాదాల్లో ఒకటేమిటంటే, బ్రహ్మ సమాజం అప్పుడే నూతనంగా ఆవిర్భవించిన విశ్వాసం గనుక పురాతన తత్త్వబోధల మీద ఆధారపడకూడదు. అధునికకాలానుగుణమైన తార్కిక స్వభావం కలిగి ఉండాలి అన్నది. ఈ వాదం నిర్దుష్టం అన్నది ప్రస్తుతాంశం కాదు. అయితే ఇది ప్రతిపాదింపబడిన తీరులో బలం ఉంది. ముఖ్యంగా కొట్టొచ్చినట్టు కనబడేది కొత్త మతానికి గట్టి పునాదిని అందివ్వడమనేది.

దేవేంద్రనాథ్ వేదోపనిషత్తులను అధ్యయనం చెయ్యడంలో తలమునకలవుతున్నారు. కఠ, కేన, ఈశ, మాండుక్యాది ప్రముఖ ఉపనిషత్తులతో ఆయనకు చాలాకాలం నుండి గట్టి పరిచయం ఉంది. ఇంకా చాలా ఉపనిషత్తులున్నాయని, అవి పైవానితో సమానమైనవని, ఉపనిషత్సంకలనంలో అవికూడా చేరుతాయని విచారణ మీద తెలిసింది. ఆయన వేదాలను, వాని వ్యాఖ్యలను అనిమిషుడై దీక్షతో అధ్యయనం చేస్తున్నాడు. తండ్రి చనిపోయినందువల్ల టాగూర్ల రెండు వ్యాపారాలు దెబ్బతిని ఆర్థిక సంక్షోభంలో పడి తిరుగాడుతున్న సమయంలోనే, దేవేంద్రనాథ్ కొత్త చదువుల్లో మునిగి ఉన్నారంటే అది ఎంత గొప్పవనో తెలుసుకోవచ్చు. మానవాతీతమైన శక్తి, ఉత్సాహం ఉన్నవాడే రెండు విరుద్ధాంశాల మీద ఒకేసారి దృషి సారించగలడు.

సంస్కృతాధ్యయనంతో బాటు, ఆయన పాశ్చాత్య తత్త్వ శాస్త్రాలను ధర్మశాస్త్రాలను కూడా చదవడంలో లీనమయ్యారు. తన ధృక్పథాన్ని నిర్దుష్టం చేసుకోడానికి ఇతర రచనలతో సరిచూసుకోవడం దేవేంద్రనాథ్‌కు అలవాటే. దీన్ని ఆయన 'సాయి శోధన' అంటారు. 'సాయి' అనే బెంగాల్ పదానికి 'బలం' అని అర్థం. తన దృక్పథానికి బలాన్ని చేకూర్చడం కోసం సంస్కృత గ్రంథాలను పాశ్చాత్య తత్త్వ, ధర్మ శాస్త్రాలను గాలించేశారు. వీటితోపాటు పర్షియా కవి హాఫిజ్ కూడా ఆయనకు మరొక ప్రమాణం.

దేవేంద్రనాథ్ హిందూ కళాశాలలో ఉన్నప్పుడు లాక్, హ్యూం, బైన్ వంటి అనుభవవాదులైన పాశ్చాత్య తత్వవేత్తల రచనలను చదివారు. కాని కేవలం ప్రకృతి, అనుభవాలే జ్ఞానానికంతటికీ మూలం అనే వాదం ఆయనకు నచ్చలేదు. మహర్షి దేవేంద్రనాథ్ జీవిత చరిత్రకారుడు అజిత్‌కుమార్ చక్రవర్తి ప్రకారం ఆయనకు ఫ్రెంచి విజ్ఞాన సర్వస్వకారుల రచనలతో కూడా పరిచయముంది. కాని, వాళ్ళు విశ్వాన్ని యాంత్రిక పద్ధతిలో వ్యాఖ్యానించడం ఆయన్ని విముఖుణ్ణి చేసింది. వాల్టేర్, డైడెరాట్, డి. అలెంబెర్ట్ వంటి 18వ శతాబ్దపు ఫ్రెంచి భౌతిక తాత్వికుల్ని చదివారో లేదో గాని, ఆ వర్గానికి చెందిన లామెట్రీ, హాల్బ్చ్ అనే ఇద్దర్ని చదివినట్లు ఆయన ఆత్మకథ వల్ల తెలుస్తుంది. మంచి ఆస్తికుడైన దేవేంద్రనాథ్ సున్నిత హృదయం మీద వాళ్ళ పుస్తకాలలోని నాస్తిక బోధనలు వ్యతిరేక ప్రభావాన్ని కలిగించడం ఊహించుకోవచ్చు. తన ఆత్మకథలోని మూడూ నాలుగు అధ్యాయాల్లో సిద్ధాంత చర్చ చేస్తున్న సందర్భంలో ప్రకృతి మీదనే అధిక విశ్వాసముంచే అంశాన్ని ఆయన తీవ్రంగా విమర్శించడమే ఈ ఊహకు ఆధారం.

తన దృక్పథానికి బలాన్ని చేకూర్చడానికి చేస్తున్న శోధనలో, దేవేంద్రనాథ్ తర్వాత, స్ఫురణా సిద్ధాంతానికి చెందిన హామిల్టన్, రీడ్, డుగాల్డ్‌స్టార్ట్ మొదలయిన స్కాటిష్ రచయితుల మీద పడ్డారు. వాళ్ళ రచనలతో చాలా ప్రభావితులైనారు. వాటిలో తన రచనలకు స్థిరత్వాన్ని కనుగొన్నారు. తర్వాత స్పినోజా, డెకార్ట్, కజిన్, కాంట్, ఫిచ్టే మొదలైన వారి రచనలను బాగా చదివారు. ఈ మధ్యకాలంలో 17వ శతాబ్దానికి చెందిన శాస్త్రీయ భౌతిక వాదంలో నిష్ణాతుడైన గస్సెండిని, ఇంగ్లీషు విజ్ఞానవేత్త తత్వవేత్త అయిన సర్‌రాబర్ట్ బోయల్‌ను కూడా చదివారు. దేవేంద్రనాథ్ తాత్విక చింతనలో సమకాలీన పరిణామాలతో సంబంధం పెట్టుకోడానికి ప్రయత్నించేవారు. ఎనభైఎనిమిదేళ్ళ సుదీర్ఘ జీవితంలో [1905 లో మరణం] ప్రసిద్ధి చెందిన సమకాలీన వైజ్ఞానిక, తాత్విక రచనలతో పరిచయం కలిగే ఉన్నారు. ఆధునికులలో జాన్‌స్టువర్ట్‌మిల్, హెర్బర్ట్ స్పెన్సర్, కార్డియల్ న్యూమన్ ఆయన అభిమాన రచయితలు.

ఇదంతా ఆయన యూరోపియన్ రచయితల అధ్యయనానికి సంబంధించిన విషయం. ఇక దేవేంద్రనాథ్ చేసిన ప్రామాణిక భారతీయ మత గ్రంథాల అధ్యయనాన్ని గూర్చి కొంత విపులంగ చర్చింపబడుతుంది.

వేదాల నిర్దుష్టత్వాన్ని గురించి వివాదం తలెత్తేనాటికి దేవేంద్రనాథ్ ఉపనిషత్తులన్నీ చదవలేదని ముందే చెప్పబడింది. ఏవిధంగా చూసినా

ఛాందోగ్య, బృహదారణ్యకోపనిషత్తులు మాత్రం చదవలేదు. నాలుగు వేదాలను, ఉపనిషత్తులను జాగ్రత్తగా అధ్యయనం చేసిన తర్వాత వాటిలో కొన్ని భాగాలు హేతుబద్ధంగా లేవని, భగవంతుడు అద్యంతరహితుడు, మార్పులేనివాడు, శోధనాతీతుడు, నిత్యుడు అన్న విశ్వాసానికి అనుగుణంగా లేవని ఆయనే ఒప్పుకోవలసి వచ్చింది. వేదం దోషరహితమా అన్నది కాదు ప్రశ్న (అక్షయకుమార్, ఆయన సహభావుకులు దీన్ని అట్లా ప్రతిపాదించారు. విమర్శనాదృష్టితో వేదాలన్నిటినీ తిరిగి పరిశీలించిన తర్వాత) కొన్ని విషయాల్లో వేదాల బలహీనత స్పష్టంగా బయటపడిన తర్వాత కూడా ముందుమాదిరిగా బ్రహ్మసామాజికులకు వేదం సమన్వయ శక్తి కాగలదా ? అన్నదే అసలు ప్రశ్న. రామ్మోహనరాయ్ దృష్టిలో బ్రహ్మధర్మమంటే వేదాంతంలో చెప్పబడ్డధర్మమే. అదే సరికొత్త మతానికి అంగీకరింపబడ్డ పునాది. అయితే ఛాందోగ్యోనిషత్తులోని (5/10/3 .... 6) కొన్ని మంత్రాలు ఆచారాలకు, కర్మకాండలకు అనుచితమైన ప్రాముఖ్యమిస్తున్నట్లు మితిమీరిన ఊహలతో నిండినట్లు తెలుసుకొన్నాక, అభినవ దేవాలయానికి పునాదిగా వేదాంతాన్ని స్వీకరించడానికి ఎట్లా ఒప్పుకుంటారు ?

శారీరకమీమాంస లేక ఉత్తరమీమాంస అని పేరు పొందిన శంకరాచార్యుల బాదరాయణ బ్రహ్మసూత్ర వ్యాఖ్యానం దేవేంద్రనాథ్‌కు మరీ అసంతృప్తి కలిగించింది. శంకరాచార్యులు వేదాంతంలో దిట్ట అని ప్రసిద్ధి. నిజానికి ప్రజాబాహుళ్యంలో శంకరుల బృహ్మసూత్ర వ్యాఖ్యానం వేదాంతానికి పర్యాయపదంగా భావింపబడింది. బృహదారణ్య కోపనిషత్తులోని (1/4/1) 'సోఽహమస్మి' (నేనే అతడు) లేక ఛాందోగ్యో పనిషత్తులోని (6/8 - 16) 'తత్వమసి' (నీవే అతడు) వంటి మాటలు, శంకరులు తన వ్యాఖ్యానంలో వాటిని ప్రశంసించిన తీరు చూచిన తర్వాత ఆయన అంతవరకు ఉండిన సురక్షిత స్థలం నుండి విసరివేయబడినట్లు భావించారు.

భగవంతునికీ భక్తునికీ మధ్య ఆరాధిత ఆరాధక సంబంధం బ్రహ్మధర్మానికి పునాది. దానికి బదులు ఈ ఇద్దరి మధ్య భక్తుని భగవంతునితో సమానం చేసే ఇంకొకసంబంధం పుడితే, భక్తుని అహంకారం అవధులు దాటి బ్రహ్మధర్మనిర్మాణమే కుప్పకూలి పోతుంది. ఆత్మకథలో నుండి ఆయన మాటల్నే పేర్కొంటాను. ''అయితే నాకు నేనే దేవుణ్ణి - ఈ విధమైన ఆత్మభ్రాంతి మహాపాపానికి మూలం. ఎవరు గాని అటువంటి మాటలనకూడదు. ఒక మనిషి వందల కొలది ప్రాపంచిక బంధాలలో, బలహీనతలు, హీనతలు, పాపాలు, దుఃఖాలు, మొదలైన వాటిలో చిక్కుకు పోయి, తాను బంధరహితంగా ఉన్నట్లు అనుకుంటే అంతకన్నా ఆశ్చర్యం కలిగించేది

ఏముంది? శంకరాచార్యులు జీవునికి బ్రహ్మకు అభేదం చెప్పి భారతదేశ ఆలోచనను వెనక్కి తిప్పారు. ఈ మాటల్ని నమ్మి సన్యాసులు, సంసారులు అందరూ 'నేను దేవుణ్ణి' అనే పిచ్చికూతను కూస్తున్నారు'' (ఇరవై ఎనిమిదో అధ్యాయం.)

కాబట్టి మహర్షి మిక్కిలి అయిష్టంతో వేదాంతం తమ మతానికి పునాది కాజాలదనే నిర్ణయానికి వచ్చారు. అయితే దానికి ఆధారం కాదగినదేది? ఈ ప్రశ్న మీద గాఢమైన మౌనంతో కొన్ని రోజులు ఆలోచించారు. వేదాల నిర్దుష్టత్వం మీద ఉన్న వ్యామోహంతో ఆయన అక్షయకుమార దత్త, రాంతానులాహిరి, రామగోపాల ఘోష్ మొదలైన విమర్శకుల వాదనలను సగం ఒప్పుకొన్నారు. అయితే సత్యం పట్ల ఆయనకున్న ఎనలేని ప్రేమ ఆయన జీవితా దర్శానికి విశ్రాంతి స్థలం అనుకున్న వైదిక సూత్రాలనుండి హృదయాన్ని లాగి వదిలింది. ఆ ప్రేమే ఆయన అధ్యయనం కొనసాగించడం తప్ప వేరే మార్గం లేకుండా చేసింది.

దేవేంద్రనాథ్ అప్పటి నుంచి వేదాలుగాని, ఉపనిషత్తులుగాని బ్రహ్మ ధర్మానికి ఆధారం కావని ప్రకటించి తన మౌలికతను, చిత్తస్థైర్యాన్ని చాటారు. అయితే ఆ ఆధారం ఎక్కడుంది? "ఆత్మప్రత్యయం సిద్ధించిన, జ్ఞానంతో ఉజ్జ్వలమైన భక్తుని విశుద్ధ హృదయమే" ఆధారమని ఆయన దృఢంగా చెప్పారు. "స్వచ్ఛమైన హృదయంలో బ్రహ్మ కాపురముంటాడు. బ్రహ్మధర్మానికి ఆ నిష్కల్మష హృదయమే ఆధారం. ఆ హృదయ చైతన్యంతో సమన్వయం పొందే ఉపనిషద్వాక్యాలను మాత్రం మనం స్వీకరించవచ్చు. దీనికి భిన్నమైన వాక్యాలను మనం స్వీకరించలేం" (ఆత్మకథ ఇరవైరెండో అధ్యాయం).

దేవేంద్రనాథ్ తమ మత ధ్యేయాన్ని ప్రకటించడంతో ఊరుకోలేదు. వెంటనే ఒక సంకలన గ్రంథరూపంలో దానికి స్పష్టమైన అర్థం చెప్పనారంభించారు. ముందుగా బ్రహ్మసామాజికులు వాళ్ళ ఇళ్ళలో సమాజమందిరంలో చేసే ప్రార్థన కోసం ఒక ప్రార్థన గీతాన్ని సమకూర్చారు. అవసరాన్ని బట్టి దాన్ని సంస్కరించారు, అభివృద్ధి చేశారు. అంతకుముందు కూడా బ్రహ్మసామాజికులుగా చేరదలచినవారికి ఒక ప్రతిజ్ఞను తయారుచేసి, అందరికీ ఆమోదయోగ్యంగా ఉండడం కోసం మార్పులు చేర్పులు చేశారు. ఆయన ప్రస్తుతం ఒక బ్రహ్మాండమైన పనిలో మునిగి ఉన్నారు. వాళ్ళ మత సంహితను రూపొందించడంలో విశ్రాంతి లేకుండా ఉన్నారు. ఆయన మనస్సులో ఆ పుస్తక రూపం పటిష్టమైన పునాదుల్తోస్ఫురించిన వెంటనే అక్షయకుమార్‌ను పిలిపించి, బ్రహ్మధర్మానికి సరిగ్గా సరిపోయేవిగా

భావించిన శ్లోకాలను ఉపనిషత్తులనుండి, ఇతర గ్రంథాలనుండి ధారాళంగా చెప్పి వ్రాయించారు. ఆవిధంగా మూడుగంటల వ్యవధిలో "బ్రహ్మో ధర్మః" అనే గ్రంథం మూలాధారంగా ఆవిర్భవించింది. తర్వాత దానికి టీకాతాత్పర్యాలు విస్తరించి, సహాయక భాగాలు కలిపి సంపూర్ణరూపం తెచ్చారు.

మొదటి భాగంలోని శ్లోకాలు చాలావరకు ఉపనిషత్తుల్లోనివే. అవి సర్వశక్తుడైన సర్వేశ్వరుని గురించి, నిత్యసత్యాలను గురించి, జీవితధ్యేయాన్ని గురించి చెబుతాయి. రెండో భాగంలోని శ్లోకాలు భగవద్గీత, మహానిర్వాణ తంత్ర, మనుసంహిత వంటి గ్రంథాలనుండి సేకరించినవి. అవి ఉన్నత జీవన విధానం గురించి బోధిస్తాయి. ఈ భాగం పదహారు అధ్యాయాలుగా విభజింపబడింది. వాటిలో గృహస్థు నిర్వహించవలసిన బాధ్యతలు సూచింప బడ్డాయి. తల్లిదండ్రులు, పెద్దలు, భార్యా బిడ్డలు, ఇతర కుటుంబ సభ్యుల పట్లగల బాధ్యత, నిజాయితి, సత్యసంధత, దయ, ఆత్మసంయమనం వంటి వన్నీ ఆసూచనల్లో వస్తాయి.

అక్కడక్కడ విభిన్న గ్రంథాల నుండి రెండు మూడు శ్లోక ఖండి కలను తీసుకొని ఒకే శ్లోకంగా కూర్చారు. అద్భుత ఫలితాలొచ్చాయి. పాఠకులు కాని శ్రోతలు కాని ఈ అల్లికను అతుకుల బొంత అనుకోలేదు. ఒకే శ్లోకంగానే భావించారు. ఆ పుస్తకానికి విరివిగా ప్రచారం జరగడం వల్ల శ్లోకాలు నిరంతరం పఠించడం వల్ల ఐక్యత వాళ్ళ హృదయంలో నిలిచిపోయింది. ఆ శ్లోకాలు ఎక్కడెక్కడి నుండి తీసుకోబడ్డాయో తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఉదాహరణకు మొదటి భాగంలో పన్నెండో అధ్యాయంలో నూటతొమ్మిదో శ్లోకం చూడవచ్చు.

"ఏనహం నమృతస్యాం కిమహం తేనకుర్యం
అసతోమా సదమయ
తమ సోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మామృతంగమయ
అబిరబిర్మేధి
రుద్రయతే, దక్షిణంముఖం తేనమాంపాహి విత్యం"

ఇందులో ఒకటో పాదం బృహదారణ్యకోపనిషత్తు నుండి (2/4/3, 4/43), రెండూ మూడూ నాలుగు పాదాలు అందులోనే ఇంకొక చోటి నుండి (1/3/28), అయిదో పాదం ఐతరేయం నుండి (శాంతిపథ్), చివరి పాదం శ్వేతాశ్వతరోపనిషత్తు నుండి (4/21) స్వీకరించబడ్డాయి. ఉపని

షద్విద్యార్థి తప్ప ఇంకెవరు ప్రార్థన కోసం ఇటువంటి మిశ్రమ పద్ధతిని గురించి ఆలోచించగలరు? మహర్షి దేవేంద్రనాథ్ ఉపనిషత్తును నవీన పద్ధతిలో సమర్పించారు. తన సంఘటనా పరిజ్ఞానాన్నంతా వినియోగించి ఉపనిషత్తును పునఃసృష్టించారు. తన సంకలనం బ్రాహ్మఉపనిషత్తుగా అందరికీ తెలియాలనుకున్నారు. నిజానికి అలాగే జరిగింది.

"బ్రహ్మోధర్మః" సంకలనంతో బాటుగానే ఆయన తత్వబోధినీ పత్రికలో ఋగ్వేదాన్ని బెంగాలీ భాషలోకి అనువదించడం ప్రారంభించారు. (ఆగస్టు 1848) ఆ అనువాదాన్ని రెండు దశాబ్దాలకు పైగా కొనసాగించారు. దేవేంద్రనాథ్ వేదోపనిషత్తులను తమ మతానికి ఏకైక ఆధారమనడాన్ని తిరస్కరించినప్పటికీ, వాటి అవసరాన్ని బొత్తిగా వ్యతిరేకించినట్లు అర్థం కాదు. ప్రాచీన మత జ్ఞానంతో నిండిన ఆయన మేధస్సు అట్లా ఆలోచించి ఉండదు. అటువంటి భావన ఆయన ఉనికినే తిరస్కరించడం వంటిది. కొన్ని శ్లోకాలపట్ల కొంత వైముఖ్యం తప్ప, వేదోపనిషత్తుల మీద ఆయన పూర్వంలాగే ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం ఆయన దృష్టి పరిమిత శ్లోకాల మీద మాత్రమే ఉంది.

దేవేంద్రనాథ్ ఇదంతా కార్, టాగూర్ అండ్ కంపెనీ ఆర్థికంగా పతనమైపోయిన గందరగోళాల మధ్య చేశారని గుర్తు పెట్టుకోవాలి. 1848 ఆయన జీవితంలో అవిశ్రాంత సంవత్సరం. వైభవోపేతమైనది కూడా నేమో! అప్పటి కాయన వయస్సు ముప్పయ్యొక్క సంవత్సరాలు.

## అయిదో అధ్యాయం

# సంధికాలం

1848-58- ఈ మధ్యకాలం తులనాత్మకంగా కొంత మేలు కాలం. ఈ కాలంలో దేవేంద్రనాథ్ సమయం చాలా రకాలుగా విభజింపబడింది. తీర్థయాత్ర, ఋణపరిహారం, ఇంటిపనులు, బ్రిటీష్ ఇండియన్ అసోసియేషన్ అనే రాజకీయ సంస్థకు కార్యదర్శకత్వం, బ్రహ్మసమాజ శాఖలను విస్తరించడం, వాటిలో భవానీపూర్ బ్రహ్మసమాజం ప్రముఖమైంది ; పార్టీల్లో సమావేశాల్లో సోదర బ్రహ్మసామాజికుల్ని కలవడం, వాళ్ళతో సమాజాన్ని చైతన్యవంతం చేసే విధానాలను చర్చించడం, గ్రంథ రచనం - ఇది ఆకాల విభజన. వీటిలో చాలావాటికి పొంతనలేదు. అయినప్పటికీ అది ప్రశాంతమైన కాలం అని చెప్పలేం. దేవేంద్రనాథ్ ఇంటి ఇబ్బందుల్లో ఇరుక్కున్నందువల్ల ఇలా అనవలసివస్తుంది. మాట ప్రకారం అప్పులు తీర్చడం కొనసాగుతూనే ఉంది. కాని అది అన్నివేళలా సజావుగా జరగడం లేదు. దేవేంద్రనాథ్ తమ్ముడు గిరీంద్రనాథ్ మొదటినుండి ఎస్టేట్ల వ్యవహారాలను చాకచక్యంతో చూస్తున్నారు. కాని 1854 డిసెంబర్ 13న ఆయన చనిపోయారు. హఠాత్తుగా తమ్ముడు కన్నుమూయడంతో దేవేంద్రనాథ్ బయటి పనులకు సహాయపడే దిక్కులేక చాలా ఇబ్బంది పడ్డారు. ఇతరవిధాల కూడా ఆయనకు సంకట స్థితి ఏర్పడింది.

పధ్నాలుగువేల రూపాయల అప్పు చెల్లించలేదని ఒక ఋణదాత కోర్టు ద్వారా అరెస్టువారంటు ఇప్పించాడు. షరీఫ్ దగ్గరికి తీసుకొని పోయారు. ఎలాగైతేనేమి బైలు మీద విడుదలయ్యారు. కోర్టు ద్వారా వ్యవహారం సానుకూలమైంది.

అప్పట్లో ఆయన పడుతున్న బాధల్లో ఇది ఒక భాగం మాత్రమే. దేవేంద్రనాథ్ చిన్న తమ్ముడు నాగేంద్రనాథ్ (ద్వారకనాథ్ వెంట ఇంగ్లండుకు పోయి అతని మరణాంతరం తిరిగొచ్చారు.) ఆయనకు సరిపడని రీతుల్లో ప్రవర్తిస్తూ అప్పులు చేసేశారు. తాను బయట చేసిన అప్పులు తీర్చమని, అధికంగా డబ్బులు ఇవ్వమని పీడించారు. కొన్ని అప్పులకు జామీను ఇవ్వమని కోరారు. అది దేవేంద్రనాథ్‌కు తీవ్రంగా అవేదన కలిగించింది. ఎటువంటి

పరిస్థితుల్లోనూ ఇంక అప్పు చెయ్యరాదని తీర్మానించారు. ఫలితంగా కుటుంబంలో కలత, అశాంతి, నాగేంద్రనాథ్ కోపంతో ఇల్లు వదలిపోయి, బంధువుల ఇంట్లో ఉండసాగారు. ఎంత ప్రయత్నించినా అతడు తిరిగి రాలేదు.

కుటుంబేతరమైన సంగతులు కూడా సక్రమంగా రూపు దిద్దుకోవడం లేదు. తత్వబోధినీసభలో అక్షయకుమార్ దత్త, రఖల్‌దాస్ హల్దార్, అనంగమోహన్‌మిత్ర మొదలైనవారు "బ్రహ్మోధర్మః" గ్రంథాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. ప్రార్థనల్లో సంస్కృతానికి బదులు బెంగాలీ భాషను వాడాలని ఒత్తిడి చేస్తున్నారు. వాళ్ళు 1853, ఫిబ్రవరిలో కిడ్డెర్‌పూర్‌లో బ్రహ్మసమాజశాఖను ప్రారంభించారు. అక్కడ బెంగాలీ భాషలో బ్రహ్మోరాధన చెయ్యాలన్న వాళ్ళ చిరకాలం వాంఛ తీరింది.

అక్షయకుమార్, ఆయన స్నేహితులు కలిసి జొరశాంకొ టాగుర్ బడిలో "ఆత్మీయ సభ" అనే సంస్థ నొకదాన్ని నెలకొల్పారు. అందులో వాళ్ళు చాలా విషయాలు చర్చించారు. చేతులెత్తడం ద్వారా నిర్ణయాలు జరిగేవి. భగవంతుని లక్షణాలను కూడా వాళ్ళు ఆ పద్ధతిలోనే నిర్ణయించారు.

ఇది మహర్షికి భరించరాని దయ్యింది. ఒక నిండైన భాగవతుడుగా, కొందరు భక్తుల గోష్ఠిలో భగవంతుడు చర్చనీయాంశం కావడాన్ని సమర్థించుకోలేక పోయారు. ఆత్మీయ సభ సభ్యులు చేసే పనులతో విసుగెత్తిపోయి దేవేంద్రనాథ్, కొంతమంది 'నాస్తికులు' తన సంస్థను ఆక్రమించుకోవడానికి వచ్చినట్లు రాజనారాయణబాబుకు ఉత్తరం రాశారు. వాళ్ళను బయటికి తరిమితే తప్ప లాభం లేదు.

అయితే అది ఆక్రోశాన్ని తెలపడం తప్ప తన ఉద్దేశం మాత్రం కాజాలదు. అప్పట్లో దీనడై వ్యాకుల పడ్డ దేవేంద్రనాథ్ పడుతున్న యాతనను మాత్రం తెలియజేస్తుంది. కొంతకాలం కలకత్తాకు దూరంగా బార్‌నగర్‌లోని ఒక ఇంట్లో ఉపనిషత్తులు, శ్రీమద్భగవద్గీత చదువుతూ గడిపారు. అక్కడున్నప్పుడే హిమాలయాలకు వెళ్ళాలన్న ఆలోచన వచ్చింది. అప్పటికప్పుడే ఆ విషయాన్ని నిశ్చయించుకున్నారు.

దేవేంద్రనాథ్ హిమాలయాలకు వెళ్ళడాన్ని పరిశీలించే ముందు, ఆ కాలంలోనే ఆయన చేసిన చిన్న చిన్న యాత్రలను విహంగేక్షణతో చూద్దాం.

విగ్రహారాధనను దేవేంద్రనాథ్ మానుకున్నా తన తమ్ముళ్ళను ఒప్పించలేక పోయారు. వాళ్ళు తమ పూర్వికుల ఇంట్లో దుర్గపూజను జరుపుతూనే ఉన్నారు. అది ప్రధానంగా సాంఘికోత్సవం. అన్ని వర్గాల

ప్రజలతో తమ సంబంధాల్ని గట్టిపరిచే పండగ. కాబట్టి ఆ పండగను ఎటువంటి పరిస్థితుల్లోను వాళ్ళు మానుకోరు. జగద్ధాత్రిపూజను మానేయ డానికి ఒప్పుకొన్నారు గాని అనాదికాలం నుండి ఆచరిస్తున్న దుర్గపూజతో ఉన్న సంబంధాన్ని మాత్రం వదులుకోడానికి ఒప్పుకోలేదు.

కాబట్టి ప్రతి సంవత్సరం దుర్గపూజ వచ్చినప్పుడల్లా, దేవేంద్రనాథ్ ఇంటినుంచి వెళ్ళిపోయి, ఆ సమయాన్ని దేశంలో వివిధ స్థలాల్లో యాత్రలు చేస్తూ గడిపేవారు. ఈ యాత్రలన్నీ ఇంట్లో విగ్రహారాధన జరుగు తున్నప్పుడు అక్కడ ఉండడం వల్ల కలిగే సహింపరాని నిర్భంధం నుండి తప్పించుకోడానికి ఉపయోగపడేవి. ఈవిధంగా ప్రతి సంవత్సరం శరత్కాలంలో కొన్ని స్థలాలను ఎన్నుకొని తిరిగేవారు. 1849 శరత్కా లంలో స్టీమర్లో గౌహతి, అస్సాం వెళ్ళి కామాఖ్యకొండలమీద కామాఖ్య దేవాలయాన్ని దర్శించారు. మరుసటేడు ఆయన అనుకోకుండా సముద్ర ప్రయాణం చేసి మౌల్మిన్, బర్మా అంతా తిరిగొచ్చారు. సముద్రంలో ఓడ ప్రయాణం చెయ్యడం అదే మొదలు ఆయనకు. మౌల్మిన్ పట్టణంలో, ప్రత్యేకించి దానికి కొన్ని మైళ్ళ దూరంలో ఉన్న గుహకు పోయినప్పటి అనుభవాల్ని ఆత్మకథలో సుదీర్ఘంగా వర్ణించారు. 1851 మార్చి, ఏప్రిల్ నెలల్లో ఒరిస్సా వెళ్ళి కటక్, పూరీ క్షేత్రాల్ని సందర్శించారు. ఆ మధ్యలో బెంగాల్లోనే బ్రహ్మసమాజ కేంద్రాలను కొత్తగా తెరవడానికి అక్కడికి ఇక్కడికి చిన్న చిన్న ప్రయాణాలు చేశారు.

దేవేంద్రనాథ్ అప్పటికి ఏ రాజకీయ కార్యక్రమంగాని చేపట్టలేదు. మత కార్యకలాపాలతో ఆక్రమింపబడ్డారు కాబట్టి వేరే పనులు చూడడానికి వీలుకాలేదు. 1851 అక్టోబరులో బ్రిటీష్ ఇండియన్ అసోషియేషన్ ఆవిర్భవించింది. దేవేంద్రనాథ్‌ను కార్యదర్శిగా ఉండమంటే ప్రజా సంక్షేమ దృష్టి ఉన్నందువల్ల దానిని కాదనలేకపోయారు. ద్వారకనాథ్ టాగుర్ బెంగాల్ భూస్వాముల సంస్థను, ఆయన స్నేహితుడు జార్జిథాంప్సన్ 1845లో బెంగాల్ బ్రిటీష్ ఇండియన్ సొసైటీని ఒకే ఆశయంతో స్థాపిం చారు. ఆ రెండు సంస్థలు విలీనం కావడం వల్లనే బ్రిటీష్ ఇండియన్ అసోసియేషన్ ఏర్పడింది. బెంగాలీల రాజకీయ విమోచనానికి అనుకూలంగా, బ్రిటీషువాళ్ళ స్వార్థ ప్రయోజనాలకు వ్యతిరేకంగా శౌర్యపరా క్రమాలతో పోరాడడానికి ఒక ఉమ్మడి వేదిక అత్యంతావశ్యకం అయ్యింది. అందుకే ఆ రెండు సంస్థలు కలిసిపోయాయి. కొత్తగా చైతన్యవంతులైన బెంగాలీ బూర్జువాలు చాలాకాలం నుండి అనైక్యంగా, అసంఘటితంగా

ఉన్నారు. మధ్య తరగతి, పైమధ్య తరగతి బెంగాలీల అనైక్యత బ్రిటీషు వాళ్ళకు న్యాయసంబంధమైన అన్ని విషయాల్లోను మంచి ఫలితాలనిస్తున్నది.

పాలకవర్గం ఆవిధంగా సాధించిన విజయాల్లో 'నల్లచట్టా'న్ని నిరోధించడం ఒక్కటి. పట్టణ పరిసర ప్రాంతాల్లోని ఆంగ్లేయులైన నీలి మందు వ్యాపారాలు ఈ నల్ల చట్టాన్ని నిర్విరామంగా ప్రతిఘటించి విజయం సాధించారు. నల్లచట్టం యూరోపియన్లకు భారతీయులకు చట్టసంబంధమైన తారతమ్యాలను తొలగించడానికి ఉద్దేశింపబడింది. ఆ తారతమ్యం ఏమిటంటే భారతీయుల్లాగా కాక యూరోపియన్లను నియమోల్లంఘన చేస్తే కలకత్తాలోని సుప్రీంకోర్టుకు బదులుగా, పట్టణ పరిసర ప్రాంతాల్లోను కోర్టుల్లోనే విచారించవచ్చు అన్నది. నల్లచట్టం వచ్చి పాలక పాలితులకు న్యాయ సమానత్వాన్ని ప్రతిపాదించింది. కాని యూరోపియన్ల ఐక్య ప్రతి ఘటనవల్ల, బెంగాలీల బలహీనతవల్ల ఆ చట్టం వీగిపోయింది.

ఇది బెంగాలీల కళ్ళు తెరిపించింది. ఉమ్మడి రాజకీయవేదిక ఆవశ్యకతను గుర్తు చేసింది. ఫలితంగా బ్రిటీష్ ఇండియన్ అసోసియేషన్ పుట్టింది. దేవేంద్రనాథ్ ఆ సంస్థకు రెండేళ్ళకు పైగా (31 అక్టోబరు 1851-13 జనవరి 1854) కార్యదర్శిగా పనిచేశారు. దేవేంద్రనాథ్‌కు రాజకీయాలపట్ల ఆసక్తిలేకపోయినా, ఇచ్చిన పని ఎటువంటిదైనా, అది తన మతదీక్షకు తృష్ణకు వ్యతిరేకం కాకపోతే, దానిని నిర్వహించడం అలవాటు. ఈ కార్యదర్శి పదవి అటువంటిదే.

బ్రిటిష్ ఇండియన్ అసోసియేషన్ కార్యదర్శిగా ఉన్నప్పుడు కొన్ని మంచిపనులే చేశారు. చౌకీదారి చట్టాన్ని, భూసంస్కరణల చట్టాన్ని, ఉప్పుచట్టాన్ని సంస్కరించడంలో గట్టిగా కృషిచేశారు. అన్నిటికన్నా పేర్కొనదగింది - రాబోయే కౌన్సిళ్ళలో భారతీయులకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలని, బ్రిటిషు వలసల పద్ధతిలో భారతీయులకు స్వయంపాలనను కల్పించాలని బ్రిటీషు పార్లమెంటుకు విజ్ఞాపన పత్రం పంపడం. ఈస్టిండియా కంపెనీ 1853 లో తన శాసనాన్ని పునఃప్రవేశ పెట్టవలసి వచ్చింది. అప్పుడు ఈ విజ్ఞాపన పత్రం ఎక్కువ ప్రాముఖ్యాన్ని గడించింది.

చారిత్రకంగా ఆనాడు భారతదేశంలో రాజకీయోద్యమం పిండ స్థాయిలోనే ఉంది. అయినప్పటికీ దేవేంద్రనాథ్ నాయకత్వంలోని బ్రిటిష్ ఇండియన్ అసోసియేషన్ తన కార్యక్రమాల ద్వారా 1876 నాటి రాష్ట్ర గురు సురేంద్రనాథ్ బెనర్జీ నాయకత్వంలోని ఇండియన్ అసోసియేషన్ రాకను, 1885 నాటి భారత జాతీయ కాంగ్రెస్ రాకను సూచించిందని చెప్పవచ్చు.

1850 లేక 1851 లో మహర్షి 'ఆత్మతత్త్వవిద్య' అనే పుస్తకాన్ని రాశారు. అందులో అప్పటి తన తాత్విక భావాలను గ్రంథస్థం చేశారు. శంకర వేదాంతంలోని కేవలం అద్వైత భావాలను విమర్శిస్తూ విశ్వంలోని ద్వంద్వ ప్రకృతిని నొక్కిచెప్పారు. బహుశా మాయావాదం పట్ల పాక్షిక దృష్టిని పెంచుకొన్నారు. తిరిగి తన పాక్షికతను, సరిదిద్దుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు.,

దేవేంద్రనాథ్ హిమాలయాల్లో నివాసం కోరుకోడానికి ప్రేరేపించిన పరిస్థితులు ముందే పేర్కొనబడ్డాయి. కాశికి వెళ్ళడానికి ఒక పడవను బాడుగకు తీసుకొని 1856 అక్టోబరు 3న గంగానదిలో ప్రయాణమయ్యారు. దారి మధ్యలో నవద్వీపం, మాంఘీర్, పాట్నా వంటి స్థలాల్లో విశ్రమిస్తూ, ఒకటిన్నర నెలల తర్వాత కాశి చేరుకొన్నారు. కాశినుండి ఆగ్రాకు బాడుగ బండిలో వెళ్ళారు. తాజమహల్ సౌందర్యం చూసి ముగ్ధులైపోయారు. పడవ, బండి, పల్లకి వంటి ప్రయాణ సాధనాలు ఎక్కడ ఏది వీలైతే అక్కడ దాన్నుపయోగించుకొని అమృతసర్ వెళ్ళే మార్గంలో మధుర, బృందావనం, ఢిల్లీ, అంబాలా, లాహెూర్ నగరాల మీదుగా ప్రయాణించారు. ఎక్కడికి వెళ్ళినా అక్కడి స్థలాలను చూడడం, అక్కడి సాధువులతో, పండితులతో ఆధ్యాత్మిక విషయాలు చర్చించడం ఆయన పని. నాగేంద్రనాథ్ తన అన్నను వెతుక్కుంటూ ఢిల్లీకి పోయి, కలుసుకోలేక నిరాశతో ఇంటికి తిరిగి వచ్చారు. దేవేంద్రనాథ్ ఇంకా కలకత్తాకు దూరంగా తిరుగు ప్రయాణం ప్రయత్నంలో ఉన్నప్పుడు నాగేంద్రనాథ్ చనిపోవడం వల్ల ఆ అన్నదమ్ములు శాశ్వతంగా విడిపోయారు.

దేవేంద్రనాథ్ అమృతసర్‌లో రెండు నెలలు గడిపారు. ప్రతిరోజు స్వర్ణ దేవాలయానికి పోయి సిక్కు ప్రార్థనల్లో పాల్గొనేవారు. గురునానక్‌ను, ఆయన జప్జి పాటలను అధికంగ అభిమానించిన దేవేంద్రనాథ్‌ను సిక్కులు ఆదరించారు. మహర్షి కూడా సిక్కుల దృఢమైన మత దీక్షను చూసి వాళ్ళలో కలిసిపోయేవారు.

1857 ఏప్రిల్ 28 న మహర్షి సిమ్లా కొండలకు బయలుదేరి వెళ్ళారు. అక్కడ ఇరవైనెలలు నివసించారు. సిపాయిల తిరుగుబాటు జరిగినప్పుడు ఆయన అక్కడే ఉన్నారు. సిమ్లా ఒక సందర్భంలో తిరుగుబాటు గుర్ఖాలవశం కాబోతున్నట్లు కనబడింది. కాని ఏ విపరీతమూ జరగలేదు. దేవేంద్రనాథ్ క్షేమంగా మంచుకొండల అందచందాలను నెమరువేసుకుంటూ వచ్చేశారు. రోజంతా ధ్యానంతో ప్రార్థనతో గడిచిపోయేది. మధ్య మధ్య మత, తత్వ గ్రంథపఠనం సాగేది. ఏకాంత సమయంలో హాఫిజ్

తన వెంటే ఉన్నారు. పేరుపొందిన ఆయన 'దివాన్' నుండి బాగా నచ్చిన గజల్ పాదాలను ఎప్పుడూ పాడుతుండేవారు.

అతడు మాటిమాటికి హాఫిజ్ నుండి ప్రేరణ పొందడం బహుశా అతని అంతరమైన కోరికల ఒత్తిడి వల్ల కావచ్చు. దైవ ప్రేమలో పరవశం పొందడమే ఉపనిషత్తుల్లో పేర్కొన్న పరాతత్వ చింతన పూర్తికాదు. ఆ పారవశ్యాన్ని ఆయనకు హాఫిజ్ పద్యాలు కలిగించాయి. మొత్తం బెంగాలీ సాహిత్యంలో ఎంత వెతికినా ప్రసిద్ధ పర్షియన్ రచయిత హాఫిజ్ అభిమానిగా దేవేంద్రనాథ్‌ను మించినవారు దొరకరు.

హిమాలయాల్లో మహర్షి దైనందిన జీవనవిధానాన్ని విశదంగా చెప్పడం వీలుకాదు. ప్రస్తుత అధ్యయనానికీ మహర్షి మంచుకొండల మధ్య శాంతి సౌందర్యాన్వేషణలో గడిపిన ప్రతినిమిషాన్ని పేర్కొనడానికి సంబంధం లేదు. కాని ఆయన ప్రకృతిని ఎలా భావించారో, ప్రకృతి శోభకు కవిగా ఆయన ఎలా స్పందించారో, ఆయన ఆనందానుభవాల్నీ, కళ్ళకు కనబడే ప్రదేశాల గొప్పదనాన్ని వచనంలోనే అయినా రంగు, రూపం, ఔన్నత్యం గల భావుకతతో తన సహజమైన భాషలో ఎంత అందంగా చెప్పారో పాఠకులకు వివరించకపోతే ఆయన ప్రయాణ సమీక్ష అసంపూర్ణంగానే ఉంటుంది. ఆయన గొప్పకళాకారుడు. కాని దురదృష్టం ఏమిటంటే తన కళాకౌశలాన్ని నిరూపించుకొనేంత ఎక్కువ రచనలు చెయ్యలేదు. మత, తాత్త్విక విషయాల్లో అధికంగా లీనమైనందువల్ల ఆయన కళాత్మ, ఆయన చైతన్యం నేపథ్యంలోకి నెట్టివేయబడింది. హిమాలయాల్లో ఆయనకు లభించిన విరామంలో తన గుప్త చైతన్యాన్ని కళారంగంలోకి తీసుకురాగలిగారు. పరిసరాల ప్రశాంత వాతావరణం ఆయన కళాతృష్ణను ప్రేరేపించి తన సహజధర్మాన్ని నెరవేర్చింది.

మహర్షి 'ఆత్మజీవని' (ఆత్మకథ)నుండి ఒకటి రెండు భాగాలు ఉదాహరిస్తాను. హిమాలయాల మీద ప్రయాణవర్ణన అది. ప్రత్యేకించి సిమ్లాకు 64 మైళ్ళలో ఉన్న సంగ్రి శిఖరం మీదికి నిటారుగా ఎక్కినపుడు చేసిన వర్ణన అది. నాతేలికైన అనువాదం అద్భుతమైన ఆయన వర్ణనా సౌందర్యాన్ని మీకు ఎంతవరకు అందించగలదో చెప్పలేను.

''శ్వేతారుణపీతనీల స్వర్ణాది చిత్రవిచిత్ర వర్ణశోభితమైన సుమావళి సర్వదిక్కుల నుండి నానయనయుగళాన్ని ఆకర్షిస్తున్నది. ఆ కుసుమాల సౌకుమార్య సౌందర్యాలు, సంపూర్ణ స్వచ్ఛత ఆ దివ్యేశ్వరుని ఉనికిని ఎరిగిన భావాన్ని వ్యంజిస్తున్నాయి. అవి అందంగా ఉన్నా, సౌగంధ్యాలు కావు

ఇంకొక రకం పుష్పముంది తెల్లగూలాబీ రకం. అది అడవిలో కోరకంగా ఉన్నది. తన రేకుల తియ్యదనంతో పరిసరాలను పరిమళభరితం చేస్తున్నది. అక్కడక్కడ మల్లెపూలు తమ వాసనలు వెదజల్లుతున్నాయి. చిన్న స్ట్రాబెర్రీపండ్లు అక్కడక్కడ కమల పత్రాలవలె ఉన్నాయి. నా సహాయకుడు విడిగా ఉన్న ఒక పూదీగెనుండి పూగొమ్మను తుంచి అందిచ్చాడు. అంతటి పుష్పశోభితమైన లతను నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. విశ్వమాత తన హస్తాన్ని ఆ చిన్నారి శ్వేత కుసుమాల మీద ఉంచినట్లు ఆ దృశ్యం కనబడింది. ఈ అరణ్యాలలో ఈ పరిమళాన్ని ఎవరాస్వాదిస్తారు ? వాని సౌందర్యాన్ని ఎవరు దర్శిస్తారు ? అయినప్పటికీ ఆ సర్వాంతర్యామి ఎంత జాగ్రత్తతో, ప్రేమతో ఆ తీగలను సువాసనలతో కరుణించి హిమబిందువులతో మృదులపరచి అలంకరించాడో కదా ! ఇదే ఆ సర్వేశ్వరుని నిత్య దయానురాగాలను నా హృదయంలో రగుల్కొలిపింది. ఓ భగవంతుడా ! ఈ చిన్న పూలమీదనే ఇంత కరుణరసాన్ని కురిపించావు. మామీద ఇంకెంత ఎక్కువ కురిపిస్తావో కదా !'' (మూడో అధ్యాయం)

లేకపోతే, ఆ అధ్యాయం నుండే సంగ్రి శిఖరం నుండి దిగుతూ చేసిన వర్ణన ఉదాహరిస్తాను. ''ఈ పర్వతంలో దేవదారు వృక్షాలతో నిండిన అడవి విస్తారంగా ఉంది. కాదు, అడవి అనకూడదు. ఇది ఉద్యానవనం కన్నా అందమైనది. దేవదారువృక్షం పొడవైనది, చవుకు చెట్టులాగా ఉన్నతమైనది. చెట్టును నిలువెత్తున ఆకులు ఆక్రమించాయి. చవుకు పత్రాల్లాగే దళసరిగా ఉన్నాయి. కొమ్మలు ఆకులతో కప్పబడి ఉన్నాయి. ఆ దృశ్యం మంచుకాలంలో ఒక పెద్ద పక్షి తన రెక్కలతో అమితమైన మంచును మోసుకు పోతున్నట్లుంది. అయితే వాటి ఆకులు కృశించవు, నశించవు. అవి తమ పచ్చని రంగును ఎప్పుడూ కోల్పోవు. ఎప్పుడూ కొత్తగా ఉంటాయి. ఇది అద్భుతం కాదా! భగవంతుని చేతుల్లో ఏది అద్భుతం కాదు!! ఈ చెట్లు వాగు అడుగుభాగం నుండి పైదాకా శిఖరమంతా సైనికులవలె వినయంగా ఏర్పరించబడ్డాయి. మానవ నిర్మితమైన వనంలో అంతటి ఉన్నతమైన, అందమైన దృశ్యం ఉండటం సాధ్యమా ?''

మరొక ఉదాహరణ ఇస్తాను. దీంతో మహర్షి వచనంలోని కవిత్వాంశను చవి చూపాలన్న నా పని పూర్తి అవుతుంది. ఇదికూడా ఆత్మకథలోదే. ఇది మహర్షి అమృతసర్‌కు దిగువ ప్రాంతాల్లో తిరిగేటప్పటి వర్ణన. ''అమృతసర్‌లో రాంబాగన్ దగ్గర నేను దిగిన ఇల్లు చాలా శిథిలమైనది. సంరక్షణ లేని వనం, ఆ వనంలో నానాజాతి వృక్షాలు ఉన్నాయి. అదొక రకమైన అరణ్యం. కాని ఉత్సాహం, నూత్న దర్శనం ప్రతిదాన్లోనూ విశిష్టత,

నవ్యత, సౌందర్యాలను చూడడం ప్రారంభించాయి. ఎప్పుడు నేను సూర్యోదయంతో ఆ వనంలో విహరించసాగానో, ఎప్పుడు శ్వేతపేత వర్ణాలలో గసగసాల పువ్వులు హిమశ్శృవులు రాల్చాయో, ఎప్పుడు బంగారు కాంతి గల గడ్డిపూలు తోటలో నేలమీద వల్వెట్ అల్లకం చేసి అంచు గలిగిన తివాసీలాగా విస్తరించి ఉన్నాయో, ఎప్పుడు వాయువు సంభందాన్ని మోసుకొచ్చిందో, ఎప్పుడు సుదూర తీరాల నుండి పంజాబీల మధురగేయ నాదం వినబడిందో - అప్పుడు ఆ వనం నాకు గంధర్వ వనంగా తోచింది. కొన్నాళ్ళకు సమీప అరణ్యాల నుండి నెమళ్ళు వచ్చి నా యింటి మీద వాలాయి. చిత్ర వర్ణ శోభితమైన వాని పింఛాలు సూర్యరశ్మితో తడిసి నేలమీదికి అవతరించాయి. కొన్ని సమయాల్లో అవి గదిపై నుండి ఎగిరిపోయి వనంలో తిరిగేవి.... ఒకరోజు ఆకాశం మేఘావృతమైంది. అదిగో! అదిగో చూడు ! నెమళ్ల పింఛాలు తలదాకా విప్పార్చి నాట్యం ప్రారంభించాయి. ఎంత మనోహర దృస్యమది! నాకు వీణానాదం చేతనైతే ఆ మయూరి నాట్యానికి అనుగుణంగా వాయించి ఉండేవాణ్ణి. 'మేఘ గర్జన వినగానే నెమళ్లు పురివిప్పి ఆడును' అన్న కవుల మాట యథార్థం కావడం నేను చూశాను. 'నృతంతి. శిఖినోముదా' - ఇది కవుల కల్పన కాదు. వాస్తవమే''. (మున్పైరెండో అధ్యాయం)

## ఆరో అధ్యాయం

# కలతల బాటలో బ్రహ్మోద్యమం

1858 నవంబరు 15న దేవేంద్రనాథ్ హిమాలయాల నుండి తిరిగొచ్చారు. ఆత్మకథా కథనం ఇక్కడ ఆగిపోతుంది. అప్పటి కాయన వయస్సు నలభైఒక్క సంవత్సరాలు మాత్రమే. ఇంకా ఈ నేలమీద నలభై ఏడేండ్లు జీవించాల్సి ఉన్నా, శేషజీవితాన్ని గురించి పట్టించుకోనే లేదు. ఆత్మకథలో హిమాలయాలనుండి తిరిగొచ్చిన దాన్నిగురించి రాయలేదు. జీవితంలో చరమాంకాన్ని గురించి రాశారు. అందులో చాలా అధ్యాయాలు మహర్షి చెబుతుంటే, నిత్యం ఆయన వెంట ఉండే పండిత ప్రియనాథశాస్త్రి దాన్ని ఆజ్ఞగా భావించి రాసిపెట్టారు.

దేవేంద్రనాథ్ తన జీవిత కథలో పెద్ద ఖాళీని వదలడానికి గల కారణమేమి? మనం సాహసించి ఊహించవచ్చు.

ఈ మౌనాన్ని వివరించడానికి రెండు ఊహలు చెయ్యొచ్చు. హిమాలయాల్లో చాలాకాలం గడిపి కలకత్తాకు తిరిగొచ్చినాక, తన పరోక్షంలో బ్రహ్మసమాజంలో వైఖరి దాదాపు పూర్తిగా మారిపోయినట్లు గమనించారు. దాని కార్యక్రమాల్లో గుర్తించదగినంత కొత్త జీవితఛాయలు, దాని శరీరంలో కొత్తరక్తం ప్రవేశించాయి. కేశవ చంద్రసేన్ నాయకత్వంలో శక్తియుక్తులు గల యువజనులు కొందరు ఆ సమాజం పట్ల శ్రద్ధ చూపుతున్నారు. వారు ఆ సమాజ కార్యక్రమాలను గురించి అపూర్వమైన ప్రగతిమార్గంలో ప్రచారం చేస్తున్నారు.

కేశవ చంద్రసేన్ అసాధారణ యువకుడు. ఆయనకు మతం పట్ల భ్రాంతి లేదు. ఆయన స్మృతికి తగిలిన ఏ మత - సాంఘిక సంస్కరణను చేపట్టడానికైనా నిత్యం చైతన్యంగా ఉండేవారు. దేవేంద్రనాథ్‌లాగే భగవంతుని పట్ల పూర్తి విశ్వాసం గలవారైనా, సేన్ క్రైస్తవ మతానుయాయులు. క్రీస్తే ఆయన జీవితాదర్శం. ఆయన హృదయంలో క్రైస్తవ మతం బోధించే పాపభావం గట్టిగా నాటుకొనింది. దానినే బ్రహ్మసామాజికులకు బోధించాలనుకొన్నారు. కేశవ చంద్రసేన్ వ్యక్తిత్వం చాలా ఆకర్షణీయమైంది. దానితో ఎంతోమంది యువకులు ముఖ్యంగా కళాశాల విద్యార్థులు

ఆకర్షితులయ్యారు. ఆయన వాక్చాతుర్యమే అందుక్కారణం. రాజకీయ రంగంలో మహావక్తగా పేరుపొందిన రామగోపాల్ ఘోష్‌ను మినహాయిస్తే పందొమ్మిదో శతాబ్దపు ఆరవ దశాబ్దంలో కేశవ చంద్ర సేన్ కన్నా మించిన వక్త బెంగాల్లో దొరకడు.

దేవేంద్రనాథ్ కేశవ చంద్ర సేన్‌ను, ఆయన అనుయాయుల్ని హృదయ పూర్వకమైన మర్యాదతో బ్రహ్మసమాజంలోకి ఆహ్వానించారు. ఆయనకు కేశవ చంద్రసేన్ నాయకత్వంలో గట్టి నమ్మకముంది. బ్రహ్మసమాజం ఆయనకు హృదయప్రాయం. దాన్ని సమాజ శ్రేయస్సు కోసమే నిర్వహిస్తున్నారు. కేశవ చంద్రసేన్ ఆధ్వర్యంలో ఆ సమాజం శీఘ్రంగా శాఖోప శాఖలుగా విస్తరిల్లగలదని ఆశించారు. బ్రహ్మసమాజ ప్రయోజనాల పట్లనే కాక, కేశవపట్ల కూడా వ్యక్తిగతమైన ఇష్టాన్ని పెంచుకొన్నారు. ఆ ఇష్టాన్ని అనేకవిధాలుగా చూపారు. సమాజ కార్యక్రమాల్లో ఎక్కువ భాగాన్ని ప్రధానంగా ప్రచార భారాన్ని ఆ వర్గం చేతుల్లో పెట్టారు. కేశవచంద్ర తనలాగే యువకుడైనా, అతన్ని పీఠాధిపతిని చేసేంత వరకూ పోయి సమాజంలోని పెద్దల వ్యతిరేకతకు గురయ్యారు.

ఆనాటి బ్రహ్మసమాజ చరిత్రనంతటిని చూస్తే దేవేంద్రనాథ్ కేశవ చంద్రసేన్ వర్గాన్ని ఆహ్వానించడంలో వారి శక్తియుక్తుల్ని, సంఘసేవపట్ల, మత సంస్కరణపట్ల వాళ్ళ దృక్పథాన్ని సరిగా అర్థం చేసుకొన్నారనిపిస్తుంది. కాని అ ఇద్దరి మధ్య సత్సాంగత్యం ఎక్కువకాలం నిలవలేదు. అనివార్యమైన సంఘర్షణ సంభవించింది.

ఈ సంఘర్షణ అన్నిచోట్లలాగే ఇక్కడకూడా పూర్వాచార పరాయణులకు, అభ్యుదయవాదులకు మధ్య సహజంగానే జరిగింది. రెండంశాలను ఎవరి దృష్టితో వాళ్లు వ్యాఖ్యానించడం వలన జరిగింది. ఈ ఘర్షణలోని విభిన్న దృక్కోణాలకు కారణం వయోభేదమే. ముసలి తరానిది సహజంగా మందయానం యువతరం మార్పుకు అర్రులు చాస్తుంది. ఈ కారణంగానే వైరుధ్యం పుట్టింది. సమాజాచార్యులు యజ్ఞోపవీతం ధరించడాన్ని గురించి మొదటి కలత ప్రారంభమైంది. దానిపైన బ్రహ్మసమాజ ప్రార్థనలకు సామాజిక కుటుంబాలను పాల్గొననివ్వడం గురించి, స్త్రీ విద్య, విధవా వివాహం, కులాంతర వివాహం, 'ఇండియన్ మిర్రర్' పత్రికా పఠనంలోని ఔచిత్యం మొదలైన వాటిని గురించిన సమస్యలు ఒకటొకటిగా పుట్టుకొచ్చాయి. నిరుత్సాహపూర్వకమైన ఆ విషయాల వివరాలలోకి పోవలసిన పనిలేదు. ప్రస్తుత గ్రంథ రచనకు అది అన్వయించదు. పర్యవసానంగా రెండు వర్గాల మధ్య బహిరంగంగానే చీలికలు ఏర్పడ్డాయి. సంస్థను చెడు

వాతావరణం ఆవరించింది. ఈ కథ చదవాలంటే బాధ కలుగుతుంది. పెద్దవాళ్ళ వర్గంలో దేవేంద్రనాథ్, అయోధ్యనాథ్ పక్రాషి, బచరం చటర్జీ, రాజనారాయణ బోస్ మొదలైనవాళ్ళు చేరగా, యువక వర్గంలో కేశవ చంద్రసేన్, భాయ్ ప్రతాపచంద్ర మజుందార్, విజయకృష్ణగోస్వామి, భాయ్, గౌర్ గోవిందరాయ్ ఉపాధ్యాయ, అఘోరనాథ గుప్త మొదలైన రాజీ ధోరణి లేని ఉగ్రవాదులు చేరారు. ఈ రెండు వర్గాలను కలపడానికి ప్రయత్నాలు జరగకపోలేదు. కాని ఐక్యత అవకాశాలు నానాటికి సన్నగిల్లాయి. 1865 లో సమాజం పరస్పర విరుద్ధ, తిరస్కార దృక్పథాలు గల రెండు భాగాలుగా చీలిపోయింది. ఆఖరికి 1866 చివర్లో అనుకున్న చీలిక రానేవచ్చింది. ఒకర్నొకర్ని తిరస్కరిస్తూ, తక్కువ చేసుకుంటూ ఆది బ్రహ్మసమాజమనీ, భారతీయ బ్రహ్మసమాజమని రెండు సంస్థలుగా చీలిపోయింది. బ్రహ్మసమాజోద్యమ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది. మరొక అధ్యాయం మొదలయింది. ఈ చీలికను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలనుకొనే వాళ్ళు పండిత శివనాథశాస్త్రి రచించిన 'బ్రహ్మసమాజచరిత్ర' మొదటి సంపుటాన్ని, అజిత్‌కుమార్ చక్రవర్తి రాసిన 'మహర్షి దేవేంద్రనాథ్ జీవిత చరిత్ర' చదవచ్చు. ప్రస్తుత గ్రంథ పరిధిలో ఇంతకన్నా ఎక్కువ చెప్పడానికి వీలుకాదు.

రెండు వర్గాల మధ్య సాగుతున్న వివాదంలో సనాతన పరాయణ తత్వం, నిరంకుశత్వం, పక్షపాతం వంటి ఆరోపణలన్నీ దేవేంద్రనాథ్ మీదనే తరుచుగా చెయ్యబడేవి. యువకులు తమ స్వాధీనంలో ఉన్న పత్రికల్లో ఈ ఆరోపణలు చేసేవారు. కాని దేవేంద్రనాథ్ పత్రికల్లో ఒక్కసారి తప్ప, తన నిర్దోషిత్వాన్ని నిరోపించుకోడానికి ప్రయత్నించలేదు. సాంతం గంభీరమైన మౌనం పాటించారు. విరాగిలాగా మొండిధైర్యంతో వానినన్నిటినీ భరించారు. అది అందరికీ మంచిది, ఎవరికీ చెడు కాదు. మనిషి గుణాన్ని స్పష్టంగా స్వచ్ఛంగా ప్రదర్శిస్తుంది. అంతకు ముందే దేవేంద్రనాథ్ మీద తిరుగుబాటు చేసిన భారతీయ బ్రహ్మసమాజం వాళ్ళే, మరుసటేడు "మహర్షి" బిరుదునిచ్చారంటే, అందుక్కారణం ఆయన గాంభీర్యం తప్ప మరేమీ కాదు. బ్రహ్మసమాజం చీలిపోయిన సంవత్సరంలోపలే (1867) అనుకోకుండా ఈ సంఘటన జరిగింది. వైద్ధాంతిక విభేదాలవల్ల పరస్పర సంబంధాల్లో వచ్చిన ఇబ్బందులున్నప్పటికీ, బ్రహ్మసమాజానికి సహా మతస్థులైన కేశవ చంద్రసేన్ వర్గం ఆ బిరుదునిచ్చారంటే, వాళ్ళకు దేవేంద్రనాథ్ పట్ల గల గౌరవం, మర్యాద తెలుస్తాయి.

పూర్వపు వ్యతిరేకులపట్ల ఆయన మౌనమే గొప్ప వాగ్గరితో సమానం. దీన్నిబట్టి దేవేంద్రనాథ్ తన ఆత్మ జీవనిలో బ్రహ్మోద్యమంలో వచ్చిన చీలికను గురించి రాయకుండా ఎందుకు మౌనం వహించారో అర్థం చేసుకో వచ్చు. నిజం చెప్పాలంటే, ఆ సన్నివేశం ముదిరి ముదిరి అసహ్యమైన మలుపు తిరగబోతున్నది. కాబట్టి ఆయన అక్కడ మానేశారు. అనుభవంవల్ల, స్వభావరీత్యా దేవేంద్రనాథ్ ఇతరులను గుడ్డిగా విమర్శించడానికి ఇష్టపడరు.

రెండోది : చీలిక తర్వాత ఆయన అన్నిరకాల బాహిర జీవితంనుండి విరమించుకొన్నారు. మూడు దశాబ్దాలకు పైబడిన తక్కిన కాలం యాత్రలు, మౌనధ్యానం, అధ్యయనం, రచనా వ్యాసంగం, అడిగినప్పుడు బ్రహ్మ సమాజంలో ప్రసంగించడం మొదలైన కార్యక్రమాలతో గడిపారు. ఆయన జీవితంలో చివరి పదేళ్ళు పూర్తిగా ఎడతెరపిలేని అస్వస్థతతో నిండి పోయాయి. కాబట్టి ఇంక ఆయన జీవితంలో పేర్కొనవలసింది ఏమీలేదు. ఆత్మకథలో చాలాభాగం ఆయన ఆధ్యాత్మిక జీవితాన్ని గురించి తగినంతగా చెబుతారు. ఆ జీవితంలో ఆంతర సంఘర్షణలు, అనుమానాలు, సందేహాలు, చీకటినుండి కాంతిని చేరేవరకు గల భిన్నస్థాయిలు కనబడతాయి. విషయ మంతా వచ్చేసింది కాబట్టి ఇంకా చెప్పవలసిన ప్రధానాంశం ఏదీ లేదు.

విశ్రాంతి, అధ్యయనం, ధ్యానం, యాత్రలు - వీటితో కూడుకొన్న ప్రశాంత జీవితం గురించి చెబితే హృదయాకర్షకంగా ఉండదు. కాబట్టి కథనం అక్కడ ఆగిపోవటమే శ్రేయస్కరం. మరలా ముందుకు పోలేదు.

ఏడో అధ్యాయం

# ఆఖరి రోజులు

దేవేంద్రనాథ్ జీవితంలో ఆఖరి మూడు దశాబ్దాలు యాత్రలు, ధ్యానం, అధ్యయనం, విశ్రాంతి రూపాల్లో గడిచిపోయినట్లు ముందే చెప్పబడింది. ముసలితనంలో లభించే విరామసమయాన్ని పరిస్థితుల్ని, వాతావరణాన్ని బట్టి ఒక్కొక్కరు ఒక్కొక్కవిధంగా వినియోగించుకొంటారు. మహర్షి కూడా అలాగే తన ధోరణిలో ఆకాలాన్ని వాడుకొన్నారు. ఆయన తన కాలాన్ని జీవిత పరమార్థాన్వేషణ కోసం, ఆత్మశోధనా దీక్ష కోసం వెచ్చించారు. కాని ఈ అంతరోద్యమం ఉపరితలం మీద ఏమాత్రం గోచరించదు. మహర్షి జీవిత చరిత్రకారుడు అజిత్‌కుమార్ చటర్జీ చెప్పినట్లుగా "చివరిరోజుల్లో ఆయన జీవితం అంతరికంగానే జరిగిపోవడం వల్ల, బాహ్య చరిత్ర చెప్పడం కష్టం. ఆ అంతర జీవితంలోనే ఆయన సామాజిక జీవితం కనిపిస్తుంది."

అయినప్పటికీ ఉన్నతమూ, ప్రయోజనాత్మకమూ అయిన ఆ జీవిత చక్రాన్ని పూర్తి చెయ్యాలంటే మాత్రం ఆయన అంతరంగిక జీవిత చరిత్రను సాధ్యమైనంతలో గుర్తు చేసుకోవలసి ఉంది. ఆ జీవిత చిత్రం రూపంలో గంభీరం, నిర్వహణలో సుందరం. ఆ చిత్రానికి తుదిరూపం ఇవ్వడంలో ఎవరు తోడ్పడగలరు ?

1868లో దేవేంద్రనాథ్ ముర్రీ కొండలకు, అక్కడినుండి కాశ్మీరుకు వెళ్ళారు. ఈ యాత్ర విశేషాలు ఆయన అప్పుడు రాసిన చాలా ఉత్తరాల్లో నిక్షిప్తమై ఉన్నాయి. కలకత్తాకు వచ్చి ఒక సంవత్సరం రోజులు కొండల ప్రాంతాల్లో తిరగడానికి బయలుదేరారు. హిమాలయాల మీద ఆయన ఒక చోటినుండి ఇంకొక చోటికి బాటసారిలాగా సంచరించారు. ఆఖరికి ధర్మశాలలో విశ్రమించారు. మరల నేలకు దిగివచ్చారు. 1871 - 72 మధ్యకాలంలో దేవేంద్రనాథ్ కలకత్తా జీవితాన్ని, కేశవచంద్రుని క్రీస్తు విగ్రహస్థాపన, 1872 నాటి బ్రహ్మవివాహ చట్టం వల్ల భారతీయ బ్రహ్మ సామాజికులతో వచ్చిన అభిప్రాయ భేదాలు తెలుపుతాయి. దేవేంద్రనాథ్ ప్రజాజీవితం నుండి విరమించుకొన్నారు కాబట్టి ఆ వివాదాలను గురించి తొందరపడకుండా జాగ్రత్తపడ్డారు. మొదట్లో వాటినుండి స్వయంగానే దూరమైనారు.

మహర్షి 1873 నుండి పదీపన్నెండేళ్ళు దగ్గరి, దూరతీరాల్లో యాత్రలు చేశారు. 1873లో హిమాలయాలకు మూడోసారి వెళ్ళారు. అప్పుడు పన్నెండేళ్ళ రవీంద్రనాథ్‌ను తీసుకెళ్ళారు. అంతకు ముందురోజే ఆ బాలుని ఉపనయనం (యజ్ఞోపవీతధారణ) జరిగింది. బోడితల, కాషాయ వస్త్రాలు ధరించిన ఆ బాలుడు అడవిలో ఆశ్రమబ్రహ్మచారిగా కనబడ్డాడు. దేవేంద్రనాథ్ తనతోబాటు హిమాలయాలకు రమ్మన్నప్పుడు ఆ బాలుని ఆనం దానికి అవధులులేవు. రవీంద్రనాథ్ తన 'జీవనస్మృతి' (జ్ఞాపకాలు)లో హిమాలయాలకు తమ ఉమ్మడి ప్రయాణాన్ని గురించి రాశారు. అందులో అక్కడక్కడ రవీంద్రునికి కలిగిన అద్భుతాశ్చర్యాలు, తండ్రిపట్ల ఆయన కున్న భయం, ఆయన సున్నిత హాస్యం గోచరిస్తాయి.

దారిలో బోల్‌పూర్‌లో ఆగి కొన్ని రోజులు గడిపారు. ఆ ఇద్దరు టాగూర్ల తర్వాతి జీవితంతో ఆ ఊరికి సన్నిహిత సంబంధం ఏర్పడింది.

బోల్‌పూర్ బిర్‌భుం జిల్లాలో కలకత్తాకు వందమైళ్ళ దూరంలో ఉంది. 1863 లో దేవేంద్రనాథ్ ఆ ఊళ్ళో ఒక స్థలం కొన్నారు. 1901లో అదే రవీంద్రుని శాంతినికేతనం అయింది. నేపథ్యం ఇది - దేవేంద్రనాథ్ రాయ్‌పూర్ సిన్హాలను అప్పుడప్పుడు కలిసేవారు. అది బిర్‌భుం జిల్లాలో పేరుమోసిన జమీందారీ కుటుంబం. అటువంటి సందర్భాల్లో ఒకసారి దేవేంద్రనాథ్ బోల్‌పూర్ మీదుగా రాయ్‌పూర్ వెళ్తున్నారు. బోల్‌పూర్ దగ్గర మామిడి తోటలతోను, దట్టమైన అడవులతోను నిండిన విశాలమైన స్థలాన్ని చూశారు. దానికి 'భవందంగార్‌మఠ్' అని పేరు ఈ నాటికి కూడా. ఆరోజుల్లో ఆ ప్రాంతం దొంగల, బందిపోట్ల ఉపద్రవాలతో అట్టుడికిపోతూ ఉండేది. ప్రజలు పగటిపూటకూడా అడుగువెయ్యడానికి భయపడేవారు. ఆ భూమి వైశాల్యం మహర్షి హృదయంలో అనంతత్వాన్ని నింపింది. ఒక్కచోట ఒకే ఒక 'సప్తవర్ణ' వృక్షం కనిపించింది. మహర్షి పల్లకిని ఆపమన్నారు. ఆ చెట్టుకింద కూర్చొని ధ్యానం చేశారు. అది ఆయన మనసును శాంతపరచింది. ఆ స్థలం ఆయనకెంతో నచ్చింది. అప్పటికప్పుడే దాదాపు ఇరవై 'బిఘా'ల వైశాల్యం గల భూమిని రాయ్‌పూర్ సిన్హాలనుండి కొనాలని నిశ్చయించారు.

ఆ స్థలం కొన్న తర్వాత మహర్షి ఏకాంత బ్రహ్మారాధనకోసం ఒక మందిరం నిర్మించారు. ఇరవైమూడేళ్ళ తర్వాత, 1886 మార్చి 8 న ఆ భూమికి సంబంధించి ఒక ట్రస్టును స్థాపించి, ముగ్గురు ట్రస్టీలతో కూడిన

పాలకవర్గాన్ని నియమించారు. ఆ భూమిని ఏకేశ్వరోపాసన కోసం ఒక ఆశ్రమాన్ని నిర్మించడానికే ఉపయోగించేటట్టు ఏర్పాటు చేశారు. ఆయన కోరిక రవీంద్రనాథటాగూర్ 'శాంతం శివం అద్వైతం' అనే ఆదర్శంతో శాంతినికేతన్ అనే అంతర్జాతీయ విశ్వ విద్యాలయాన్ని స్థాపించడంతో నెర వేరింది. అక్కడ ప్రపంచమంతా ఒకే గూటిలో ఉన్నట్లుంటుంది. (యత్ర విశ్వం భవత్యేక నిదం.)

ఇది బోల్‌పూర్ గురించి, శాంతినికేతన్ ఆశ్రమం గురించి, రవీంద్రునితో కలసి వాయువ్యదిశగా ప్రయాణించి మార్గమధ్యంలో సాహెబ్‌గంజ్, దానాపూర్, అలహాబాద్, కాన్పూరువంటి స్థలాల్లో విశ్రమిస్తూ అమృతసర్ చేరుకొన్నారు. పూర్వంలాగే ఇప్పుడుకూడా మహర్షి స్వర్ణాలయం దర్శించి, సిక్కులతో కలసి తిరిగారు. అమృతసర్‌నుండి డల్హౌసి బయలుదేరి, బక్రోటలో దిగారు. 'జీవన స్మృతి'లో ఈ స్థలాన్ని గురించిన జ్ఞాపకాలు చాలా ఉన్నాయి. చాలానెలల తర్వాత రవీంద్రుని ఇంటికి పంపించి తాను మాత్రం మంచుకొండల్లో నివసించారు.

మహర్షి మరణశయ్యపై వున్న సతీమణికి చేరువలో ఉండడానికి సకాలంలోనే తిరిగివచ్చారు. మనస్సులో ఎంతో వియోగబాధను అనుభవించినా పైకి పొక్కనీయక, గాంభీర్యం వహించారు.

1875 మార్చిలో దేవేంద్రనాథ్ సతీమణి శ్రీమతి శారదాదేవి మరణించారు. కర్మకాండ పూర్తికాగానే మరల బక్రోట పర్వతాగ్రాలకు చేరుకొన్నారు. అప్పుడప్పుడు కిందకి వస్తూ, అక్కడ రెండేళ్ళున్నారు. కొంతకాలం శాంతినికేతనంలో గడిపి, 1877లో తన అల్లుడు శారదప్రసాద్ గంగూలితో కలిసి చైనాకు వెళ్ళారు. ఈ ప్రయాణం గ్రంథస్థం కాలేదు. చైనానుండి ఆయన బంధుమిత్రులకు బహుమతులు చాలా పట్టుకొచ్చారు.

ఈ రీతిగా మహర్షి కాలం కొన్ని రోజులిక్కడ మరికొన్నిరోజులక్కడ గడిచిపోయాయిగాని, కలకత్తాలో మాత్రం ఉండలేదు. ముస్సోరీలో కొంత కాలం గడిపారు. అప్పుడు పండిత ప్రియనాథశాస్త్రి తన వెంట ఉన్నారు. దేవేంద్రనాథ్ దినమంతా ధ్యానం, ప్రార్థన చేస్తూ మధ్య మధ్యలో హఫిజ్‌ను స్మరించేవారని శాస్త్రి రాశారు.

ఎనభైలలో దేవేంద్రనాథ్ ఆరోగ్యం బాగా క్షీణిస్తుంది. క్షీణిస్తున్న ఆరోగ్యాన్ని కుదుటపరుచుకోడానికి ఆయన 'చిన్సురా'లో కొంతకాలముండి, తర్వాత బొంబాయి రేవులో కొన్నాళ్ళుండి, మరలా చిన్సురా తిరిగొచ్చారు. ఆ తర్వాత డార్జిలింగ్ వెళ్ళారు. కాని ఆరోగ్య పరిస్థితిలో మెరుగు కనబడ లేదు.

దేవేంద్రనాథ్ చివరి పదేళ్ళు ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తున్న స్థితిలో, కలకత్తాలోని పార్కువీథిలో ఒక అద్దె ఇంట్లో నివసించారు. అక్కడ ఎక్కువ కాలం ధ్యానం, ప్రార్థనతో గడిపారు. ఆరోజుల్లో ఆయన కూతురు సౌదామినీదేవి ఉపచారాలు చేశారు. ఆమె తన జ్ఞాపకాల్లో "నాన్న సోఫాలో ఉదయం నుండి చీకటి పడేవరకు ఒకే భంగిమలో కూర్చొని భగవంతుని ధ్యానంలో కాలం గడిపేవారు. స్నానపానాలకు తప్ప తక్కిన కాలమంతా భగవంతునికే అర్పించేవారు. మేము ఏదైనా అవసరం ఉండి పోయి పలకరిస్తే ఉలిక్కిపడి 'నేనక్కడికి వెళ్ళాను? మీరు నన్నెక్కడికి తీసుకొచ్చారు?' అనేవారు. ఆయన ఏకాగ్రతను భంగపరచినందుకు మేం పశ్చాత్తాప పడేవాళ్ళం" అని రాశారు.

దేవేంద్రనాథ్ కుమారుల్లో రవీంద్రనాథ్ అప్పటి ఆది బ్రహ్మసమాజానికి కార్యదర్శి. ఆయన తండ్రికి బాగా దగ్గరయ్యారు. మామూలుగా బ్రహ్మ సమాజం పనిమీద సలహాసంప్రదింపులకు ఆయన దగ్గరికి వచ్చేవారు.

బ్రహ్మసమాజ నాయకులు - వారు ఆది, సాధారణ, నవవిధాన్ వర్గాలలో [1] దేనికి చెందినవారైనా - పూజ్యవృద్ధుని ఆరోగ్యాన్ని గురించి పరామర్శించడానికి, ఆయన ఆశీర్వాదాలకు అప్పుడప్పుడు వస్తూనే ఉండేవారు. వాళ్ళ ద్వేషాలు, శత్రుత్వాలు ఆ బ్రహ్మసమాజ పితామహుని ముందు మాయమై పోయేవి.

ఆవిధంగా వచ్చి విచారించిన వారిలో రాజనారాయణబోస్, శివనాథశాస్త్రి, ఉమేశ చంద్ర దత్త, బిపిన్ చంద్రపాల్, సురేంద్రనాథ్ బెనర్జీ, అనంతమోహన్ బోస్ వంటివారు ఉన్నారు. కేశవ చంద్రసేన్ ముందుగానే (1883) చనిపోయారు.

చివరిరోజుల్లో మహర్షి 'యతి' పద్ధతి మీద ఇష్టంతో ఇంటికి దూరంగా ఉండాలని ప్రయత్నించారు. యతి అంటే హిందూ ధర్మం ప్రకారం జీవితంలోని నాలుగు ఆశ్రమాలలో చివరిదైన సన్యాసాశ్రమం. ఆ ఆశ్రమంలో ఒక నిర్జన స్థలంలో ఏకాంత జీవితం గడిపి జీవితాన్ని చాలిస్తారు. కాని

---

1. బ్రహ్మోద్యమం అప్పటికి మూడు సంస్థలుగా చీలిపోయింది. సామాజికుల్లో అభిప్రాయభేదాలే అందుక్కారణం. ముందు మనం చూచినట్టుగా ఆది, భారతీయ బ్రహ్మసమాజాలుగా చీలిపోయింది. తర్వాత కొన్నేళ్ళకు 'కూచ్ బిహార్ వివాహం' వివాదం వల్ల భారతీయ బ్రహ్మసమాజం సాధారణ బ్రహ్మసమాజమని, నవవిధాన్ బ్రహ్మసమాజమని చీలిపోయింది.

మహర్షి ఆరోగ్యం పూర్తిగా క్షీణించి పరిస్థితి విషమించడంతో ఆ జీవితం ఎక్కువ కాలం సాగలేదు. తన పూర్వీకుల నివాసమైన 'జొరశాంకొ టాగుర్‌బడి'కి తీసుకొని పోబడ్డారు. అక్కడ 1905 జనవరి 19న దేవేంద్ర నాథ్ ఆఖరి శ్వాస వదిలారు. దానితో ఆ జీవితం - ప్రయాణంలో సుదీర్ఘమూ, రూపంలో ఉన్నతమూ అయిన జీవితం, భగవంతుని ప్రేమలో, ప్రజాసేవలో గడిపిన జీవితం - ముగిసింది.

## ఎనిమిదో అధ్యాయం

# సాహితీ సమాలోచనం

దేవేంద్రనాథ్ రచనల్లోని సాహితీ గుణాలను కావలసినంతగా పరిశీలించలేదు. ఆయన రచనావస్తువులో మతాంశం ప్రముఖమై, అందులోని కళావిలువల్ని మదింపు వెయ్యడానికి అడ్డుపడుతుంది. దేవేంద్రనాథ్‌లోని రచయిత ఆయనలోని ఋషిచేత కప్పివేయబడ్డాడు. బెంగాలీ ప్రజలు ఆయనలో ఒక దైవాంశ సంభూతుణ్ణీ, ఒక ఆధ్యాత్మిక గురువును, ఒక తాత్వికుణ్ణి చూడ్డానికే అలవాటు పడ్డారు. ఈ పాత్రల్ని మహర్షి నిర్వహించడమే అందుక్కారణం. పండిత శివనాథ శాస్త్రి ప్రకారం "మహర్షి దేవేంద్రనాథ్ టాగుర్ ఈ దేశంలోని మత మేధావులలో ఒక ప్రముఖుడు. ఆయన ప్రాచీన భారతీయ ఋషులకు నిజమైన వారసుడు" ఈ వర్ణన సముచితమైనదే. కాని దురదృష్టం ఏమిటంటే, ఆయన మత వ్యక్తిత్వం పట్ల మన దృష్టిని ఎక్కువగా ప్రసారించడంతో ఆయన జీవితంలోని మరోపార్శ్వాన్ని అంటే సాహితీ వ్యక్తిత్వాన్ని - ఆలోచింపక పోవడం.

బెంగాలీ పాఠకులకు బెంగాలీ వచన రచయితల్లో సాధారణంగా వినబడేవి రామ్మోహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, అక్షయకుమార్ దత్త భూదేవ్ ముఖర్జీ వంటి కొందరి పేర్లు మాత్రమే. వచనప్రక్రియ రూపు దిద్దుకొంటున్న కాలంలో వాళ్ళు నిస్సందేహంగా బెంగాలీ వచన నిర్మాతలే. కాని మనం ఒక రచనాశైలిని కళాదృష్టితో అంచనా వేస్తే, బెంగాలీ వచనం అభివృద్ధి చెందడానికి దేవేంద్రనాథ్ చేసిన దోహదం, తక్కినవాళ్ళకన్నా తక్కువైనదేమీ కాదు. రామ్మోహనరాయ్ వచనం హిందూ ధర్మాన్ని, వేదాంతాన్ని సరిగా అర్థం చేసుకోవాలనుకొన్నవారికి ఉపయోగింపబడింది. అది వివరణాత్మకం. విద్యాసాగర్ దానికి సొగసులు దిద్దారు. అటువంటి వచనం ఇంతకు ముందు క్రైస్తవ మిషనరీల చేతుల్లో ఉండింది. బెంగాలీ రచయితలు వాళ్ళవల్ల ప్రభావితులైనారు. అక్షయకుమార్ తార్కిక వచన రచనలో సిద్ధహస్తులు. కాని ఆయన ఉక్తిలాలిత్యాన్ని గురించి, శైలి సొబగును గురించి పట్టించుకోలేదు. భూదేవ్ హిందువుల నిత్యవ్యవహారానికి చెందిన సాంఘిక వ్యాసాలు కొన్ని మంచివి రాశారు. స్పష్టత ఆయన వచన లక్షణం. కాని ఆయన అక్షయకుమార్‌లాగ విషయవివరణలో కళాత్మక పద్ధతిని అనుసరించలేదు.

పై రచయితలందరితో పోల్చి చూచినప్పుడు దేవేంద్రనాథ్‌లో ఈ కళాంశం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. దేవేంద్రనాథ్ సారళ్య సౌందర్యాలతోనేకాక, అంతవరకూ లోపించిన కవితాగుణంతో కూడా వచనాన్ని తీర్చి దిద్దారు. ఇంతకుముందే చెప్పినట్లు ఆయన ఆలోచనలోనే రూప సౌందర్య భావన ఇమిడిఉంది. గూఢమైన మత సిద్ధాంతాలవంటి విషయాలను చర్చించేటప్పుడు ఆయన తాత్వికతలంలో ఉంటారు. కాని ప్రకృతి సౌందర్య వర్ణన చేసినప్పుడు రచనలో రసాంశ తక్కిన వాటికన్నా ఆధిక్యత వహిస్తుంది. ప్రకృతి సౌందర్యాన్ని ఆయన ఎంత సూక్ష్మంగా దర్శించేవారో చెప్పడానికి పూర్వాధ్యాయంలో వారి 'ఆత్మ జీవని' నుండి మూడు ఖండాలు ఉదాహరించబడ్డాయి. అనువాదం మూల సౌందర్యాన్ని చూపగలిగినా అది అంత పటిష్టమైన ముద్రవేయదు. అయినా అనువాదంలో సహితం ఆయన రూపవర్ణ దృష్టిని, ప్రకృతి వర్ణనాశక్తిని తక్కువచేసే ప్రమాదం లేదు. అటువంటి వాక్య సముదాయాలు ఆయన రచనల్లో చాలాచోట్ల కనిపిస్తాయి. ముఖ్యంగా హిమాలయాలకు, ముర్రీ కొండలకు, కాశ్మీరుకు చేసిన ప్రయాణాలను గురించి రాజనారాయణ బోస్, ప్రియనాథ శాస్త్రి, గణేంద్రనాథ్ టాగుర్, శ్రీకాంత్ సిన్హా మొదలైనవారికి రాసిన ఉత్తరాలలో కళాత్మక వాక్యాలు కనిపిస్తాయి.

ఇంతకు ముందే గమనించినట్లు ఆయన సమతలంలోను, ఊర్ధ్వ తలంలోను సంచరించడానికి ఇష్టపడ్డారు. సంఘస్థాయిలో, బ్రహ్మసమాజ నిర్వహణం మొదలైన సంక్షేమ కార్యక్రమాల్లో నిమగ్నమైనప్పుడు, ఆయనకు సహజమైన సమతల ఇచ్ఛలు వాటంతటవే కుదురుకున్నాయి. భగవంతుని ముఖాముఖి (ప్రతీకాత్మకంగా) కలుసుకోడానికి ప్రయత్నిస్తూ మౌనధ్యానంలో మునిగినప్పుడు, ఆయన ఊర్ధ్వ ముఖప్రకృతి స్పష్టమైంది. పోల్చి మాట్లాడితే, ఇదీ ఆయన నిజతత్వం; ఈ ఊర్ధ్వముఖీనత నుండి వెలుగు కోసం పడే ఆతృత ముమ్మరంగా ఉంది. ఈ గోథేపద్ధతి ఊర్ధ్వముఖీనత ఆయన రచనల్లో అక్కడక్కడా ప్రతిబింబిస్తుంది. రవీంద్రనాథ్ ఆ లక్షణాన్ని ప్రముఖవారసత్వంగా స్వీకరించారు. వెలుగుపట్ల ఆయనకున్న ప్రేమ తాను చిరకాలంగా ఆరాధిస్తున్న ఉపనిషత్తులను జీర్ణించుకోగల శక్తికి సూచన. సూర్యకాంతి, చంద్రకాంతి ఆయనను అపరిమితంగా ఆకర్షించాయి. ఉదాహరణకు ఆయన రచించిన 'బ్రహ్మోధర్మవ్యాఖ్యాన్' అనే ప్రసిద్ధ గ్రంథంనుండి రెండు ఘట్టాలు చూడండి.

సూర్యుని గురించి: సూర్యుడు ఉషఃకాంతితో సప్తావస్థలో ఉన్న ప్రాణుల్ని మేల్కొల్పడానికి, అందవిహీనంగా ఉన్న జగత్తును అందంగా

మలచడానికి ఉదయించినప్పుడు, దీక్షాబద్ధులైన భక్తులు ఆకాంతిమంతుడైన సూర్యునిలో అందరూ పూజించే సాకారమూర్తిని చూస్తారు. ఉషఃకాలంలో ఆయన జ్యోతి మన మానసాకాశంలో ప్రసరిస్తుంది. ప్రపంచం చీకటి నుండి బయటపడగానే సూర్యాత్మ - ఆత్మలకు ఆత్మ, అన్ని ప్రాణులకు ఆత్మ అయిన - ఆ సర్వేశ్వరుడు తనకు తానే దర్శనమిస్తాడు. సరికొత్త సూర్య తేజస్సులో మనం అన్ని కాంతులకు కాంతిని చూస్తాం. ఆ ఉషస్సు అన్ని అందాల్లోని అందాన్నీ మనకు చూపిస్తుంది. మనం కళ్ళు తెరవగానే ఆయన కళ్ళు మన మీద కేంద్రీకరించినట్లు చూస్తాం. ఆయన వైభవం 'ఎందెందు వెదకి చూచిన అందందే గలదు'. (రెండో వ్యాఖ్యానం.)

చంద్రుని గురించి : ఈరాత్రి చంద్రుని వైభవం చూడండి. అతని మధుర కిరణాలు వెయ్యినొక్క దిశల్లో ప్రసరిస్తున్నాయి. చంద్రుని ధవళ వర్ణాన్ని ఈ రాత్రి ధరించింది. చెట్లుకూడ తమ పచ్చదనాన్ని వదులుకొని తెల్లపూత వేసుకొన్నాయి. నిన్న, గంగానది తీరంలో ఆ తెల్లని ఇసుకతిన్నెల మీద చంద్రకాంతిని అనుభవిస్తున్న వాళ్ళను నేనడుగుతున్నాను : గంగా తీరాల్లో ఒంటరిగా గాని, ఇతరులతో కలసిగాని తిరుగుతున్నప్పుడు ఆ నది నుండి వీచే తియ్యనిగాలితో మీ శరీరం చల్లబడినప్పుడు, ప్రపంచమంతా చంద్రుని మధురకిరణాలను తాగుతుంటే చూచి మీ హృదయం మృదువై నప్పుడు - అప్పుడు మీలో కొందరైనా మీ హృదయాలలో ఆ అనంతుని గొప్పదనాన్ని అనుభవించలేదా ?'' (ఇరవై రెండో వ్యాఖ్యానం.)

సర్వత్రా సౌందర్యం పట్ల దివ్యమైన ప్రేమను చూస్తాం. ఆ ప్రేమ గుడ్డిది కాదు, చైతన్యస్ఫోరకమైనదే. అందుకే, కనీసం ఈ ఖండికల్లో దేవేంద్రనాథ్‌లోని ఋషికన్నా, రచయితే స్పష్టంగా దర్శనమిస్తాడని చెప్ప వచ్చు.

ఇది పరిశీలనాత్మకమూ, రసాత్మకమూ అయిన మహర్షి వచనంలోని సౌందర్య గుణాన్ని గురించి జరిగిన పరిశీలన. అయితే ఆయన ఆత్మజీవని, బ్రహ్మోధర్మవాఖ్యాన భాగాలు, ఆత్మతత్వవిద్య (ఆత్మవిజ్ఞాన శాస్త్రం) లేక బ్రహ్మోధర్మర్‌మత్‌ఓవిశ్వాస్ (బ్రహ్మధర్మసిద్ధాంతాలు, విశ్వాసాలు) లేక కలకత్తా బ్రహ్మోసమాజర్‌బక్తృయ (కలకత్తా బ్రహ్మసమాజంలో ప్రసంగాలు) లేకబ్రహ్మధర్మర్‌వ్యాఖ్యాన్(బ్రహ్మధర్మవ్యాఖ్యానాలువంటిగ్రంథాల్లో)తాత్విక, మత, ఆధ్యాత్మిక సిద్ధాంతాలను చర్చించేటప్పుడు ఆయన ఆలోచనావిధానంలో విభిన్నత్వం చూడవచ్చు. అప్పటి సున్నితమైన భావుకత ఇప్పుడు గంభీర మైన ఆలోచనగా మారిపోయింది. సంయమనం, గాంభీర్యం, సంస్కారం, వాక్శుద్ధి, భాషాక్రమం, పొదుపును సాధించే పదాల ఎన్నిక, తగినంత వాక్య

పరిమాణం మొదలైన లక్షణాలు కలిసిన వచనం ఉత్తమ వచనం అని మథ్యూ అర్నాల్డ్ అన్నారు. ఇవన్నీ దేవేంద్రనాథ్ రచనల్లో అపరిమితంగా కనిపిస్తాయి. ఇక్కడ ఆయన ఆలంకారికుడుగా కన్నా శిల్పి అయిన కళాకారుడుగానే కనబడతారు. ఇది ప్రకృతిలోని శ్రవ్యదృశ్యవర్ణనల్లో ఆయన వాడిన శైలికన్నా భిన్నమైంది. ఇక్కడ గమన తీవ్రతా తీవ్రతల మీద కన్నా స్థౌల్యం మీద దృష్టి ఎక్కువ. ఈ శైలిలో గాంభీర్యం ఎక్కువ. శైలిలోని స్పష్టత గాంభీర్యాన్ని పోగొట్టకుండా కాపాడింది. అయితే అది ఒకరకంగా మరీ గంభీరం అయింది.

దేవేంద్రనాథ్ రచనల్లో రెండోకోవకు చెందిన రచనల శైలీ లక్షణాలను తెలుసుకోడానికి, ఆయన 1860 లో బ్రహ్మవిద్యాలయంలో చేసిన ప్రసంగాల సంకలనం - "బ్రహ్మోధర్మర్‌మత్ ఓవిశ్వాస్" - నుండి ఒక ఖండాన్ని ఉదాహరిస్తాను. ఇది పదవ ఉపన్యాసం పారలౌకిక జీవితంలోది. 'దేహమూ, ఆత్మ వేరే అయితే, మరణానంతరం ఆత్మనాశనానికి అవకాశమెక్కడిది ? దేనిదైనా వినాశనాన్ని మనం ఊహించలేం. వీటిని ఎవడైతే తన సృజనమేధస్సుతో సృష్టించాడో వాడు మాత్రమే తన నిర్మూలన శక్తులతో నిర్మూలించగలడు. ఏచిన్నవస్తువైనాసరే భగవంతుడు దానిని ఉంచాలని సంకల్పిస్తే తప్ప నాశనం కావలసిందే. అయితే భగవంతుని సంకల్పం ఎట్లాఉందో ఆ భౌతిక వస్తువులు బట్టే తెలుసుకోవచ్చు. భౌతికాంశాల్లో ఏదీ నాశనం కావడం లేదు. నీరు ఆవిరి రూపంలో ఎగిరిపోయి మరలా నీరుగా మారిపోతున్నాది. ఎండిన ఆకులు చెట్లునుండి రాలి నేలమీద పడి, కృశించి సత్తువగా మారి మరల చెట్లు పెరగడానికి తోడ్పడుతున్నాయి. మరణించిన శరీరంలోని ప్రతి అంగమూ, ప్రతి సూక్ష్మాంశమూ విడిపోతున్నాయి. కాని వీటిలో ఏదీ నాశనం కావడంలేదు. కాబట్టి ఏతర్కంచేత మరణానంతరం ఆత్మ నాశనమౌతుందని నిరూపింపబడగలదు ? ఏసూక్ష్మాంశమైనా గట్టిగా ఉన్నప్పుడు భగవంతుడు ఆత్మను నాశనం చెయ్యాలని అనుకుంటాడా ?"

లేకపోతే, ఆయన "కలకత్తా బ్రహ్మోసమాజర్‌బక్తృత" ప్రసంగాల నుండి ఒక భాగం తీసుకోండి. "మనం అల్పజీవులమైనప్పటికీ, మన అదృష్టాల్లోకల్లా ప్రధానమైంది, మనం భగవంతుని తెలుసుకోడానికి అర్హులం కావడం. అయితే ఆ పేరుకు న్యాయం చెయ్యడానికి నిత్యం మన ఆత్మను క్షాళనం చేసుకోవాలి. ఎవరైనాసరే ఆత్మను పరిశుద్ధం చేసుకోందే, ఆ ఆత్మలో స్వచ్ఛమైనవాడు, సర్వజ్ఞాని, స్వతంత్రుడు అయిన భగవంతుని చూడలేరు. మనం మన ఆత్మలోని కశ్మలాన్నంతా కడుక్కొని ఆ స్వచ్ఛ తత్వానికి అనువైన సాధనంగా తయారు చేసుకుంటే, ఆ భగవంతుని పట్ల

ప్రేమ దానంతట అదే పెరుగుతుంది. ఆ ప్రేమ ఒకసారి ఉద్భవిస్తే, అది ఆ భగవంతునికి ఇష్టమైన వస్తుసముదాయం పట్ల ప్రత్యేకమైన తృష్ణను కలిగిస్తుంది. ఆయన దివ్యానందభావాలను అనుసరించాలనే ఆత్రుతను కూడా కలిగిస్తుంది. ఆ బ్రహ్మానందాన్ని మనం ఆదర్శంగా పెట్టుకుంటే, భయం నుండి విముక్తి పొందవచ్చు. ఈ భయంకర ప్రపంచంలో ఆనందంగా ఉండొచ్చు''.

1864లో దేవేంద్రనాథ్ బ్రహ్మబంధు (సభ కేశవచంద్రసేనుని సంగత్‌సభాశాఖ)లో ఒకసారి ప్రసంగించారు. అది ''బ్రహ్మసమాజపంచ వింశతివత్సరపరిక్షత్‌వృత్తాంత్'' పేరుతో ప్రచురింపబడింది. అందులో దేవేంద్రనాథ్ ఇరవైఅయిదేళ్ళ బ్రహ్మసమాజానుభవాల్ని వివరించారు. ఆ గ్రంథ పీఠికలో అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని నిక్షేపించారు. ''ప్రేమ రహితమైన బ్రహ్మజ్ఞానం శుష్కజ్ఞానం. జ్ఞానరహితమైన ప్రేమ తామసం. ఆచరణ రహితమైన జ్ఞానంగాని, ప్రేమగాని నిష్ఫలం. ఇంకొకరకంగా జ్ఞాన, ప్రేమ రహితమైన ఆచరణ కేవలం డాంబికం''.

''జ్ఞాన్‌ఓధర్మర్‌ఉన్నతి'' జ్ఞాన, ధర్మాల అభివృద్ధి అన్న గ్రంథం పధ్నాలుగు అసంకల్పిత ప్రసంగాల సంకలనం. దేవేంద్రనాథ్ పార్కు వీధిలోని ఇంట్లో తన మునిమనుమలతో ముచ్చటిస్తూ చేసిన ప్రసంగాలివి. వాటిలో భూగ్రహం, మానవ నాగరికతలకు చెందిన ప్రాథమిక సత్యాలను విశదీకరణ ఉంటుంది. 1890-91 మధ్య కాలంలో దేవేంద్రనాథ్ ప్రసంగిస్తుంటే, ఆయన కుమారుడు క్షితీంద్రనాథ్‌టాగూర్ రాసిపెట్టాడు. అవి 1893లో పుస్తకరూపంలో వచ్చాయి.

పైవ్యాసాల్లో మహర్షి మానవ వికాస చరిత్రను, మత వికాస చరిత్రను వివరించారు. భూగోళం విశ్వంనుండి ఎట్లా ఉద్భవించింది, అందులోకి జీవశక్తి ఎట్లా ప్రవేశించింది, ప్రాణులు ఎట్లా పెరుగుతాయి, నిరంతర పరిణామంలో మనిషి ఎట్లా ఏర్పడ్డాడు - అనే అంశాల నుండి ఆధునికాంశాల వరకు ఎన్నో విషయాలను కథల రూపంలో వివరించారు. ఆ వ్యాసాలు బాలలకు ఉద్దేశించినవే అయినా, భూగోళశాస్త్రం, మానవ శరీరశాస్త్రం, ఖగోళశాస్త్రం, చరిత్రవంటి విషయాల్లో ఆయనకున్న పరిజ్ఞానాన్ని రుజువు చేస్తున్నాయి. ఆ శాస్త్రాలను ఆయనా క్షుణ్ణంగా చదువుకొన్నారు. అంతేకాక తన అవసానదశ వరకు ఆయాశాస్త్రాలలో వస్తున్న మార్పుల్ని గమనిస్తూనే ఉన్నారు. ఆయన సొంత గ్రంథాలయంలో శాస్త్రగ్రంథాలు అసంఖ్యాకంగానే ఉన్నాయి. ఆ

పుస్తకాల్లో తన అభిప్రాయాలు రాసిపెట్టి ఉండడం, ఆ గ్రంథాలను ఆయన లోతుగా పరిశీలించారని నిరూపిస్తున్నది.

ఆఖరుగా ఆయన పత్రావళి (లేఖలు)ని చూద్దాం. ఈ లేఖలు మహర్షి అప్పుడప్పుడు (1850-87) రాజనారాయణ బోసు, బచరాం చటర్జీ, కేశవ చంద్రసేన్, ప్రతాపచంద్ర మజుందార్, విజయకృష్ణగోస్వామి, సౌదామినీదేవి నవకృష్ణచటర్జీ మొదలైనవారికి రాసినవి. లేఖల్లో సభ్యత, ఆర్ద్రత, ఆత్మీయత ఉట్టిపడుతున్నాయి. ఆ సంకలనంలోనే కేశవచంద్రసేన్ రాసిన పది ఉత్తరాలు, ద్వారకనాథ్, మాక్స్‌ముల్లర్ రాసిన ఇంగ్లీషు ఉత్తరాలు – చెరొకటి – ఉన్నాయి.

'ఆత్మజీవని' ఉత్తమశైలిలో రచింపబడింది. అందులో మహర్షి చెబుతుంటే, ఎక్కువ భాగాన్ని పండిత ప్రియనాథ శాస్త్రి, తక్కిన భాగాన్ని పండిత హేమచంద్రవిద్యారత్న రాశారు. విద్యారత్న దానిని 1898లో ప్రచురించారు. ఇది దేవేంద్రనాథ్ రచనలన్నిటిలో నిస్సందేహంగా తలమానికం.

ఏభైఏళ్ళపాటు దేవేంద్రనాథ్ చేసిన రచనల్లో ఇవి ముఖ్యమైనవి. ఇంకా చాలా ఉన్నాయి. వాటిలో ఎక్కువ భాగం కరపత్రాల రూపంలోనే ఉన్నాయి.

ఆయన గ్రంథాల్లో 'బ్రహ్మోధర్మః', 'బ్రహ్మోధర్మర్ వ్యాఖ్యాన్', 'జ్ఞాన్ఓధర్మర్ ఉన్నతి', ఎలాగూ ఆత్మజీవని - ఈ నాలుగు మరీ ముఖ్యమైనవి. చివరిది ఉత్తమోత్తమం. ఆ రచనల్లో భగవంతుని గాఢంగా ప్రేమించే ఒక అంతరవ్యక్తి, ఒక గొప్ప మత తత్వవేత్త, ఒక శాస్త్రీయ సత్యాన్వేషి, ఒక కవి దర్శనమిస్తాడు. దేవేంద్రనాథ్ జీవితాన్ని అంతరంగికంగానూ, బాహిరంగాను దర్శించారు కాబట్టి, ఆయన రెండు రకాలు గానూ ఋషి అవుతున్నారు. దేవేంద్రనాథ్ ఈనాలుగు గ్రంథాలే రచించి, తక్కినవన్నీ నశించిపోయి ఉన్నా, అప్పుడు కూడా, పందొమ్మిదో శతాబ్దపు బెంగాలీ వచన రచయితల్లో ప్రముఖుల్లో ఆయన పేరు తప్పకుండా నిలిచి ఉండేది.

మనోజ్ఞమైన వచనంతో పాటు, దేవేంద్రనాథ్ అసంఖ్యాకంగా శ్లోకాలు, బ్రహ్మసంగీత్‌లు బహ్మస్తుతిరూపాలైన భక్తిపాటలు కూడా రాశారు. శ్లోకాలు పాత సంస్కృత మంత్రాల నుండి దాదాపు అరువు తెచ్చుకొన్నవి. బ్రహ్మసంగీత్‌లు మాత్రం బెంగాలీ భాషలో ఆయన

రాసినవే. ఉదాహరణకు ఒక్క అనువాదం (కేనభోలో భోలో చిరసుహృద్ - మొ॥)

"ఎందుకు విస్మరిస్తావ్ నీశాశ్వత మిత్రుని ? విస్మరించకు
ఎందుకు విస్మరిస్తావ్ మిత్రుని. అతని నుండే సంపద,
జీవితం, గౌరవం - అన్నీ మొలకెత్తాయి.

వద్దు వద్దు ఆయనకు దూరం కావద్దు.
ఎక్కడి శాంతి, ఎక్కడి విశ్రాంతి, అతన్ని కాదని
ఓ! ఎందుకు విస్మరిస్తావ్ ఆ జీవమిత్రుని ?
దివ్యసహాయమూలాన్ని, దయాళుని.

అనువాదం మూల భక్తిపాటలాగా కొట్టొచ్చినట్టు లేదుగాని, భావ స్ఫూర్తి మాత్రం ప్రస్ఫుటంగా ఉంది. ఈ పాటకు కుకుభ్‌రాగంలో, అఢధేక తాళంలో స్వరం కట్టబడింది. బ్రహ్మసంగీత్‌లు సాధారణంగా ద్రుపద శైలిలో పాడతారు. రామ్మోహన్, దేవేంద్రనాథ్ దారిచూపగా, రవీంద్రనాథ్ తర్వాతి కాలంలో అటువంటి పాటలు అసంఖ్యాకంగా ఇతరులకు సాధ్యంకాని పదప్రయోగంతో, స్వర సమ్మేళనంతో రాశారు.

ఈ అధ్యయనానికి ముక్తాయింపుగా రవీంద్రనాథ్‌టాగూర్ తన తండ్రి మత, సాహితీ సాధనను గురించి చెప్పిన మాటలు ఉదాహరించి ముగిస్తాను.

"ఆయన సత్యాన్ని తెలుసుకోవాలనే ఆసక్తి గలవారు. ఆ సత్యాన్ని కేవల జ్ఞాన విషయంగానే కాక, ఆనంద విషయంగా కూడా అనుభవించాలనుకున్నారు. ఆ ఆసక్తి జ్ఞానానికి చెందిన కేవల ఉత్కంఠకాదు, గుండెలోతుల నుండి పుట్టుకొచ్చిన కోరిక. ఇక్కడ ఆయన ప్రకృతి సంపూర్ణయోగం కోసం ఎదురు చూస్తున్నది. మహర్షి భక్తిలోను, జానంలోను సంపూర్ణ బ్రహ్మ స్వరూపాన్ని దర్శించాలనుకొని దర్శించకలిగారు. ఆయన హృదయం కష్ట పరంపర - ప్రయత్నం - అవగాహన - తృణీకరణ - అనే సంఘటనా స్రవంతి ద్వారా పొందగలిగిన సచ్చిదానంద స్వరూపుడైన బ్రహ్మను చేరుకొనే మార్గంలో ఎప్పుడూ పయనిస్తూనే ఉండేది. తన లక్ష్యం నెరవేరేదాకా ఆయన ఒక్క నిమిషం కూడా విశ్రాంతి తీసుకొనేవారు కారు." (మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్ : రవీంద్రనాథ్ టాగూర్, విశ్వభారతి.)

# మహర్షి జీవితంలో
# ముఖ్యమైన తేదీలు - సంఘటనలు

1817: 15 మే, కలకత్తాలో జననం.

1823: కలెక్టరు, 24 పరగణాలకు ఉప్పు ఏజంటు అయిన ప్లోడెన్ దొర దగ్గర దివాన్‌గా నియమింప బడ్డారు.

1827: రాజారామ్మోహన్‌రాయ్ గారి ఆంగ్లో హిందూ పాఠశాలలో ప్రవేశం.

1828: 20 ఆగష్టు. రామ్మోహన్‌రాయ్ చేత కమల్లోచన్ ఇంట్లో బసు (చిత్పూర్, కలకత్తా) బ్రహ్మసభ స్థాపన.

1829: 1 ఆగష్టు. యూనియన్ బ్యాంకు ప్రారంభం.

1830: 19 నవంబరు. రామ్మోహన్ ఇంగ్లండుకు వెళ్ళారు. అంతకు ముందు దేవేంద్రనాథ్‌కు ప్రేమ పూర్వక ఆశీర్వాదం చెబుతూ వీడ్కోలు తీసుకొన్నారు.

1831: హిందూ కళాశాలలో ప్రవేశం.

1833: సర్వతత్త్వ దీపికాసభ ప్రారంభం. ఇందులో కార్యక్రమాలన్నీ బెంగాలీ భాషలో నిర్వహింపబడేవి.

1833: 27 సెప్టెంబరు. ఇంగ్లండులోని బ్రిస్టల్లో రామ్మోహన్ రాయ్ మరణం.

1833: హిందూ కళాశాలలో విద్య ముగించారు.

1834: శారదాదేవిని వివాహ మాడారు. తన వయస్సు 17. ఆమె వయస్సు 8.

1834: ద్వారకనాథ్ ఉద్యోగం మానేసి కార్, టాగూర్ & కంపెనీ వ్యాపారం ప్రారంభించారు. యూనియన్ బ్యాంకులో సహాయ కోశాధికారిగా ప్రవేశం.

1838: అవ్వ చనిపోయింది. ఆ సమయంలో ఆయన హృదయంలో ఒక అపూర్వ భావ సంచలనం కలిగి విశ్రాంతి లేకుండా చేసింది.

1839 : 6 అక్టోబరు. 'తత్త్వరంజనీ సభ' స్థాపించారు. తర్వాత రామ చంద్ర విద్యాబాగీష్ సలహా మేరకు "తత్త్వబోధినీ సభ" గా పేరు మార్చారు. విగ్రహారాధన త్యజించడానికి తీర్మానించ బడింది. ఎగిరి వచ్చిన ఈశోపనిషత్తు కాగితాన్ని చూచారు. అందులోని భావంతో ప్రభావితులైనారు. విద్యాబాగీష్ సహా యంతో ఉపనిషదధ్యయనం ప్రారంభించారు.

1840 : జూన్. తత్త్వబోధినీ పాఠశాలను స్థాపించి, అక్షయకుమార దత్తను ఒకానొక ఉపాధ్యాయుడుగా నియమించారు.

1841 : 14 సెప్టెంబరు. తత్త్వబోధినీ సభ వార్షికోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు.

1842 : 9 జనవరి. ద్వారకనాథ్ ఇంగ్లండు నుండి తిరిగొచ్చారు. అగష్టు. దేవేంద్రనాథ్ తత్వబోధినీ పత్రికను ప్రారంభించి, అక్షయకుమార్ దత్తను సంపాదకులుగా నియమించారు.
ఆ పత్రికలో ఉపనిషత్తులను, అనువదించడం ప్రారంభించారు.
21 డిసెంబరు. రామచంద్ర విద్యాబగీష్ నాయకత్వంలో 'బ్రహ్మోధర్మ' లోకి తన ఇరవై మంది సహచరులతో ప్రవేశించారు.

1845 : 8 మార్చి. ద్వారకనాథ్ రెండోసారి ఇంగ్లండు వెళ్ళారు.
25 మే. క్రైస్తవ మిషనరీల బోధలను ఎదుర్కోవడానికి 'హిందూహితార్థి విద్యాలయ'ను స్థాపించారు.
అలెగ్జాండర్ డఫ్ హిందూవ్యతిరేక వాదనలకు ప్రతిగా 'వేదాంత సిద్ధాంత ప్రతిపాదన" ప్రచురించారు.
వేదాల నిర్దుష్టత మీద అక్షయకుమార్ దత్తతో అభిప్రాయ భేదం.

20 డిసెంబరు. ఒకరోజు (మేళ) ఉత్సవం జరపడానికి 500 మంది బ్రహ్మసామాజికులతో గోరితి ఇంట్లో సమావేశమయ్యారు.

1846 : 22 మే. ప్రాపంచిక విషయాలపట్ల దేవేంద్రనాథ్ ఉదాసీన వైఖరిని మందలిస్తూ ద్వారకనాథ్ ఇంగ్లండు నుండి ఉత్తరం రాశారు.

1 ఆగష్టు. ఇంగ్లండులో ద్వారకనాథ్ మరణించారు.
15 అక్టోబరు. విగ్రహం లేకుండా, బంధువుల కందరికీ దూరం అయ్యేటట్టు తండ్రికి శ్రాద్ధం పెట్టారు.

1847 : సెప్టెంబరు. వైదిక పండితులతో గోష్ఠులు జరపడానికి వారణాసికి వెళ్ళారు.

27 - 31 డిసెంబరు. యూనియన్ బ్యాంకు ఋణాల్లో పడి పోయింది.

1848 : 12 జనవరి. కార్, టాగూర్ అండ్ కంపెనీ తలుపులు మూతలు పడ్డాయి. ఆర్థిక దుస్థితివల్ల జీవనస్థాయిని కఠినం చేసుకొన్నారు. ప్రాచీన మత గ్రంథాలను పూర్వంకన్నా ఎక్కువ దీక్షతో చదవసాగారు. శాస్త్రాధ్యయనం వల్ల బ్రహ్మ ధర్మానికి ఉపనిషత్తులు ఇంక ఆధారం కాజాలవన్న నిర్ణయానికి వచ్చారు.

మార్చి - తత్త్వబోధినీ పత్రికలో ఋగ్వేదానువాదం ప్రారంభించారు. ఆ అనువాదం 24 సంవత్సరాలు కొనసాగింది.

4 ఏప్రిలు. ఒక సమావేశంలో కార్, టాగూర్ అండ్ కంపెనీ అప్పులు, ఆస్తులు నిర్ణయింపబడ్డాయి. ద్వారకనాథ్ కుమారులకు అప్పులు తీర్చడానికి తగిన వ్యవధి ఇవ్వబడింది.

"బ్రహ్మోధర్మః" మొదటి ప్రతి తయారయింది.

1849 : బ్రహ్మోధర్మః – వ్యాఖ్యానం లేకుండా ప్రచురింపబడింది.

1851 : 31 అక్టోబరు. బ్రిటిష్ ఇండియన్ అసోసియేషన్ కార్యదర్శి అయ్యారు.

1856 : 3 అక్టోబరు. హిమాలయాలకు ప్రయాణమయ్యారు.

1857 : 27 ఏప్రిల్. సిమ్లా చేరుకొన్నారు. సిమ్లా కొండల్లోని విభిన్న స్థలాల్లో ఇరవైనెలలు పైగా ఉన్నారు.

1858 : 15 నవంబరు తిరిగి కలకత్తా చేరుకొన్నారు.

1859 : తత్త్వబోధినీ సభ మూసివేయబడింది. ఆ సభ నిర్వహించే ప్రచార కార్యక్రమం బ్రహ్మసమాజం స్వీకరించింది. బ్రహ్మ సమాజ కార్యదర్శి పదవికి ఈశ్వర చంద్ర విద్యాసాగర్ రాజీనామా చేసిన తర్వాత, దేవేంద్రనాథ్, కేశవచంద్రసేన్‌లు సంయుక్త కార్యదర్శులయ్యారు.

27 సెప్టెంబరు. తన రెండో అబ్బాయి సత్యేంద్రనాథ్‌తోను కేశవచంద్రసేన్‌తోను కలిసి ప్రచారార్థం సిలోన్‌కు బయలుదేరారు.

1861 : ఇంగ్లండులోని 'మెథడిస్టుల సభ'ల మాదిరిగా కేశవచంద్ర 'సంగత్ సభ'ను స్థాపించారు.

1862 : 13 ఏప్రిలు. కేశవచంద్రసేన్‌ను బ్రహ్మసమాజాచార్యులుగా నియమించారు.

1863 : బోల్‌పూర్ దగ్గర పెద్ద స్థలం కొన్నారు. అది తర్వాత ఆయన కుమారుడు రవీంద్రనాథ్ టాగూర్ ద్వారా "శాంతి నికేతన్ బ్రహ్మచార్య ఆశ్రం" అయింది.

1864 : మొదటిసారిగా కేశవ చంద్రసేన్‌తో సాంఘిక, మత సంస్కరణలకు సంబంధించి అభిప్రాయభేదాలు తలెత్తాయి. అక్టోబరు, జంధ్యాలు ధరించిన సమాజాచార్యులు సమాజానికి నాయకులుగా ఉండడానికి వ్యతిరేకంగా కేశవ్ అనుయాయులు బహిరంగంగా తిరుగుబాటు చేశారు.

1866 : కేశవచంద్రసేన్ వర్గం వారు బ్రహ్మసమాజం నుండి విడిపోయి 'భారతీయ బ్రహ్మసమాజం' అనే కొత్త సంస్థను నెలకొల్పారు.

1867-70 : ప్రజాజీవితం నుండి విరమించి, ఎక్కువ కాలం యాత్రల్లో గడిపారు.

1872 : కేశవ చంద్రసేన్ ప్రతిపాదించిన "బ్రహ్మ వివాహ చట్టం" సంబంధించి బ్రహ్మసామాజికుల్లో గొప్ప సంచలనం చెలరేగింది. దేవేంద్రనాథ్ నాయకత్వంలోని "ఆది బ్రహ్మ సమాజం" దానిని వ్యతిరేకించింది.

1873-75 : ఎక్కువ కాలం యాత్రల్లో, ముఖ్యంగా హిమాలయాల్లో గడిపారు.

1875 : మార్చి. దేవేంద్రనాథ్ సతీమణి - శారదాదేవి కలకత్తాలో మరణించారు.

1877-78 : చైనా సందర్శించారు.

1879-85 : యాత్రలు చేస్తూ క్షీణిస్తున్న ఆరోగ్యాన్ని బాగుచేసుకోవడానికి దేశం నలుమూలలా సంచరించారు.

1886 : బోల్‌పూర్ భూములకు సంబంధించి ఒక ట్రస్ట్‌ను ఏర్పరిచారు.

భవిష్యత్తులో అక్కడ ఒక్క ఆశ్రమం కట్టి, నైరూప్య ఏకేశ్వ రోపాసన మాత్రం చేయబడాలని కోరారు.

1898 : ఆత్మజీవని (ఆత్మకథ) ప్రచురింపబడింది.

1905 : 19 జనవరి కలకత్తాలో మరణించారు.

# సుసంచిత గ్రంథసూచి

ఇది మహర్షి దేవేంద్రనాథ్ రాసిన, ఆయనను గురించి ఇతరులు రాసిన గ్రంథాల నుండి ఎన్నిక చేసిన సూచిక. ఈ గ్రంథాల పట్టిక తయారు చెయ్యడంలో రచయిత జోగీశ చంద్రబాగల్‌కు ఋణపడి ఉన్నాను. శ్రీబాగల్ "దేవేంద్రనాథ్ టాగుర్" అనే జీవిత చరిత్ర రచించినారు. దానిని "వంగీయ సాహిత్య పరిషత్" వారు తమ "సాహిత్యసాధక్-చరిత్రమాల"లో ప్రచురించారు. ఆ గ్రంథంలో వివర పేర్కొన్న గ్రంథాల వివరాలు చాలా విలువైనవి ; నాకందించారు. వారికి కృతజ్ఞతలు.

## 1. మహర్షి రచనలు

### 1.1. బెంగాలీ రచనలు :

**బెంగ్లాభాసై సంస్కృత వ్యాకరణ్.** దేవేంద్రనాథ్ మొట్టమొదటి రచన. 1838 ప్రాంతంలో వ్రాయబడినట్టు విశ్వసింపబడుతున్నది. అలభ్యం.

**బ్రాహ్మోధర్మ :** రెండు భాగాలు. 1849. బెంగాలీ అనువాదంతో కొత్త ప్రచురణ 1851 - 52లో వచ్చింది. టీకాతాత్పర్యాలతో సంపూర్ణ గ్రంథం 1869లో వచ్చింది.

**ఆత్మతత్త్వ విద్య :** 1852. తత్త్వబోధినీ పత్రికలో వ్రాసిన వ్యాసాల నుండి సంకలింపబడింది.

**బ్రాహ్మోధర్మేర్ మత్ ఓవిశ్వాస్ :** 1890. 1859 - 60 మధ్య కాలంలో బ్రహ్మవిద్యాలయంలో చేసిన పది ప్రసంగాల సంకలనం.

**పశ్చింప్రదేశర్ దుర్భిక్ష ఉపశమే సహాజ్య సంగ్రహర్తే బ్రహ్మసమాజర్ బక్తిత :** 1862. హిమాలయాల నుండి తిరిగొచ్చి బ్రహ్మసమాజం (కలకత్తా)లో చేసిన ప్రసంగాలు. యదునాథ్‌చటర్జీ సంకలించి ప్రచురించారు.

**మాసిక్ బ్రహ్మోసమాజర్ ఉపదేశ :** 1860 - 67 మధ్య కాలంలో బ్రహ్మసమాజంలో చేసిన 18 ప్రసంగాల సంకలనం.

బ్రహ్మోధర్మర్ వ్యాఖ్యాన్: మొదటిది. 1861. రెండవది 1866 రెంటికి ముగింపు మాటలు 1885. దేవేంద్రనాథ్ మొట్టమొదటిసారి బ్రహ్మసమాజం గురుపీఠం నుండి చేసిన ప్రసంగాలు.

బ్రహ్మవివాహప్రణాళిక: 1864. బ్రహ్మ వివాహ పద్ధతికి చెందిన చిన్న పుస్తకం.

బ్రాహ్మోసమాజర్ పంచవింశతవత్సరర్ పరిక్షిత్ వృత్తాంత: 25 సంవత్సరాల బ్రహ్మ సమాజ చరిత్రను 1864 లో బ్రహ్మబంధు సభలో దేవేంద్రనాథ్ వివరిస్తూ చేసిన ప్రసంగం

బ్రాహ్మోధర్మర్ అనుష్ఠాన్ పద్ధతి: 1865. పుట్టుక, పేరు బెట్టడం, ఉపనయనం, ప్రవేశం, పెండ్లి మొదలైన బ్రహ్మ ఉత్సవాలు ఎలా నిర్వహించాలో వర్ణించే పుస్తకం.

భవని పూర్ బ్రహ్మ విద్యాలయర్ ఉపదేశ్: 1965 - 66 భవనిపూర్ బ్రహ్మవిద్యాలయంలో చేసిన ప్రసంగాల సంకలనం.

జ్ఞాన్ ఓ ధర్మర్ ఉన్నతి: 1893. యువ విద్యార్థులకోసం ప్రపంచ సృష్టిని గురించి, మానవ పరిణామాన్ని గురించి చేసిన 14 అనియత ప్రసంగాలు. క్షితీంద్రనాథ్ టాగూర్ సంకలించారు.

పరలోక్ ఓ ముక్తి: 1895. జీవితానికి అవతల - ఇటువంటి విషయాలమీద చిన్న పుస్తకం. పూజ్యపాద్ శ్రీమన్ మహర్షి దేవేంద్రనాథ్ ఠాకుర్ స్వరచిత జీవన చరిత్ (ఆత్మకథ) 1878. ఆత్మజీవని అనే పేరుతో ప్రియనాథ్ శాస్త్రి ప్రచురించారు. నాల్గవ ప్రచురణ, 1962. సంపాదకులు సతీశ్‌చంద్రచక్రవర్తి. విశ్వభారతి.

పత్రావళి: 1850–87 మధ్యకాలంలో వ్రాసిన ఉత్తరాలు ప్రచురించారు. హితవాది ప్రెస్. కలకత్తా.

## 1.2. ఆంగ్ల రచనలు

వేదాంతిక్ డాక్ట్రిన్స్ విండికేటెడ్: 1845, అలెగ్జాండర్‌డఫ్ హిందూయిజంకు వ్యతిరేకంగా లేవదీసిన అంశాలకు

సమాధానంగా తత్త్వబోధిని పత్రికలో రాసిన వ్యాసాలు. పుస్తకరూపంలో ప్రచురింపబడ్డాయి.

ది ఆటోబయోగ్రఫి ఆఫ్ మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్: యస్. కె. లాహిరి అండ్ కో, కలకత్తా 1909. బెంగాలీ నుండి సత్యేంద్రనాథ్ ఇందిరాదేవి అనువదించారు. రెండవ పరిష్కరణ, మాక్‌మిల్లియన్ అండ్ కో, లండన్, 1914

## 2. మహర్షి పై ఇతరులు

### 2.1. బెంగాలీ రచనలు :


బాగల్, జోగిశ చంద్ర : దేవేంద్రనాథ్ ఠాకుర్, 3వ పరిష్కరణ. వంగీయ సాహిత్య పరిషత్, కలకత్తా, 1957.

బోస్, రాజ్ నారాయణ్ : సెకెల్ ఆర్ ఎకల్, కలకత్తా 1358 బి.యస్.

బాగల్, జోగీశ చంద్ర
బర్మన్, దేవజ్యోతి
చక్రవర్తి సతీష్‌చంద్ర : ఆత్మజీవని ఆఖర్లో ముగ్గురూ రాసుకున్న అంశాలు. సతీష్ చంద్ర చక్రవర్తి పరిష్కరించినవి. నాల్గవ పరిష్కరణ. విశ్వభారతి, 1962.

చక్రవర్తి, అజిత్‌కుమార్ : మహర్షి దేవేంద్రనాథ్ ఠాకుర్. ఇండియన్ ప్రెస్, అలహాబాద్, 1916. కొత్త పరిష్కరణ, జిజ్ఞాస, కలకత్తా, 1971.

చటర్జీ, నాగేంద్రనాథ్ : మహాత్మారాజారామోహన్‌రాయర్ జీవన్ చరితె 5వ పరిష్కరణ, ఇండియన్ ప్రెస్, అలహాబాద్, 1928.

పునర్ముద్రణ, డేబుక్ స్టోర్, కలకత్తా, 1971.

దత్త, భావసింధు : మహర్షి దేవేంద్రనాథ్ ఠాకురర్ జీవన్ చరిత్. కలకత్తా, 1914.

ముఖోపాధ్యాయ్, ప్రభాత్‌కుమార్ : రబీంద్ర జీవని, మొదటి భాగం, విశ్వభారతి.

టాగూర్, క్షితీంద్రనాథ్ : ద్వారకనాథ్ ఠాకురర్‌జీవని, రబీంద్రభారతి యూనివర్సిటీ, కలకత్తా, 1969.

టాగూర్, రబీంద్రనాథ్ : మహర్షి దేవేంద్రనాథ్. ఇందులో సౌదామిని దేవి గారి స్మృతులు కూడా ఉన్నాయి. 'పితృస్మృతి',

సంకలనం - పులిన్‌బిహారీ సేన్, విశ్వభారతి, 1967.

మహర్షి దేవేంద్రనాథ్ ఠాగూర్ : మహర్షి 150 వ జన్మదిన సందర్భంగా ప్రచురితం, శాంతినికేతన్, 1967.

2.2. ఆంగ్ల రచనలు

హల్దార్, సుకుమార్, బి.ఎ : ఎమిడ్, విక్టోరియన్ హిందూ. స్కెచ్ ఆఫ్ లైఫ్ అండ్ టైమ్స్ ఆఫ్ రాఖల్‌దాస్ హల్దార్, 1921.

మిత్ర, కిస్సోరీ చంద్ : మెమోయిర్ ఆఫ్ ద్వారకనాథ్ టాగూర్, థాకెర్, స్పింక్ అండ్ కో, 1870.

శాస్త్రి, శివనాథ్ ఎం.ఏ. : హిస్టరీ ఆఫ్ ది బ్రహ్మసమాజ్. సం. 1, రెండవ పరిష్కరణ, ఆర్. చటర్జి 1919.

Indian ... SHIMLA
117682
20/12/04

బెంగాల్ భాషలో మహర్షి దేవేంద్రనాథ్ టాగుర్ సాహితీకృషి ఒక రకంగా యాదృచ్ఛికం. ఆ రచనలన్నీ ఆయన మత విశ్వాసాలను మంచి భాషలో, తీర్చిదిద్దిన పద్ధతిలో చెప్పడానికి చేసిన ప్రయత్న ఫలితాలే. రామ్మోహన్‌రాయ్ తరానికీ, తర్వాతి కాలంలో వచ్చిన మత నాయకులకు వారధి దేవేంద్రనాథ్. ఆయన రచనల్లోని సాహితీ గుణాల్ని పరిశీలించడానికి పూనుకుంటే మనం సహజంగానే ఆయన ఆధ్యాత్మిక యాత్రల్లోకి ప్రవేశిస్తాం. ఆయన రచనలన్నింటిలోకి "ఆత్మ జీవని" ఉత్తమమైనది. ఆయన "బ్రహ్మ ధర్మ వ్యాఖ్యానం" పేరునుబట్టే చెప్పకోదగిందనిపిస్తుంది. ఆయన జీవితం ప్రాచ్య ఋషులు ఉపనిషత్తుల్లోను, సంస్కృత కావ్యాల్లోను చెప్పిన జీవిత సాధన కోసం చేసిన అన్వేషణమే. అన్వేషణను తిరిగి చెప్పడమే ఆయన సాహిత్యం. ఆయన వచన రచనలు శైలిలో సమతా సంయమనాలకు, అభివ్యక్తిలో సాంద్రతా గాంభీర్యాలకు, అన్నిటినీ మించిన ప్రకృతి సౌందర్య దర్శనకు నిదర్శనాలు.

రామ్మోహన్, ఈశ్వరచంద్ర, అక్షయకుమార్ దత్తలతో బాటు, దేవేంద్రనాథ్ కూడా బెంగాలీ వచనం రూపుదిద్దుకొంటున్న కాలంలో, దానిని మలచిన ప్రధాన శిల్పులలో ప్రధాన వ్యక్తి.

మహర్షి దేవేంద్రనాథ్ టాగుర్ అనే ఈ గ్రంథంలో నారాయణ చౌధురి, ఆయన మతవ్యక్తిత్వపు కాంతినుండి ని[illegible] పైకి తీశారు.

Library IIAS, Shimla
TL 923.654 T 326 C
00117682

ముఖపత్ర రచన : సత్యజిత్‌రాయ్

ముఖచిత్రం : సువిమల్ లాహిరి, విశ్వభారతి

SAHITYA AKADEMI
REVISED PRICE Rs. 15-00